www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

గురువారం | 15-2-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 216 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య రా. 2.35 తదుపరి ఫాల్గుణ శు. పాడ్యమి; నక్షత్రం: శ్రవణం ఉ. 7.31 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 11.53-1.38; దుర్ముహూర్తం: ఉ. 10.35-11.21, మ. 3.10-3.56; అమృతఘడియలు: రా. 10.22-12.06; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 6.14 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

బ్యాంకులో బడా దొంగలు

- రూ.11,346 కోట్ల అక్రమ లావాదేవీలు
- అక్రమార్కులతో బ్యాంకు సిబ్బంది కుమ్మక్కు
- 10 మంది బ్యాంకు ఉద్యోగులపై వేటు
- జువెలరీ డిజైనర్ నీరవ్ మోదీపై ఈడీ కేసు
- బ్యాంకు షేర్లు ధమాల్.. 3,844 కోట్లు నష్టం


బ్రిటన్ ప్రిన్స్ చార్లెస్‌తో నీరవ్ మోదీ(ఫైల్)

11

బ్యాంకింగ్ రంగంలో మరో భారీ కుంభకోణం బయట పడింది. ప్రముఖ జువెలరీ డిజైనర్ నీరవ్ మోదీ, అతడి అనుచరులు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను రూ.11,346 కోట్ల మేరకు ముంచేశారు. ముంబైలోని పీఎన్‌బీ శాఖ అధికారులతో కుమ్మక్కై, వారు అక్రమ లావాదేవీలు జరిపినట్టు బయట పడింది. విదేశాల్లోని సరఫ రాదారులకు చెల్లించేందుకంటూ అక్రమంగా లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ పొందడం ద్వారా వారు ఘరానా దందాకు పాల్పడ్డారు. 2011 నుంచి ఈ అక్రమ లావాదేవీలు జరుగుతున్నట్టు గుర్తించిన బ్యాంకు ఉన్నతాధికారులు సీబీఐకి ఫిర్యాదు చేశారు. సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా నీరవ్ మోదీపై కేసు నమోదు చేసింది. కుంభకోణం వెలుగులోకి రావడంతో స్టాక్ మార్కెట్‌లో పీఎన్‌బీ షేర్లు కుదేలయ్యాయి.


మహబూబ్‌నగర్‌లో జరిగిన అండర్-17 జాతీయ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ బాలురు, బాలికల విభాగాల్లో తెలంగాణ జట్లు చాంపియన్స్‌గా నిలిచాయి. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో ఢిల్లీ జట్లతో పోటీపడిన తెలంగాణ జట్లు ఎదురులేని విజయం సాధించి సత్తా చాటాయి.

గనులు పదిలం

అవి అక్షయం కావు.. జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి

- ప్రజారోగ్యానికి, పర్యావరణానికి మైనింగ్ హాని కలిగించకూడదు
- గవర్నర్ నరసింహన్ సూచన
- కొత్త విధానంతో రాష్ట్రాలకూ ఆదాయం వస్తోంది: తోమర్
- 'బయ్యారం'పై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి: మంత్రి కేటీఆర్
- మైనింగ్ సదస్సు ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గనులు అక్షయ పాత్రలు కావని, జాగ్రత్తగా ఉప యోగించుకోవాలని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సూచిం చారు. పర్యావరణం, ప్రజారో గ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గనుల తవ్వకం (మైనింగ్) జరపాలని ఆయన కోరారు. భవిష్యత్తు తరా లకు ఉపయోగపడే విధంగా మైనింగ్ విధానం ఉండాలని

మిగతా 6వ పేజీలో...



మైనింగ్ టుడే-2018 సదస్సులో బ్రోచర్, సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ నరసింహన్, కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ తదితరులు

మా వాటా మాకు రావాల్సిందే

- కృష్ణానదిలో 575 టీఎంసీల నీళ్లు దక్కాలి
- పోతిరెడ్డిపాడులో ఏపీ ఎక్కువగా తరలిస్తోంది
- పట్టిసీమలోనూ తెలంగాణకు వాటా ఉంది
- పోలవరం ప్రభావం 124 కిలోమీటర్లు!
- అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడదాం


సమీక్షా సమావేశంలో మంత్రి హరీశ్‌రావు, సీఎస్ జోషి, ఓఎస్డీ దేశ్‌పాండే

సర్కారు నిర్ణయం.. నేడు ఢిల్లీలో సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటాపై పోరాడాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విష యంలో కేంద్ర ప్రభుత్వానికి తన వాదనను గట్టిగా వినిపించాలని నిశ్చయించింది. తెలంగాణ రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగేలా ఆంధ్రప్రదేశ్ చేసే ప్రతిపాదన లను తిప్పి కొట్టడంపైనా దృష్టి సారించింది. ఢిల్లీలో జరగనున్న సత్వర సాగునీటి ప్రయోజన పథకం(ఏఐబీపీ) సమావేశంలో అనుసరించవలసిన వ్యూహంపై బుధ వారమిక్కడ జలసౌధలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి హరీశ్‌రావు సుదీ ర్ఘంగా చర్చించారు. గురువారం కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

మిగతా 6వ పేజీలో...

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



ఆ చెట్లను నరకొచ్చు!

- వేప, నల్ల తుమ్మ, నేరేడు, రావి చెట్లపై ఆంక్షల తొలగింపు
- జీవో 31ని సవరిస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సొంత భూమిలో పెంచుకున్న వేప, నల్ల తుమ్మ, నేరేడు, రావి చెట్లను కొట్టడం, రవాణా చేయడంపై ఆంక్షలు తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విడుదల చేసిన జీవో 31కు సవరణ చేసింది. ఆ జీవో ప్రకారం వేప, నల్ల తుమ్మ, రావి, నేరేడు చెట్లను అటవీ శాఖ అధికా రుల అనుమతి లేకుండా నరకవద్దని, రవాణా చేయవద్దని ఆంక్షలు విధించింది. సొంత భూమిలో పెంచుకున్నవాటికి కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. దీంతో జీవో 31ని రద్దు చేయాలని విశ్వ బ్రాహ్మణులు, విశ్వకర్మలు, మరికొన్ని కులవృత్తుల వారి నుంచి డిమాండ్లు వచ్చాయి. రైతుల పనిముట్లను ఆ చెట్ల కలపతోనే తయారుచేస్తామని, వాటిని నరక వద్దని ఆంక్షలు విధిస్తే ఎలా? అని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వనపర్తి, వరంగల్ రూరల్, జనగాం జిల్లాలకు చెందిన కొంత మంది రైతులు జీవో 31ను రద్దు చేయాలని అటవీ శాఖకు వినతి పత్రాలను


మిగతా 3వ పేజీలో...

డిసెంబరు డెడ్‌లైన్!

- ఈపీ బకాయిలన్నీ చెల్లించాల్సిందే
- ఆరు విడతల్లో 458 కోట్లు కట్టాలి
- లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవు
- పరిహారం కేసులపై హైకోర్టు హెచ్చరిక
- ఏపీ ఇచ్చిన వివరాలపై సందేహం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భూసేకరణ వివా దాల్లో పరిహారం చెల్లింపుపై జారీ చేసిన ఆదేశాలు (ఎగ్జిక్యూషన్ ఆఫ్ ప్రాపర్టీ) అమలు చేయకపో వడంపై హైకోర్టు మండిపడింది. రెండు తెలుగు రాష్ట్రాల

మిగతా 6వ పేజీలో...



ఈ కార్పొరేట్ ఆస్పత్రి రైతుల కోసం

8 కోట్లతో కో-ఆపరేటివ్ స్టార్ వైద్యశాల

- ఖమ్మం డీసీసీబీ ప్రయోగం
- 17న ప్రారంభించనున్న మంత్రులు తుమ్మల, హరీశ్
- 1.6 లక్షల మంది రైతులకు, వారి కుటుంబాలకు ధీమా

ఖమ్మం, ఫిబ్రవరి 14: తినీ తినకా.. ఆరుగాలం శ్రమించి పంట పండించే రైతన్నలకు ఆరోగ్యం దెబ్బ తింటే సర్కారీ దవాఖానాలే దిక్కు! కానీ

మిగతా 2వ పేజీలో...



ఉచితంగా అభయహస్తం!

గతంలో చెల్లించిన ప్రీమియం వాపసు

భర్తలకూ వర్తింపు


త్వరలో అమలు

2

ఇంటింటికీ 'తెలంగాణ-చరిత్ర'

మార్చి 18 నుంచి పుస్తకాల పంపిణీ

2



అదే అసలైన యోగం



పరంజ్యోతి

'షిర్డీ సాయిబాబా స్వయంగా గొప్ప యోగి అయినా.. తన భక్తులకు యోగమార్గాన్ని అనుసరించమని ఎందుకు చెప్పలేదు?' అనే సందేహం చాలా మందికి వస్తుంటుంది. దీనికి సమాధానం కూడా సాయి జీవితంలోనే ఉంది. శ్రీ సాయి సచ్చరిత్రను చదివితే.. బాబాకు అన్ని రకాల యోగాల గురించి తెలుసని, ఆయన హఠయోగి అని అర్థమవుతుంది. కఠినమైన ఈ హఠయోగాన్ని సాధన చేయాల్సిందిగా బాబా ఎప్పుడూ తన భక్తులకు చెప్పలేదు సరికదా.. కఠినమైన యోగ పద్ధతులను వ్యతిరేకించారు కూడా. తనతో మమేకం అయిపోవడమే అసలైన యోగమని బాబా చెబుతుండేవారు. ఇలా మమేకం కావడానికి బాబా రెండు మార్గాలను సూచించారు. వాటిలో మొదటిది.. ఆయన భౌతిక రూపంతో మమేకం కావడం. ఇది ఒకస్థాయిలో ఉన్న భక్తుల కోసం. ఇక రెండోది.. అనిర్వచనీయమైన బాబా రూపాన్ని ఊహించుకుని ఆరాధించడం. ఇది ఏకాగ్రత ఎక్కువగా ఉన్న భక్తుల కోసం. తేనే పట్టు నుంచి తేనెను తీయడం ఒక ప్రక్రియ. ముందుగా కట్టెలను తీసుకువచ్చి.. తేనె పట్టు కింద పొగ పెట్టాలి. అప్పుడు దానిలో ఉన్న తేనె టీగలు పారిపోతాయి. ఆ తర్వాతే మనం తేనెను తీసుకుని ఆస్వాదించగలుగుతాం. మన జీవితాలూ తేనె తుట్టెలాంటివే. మన పూర్వకర్మలు, అజ్ఞానం, అహంకారం, ప్రతికూల ఆలోచనలు ఇవన్నీ తేనెటీగల్లాంటివి. వీటిని తరిమివేయడం అంత సులభం కాదు. వీటిని తరిమినప్పుడే మోక్షమార్గం ప్రత్యక్షమవుతుంది. అందువల్ల మనం ముందుగా జ్ఞానమనే అగ్నితో మనని మనం పునీతులను చేసుకోవాలి. ఈ జ్ఞానాగ్నితో పరిశుద్ధుడైన వ్యక్తి మోక్షమార్గానికి అర్హుడు. ఈ ప్రక్రియల్లో భగవంతుడితో మమేకమైతే మోక్షం చాలా సులభమవుతుందని బాబా చెప్పేవారు. అందుకే బాబా కఠినమైన యోగ ప్రక్రియలను ఎపుడూ భక్తులకు బోధించలేదు.

-డాక్టర్ భానుప్రకాష్ సత్పతి

మహాశివరాత్రి రోజున నాగరాజు దర్శనం



మహాశివరాత్రి పర్వదినాన నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం గోడసిర్యాల్‌లో శివాలయంలో భక్తులకు నాగరాజు దర్శనమిచ్చాడు. బుధవారం నీలకంఠేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అదే సమయంలో గర్భగుడిలోకి వచ్చిన నాగుపాము.. శివలింగాన్ని చుట్టుకొని భక్తులకు కనిపించింది. దీంతో నాగరాజే ఇలా ప్రత్యక్షమయ్యాడంటూ భక్తులు నాగుపాముకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- దస్తూరాబాద్

ఇంటింటికీ 'మన తెలంగాణ - మన చరిత్ర'


- మార్చి 18 నుంచి ప్రత్యేక పుస్తకాల పంపిణీ
- జాతీయ, అంతర్జాతీయ సదస్సులోనూ తెలుగుకు స్థానం: కేవీ రమణాచారి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చరిత్రను ప్రతి కుటుంబానికీ తెలియజేసేందుకు 'మన తెలంగాణ - మన చరిత్ర' పేరుతో ప్రత్యేక పుస్తకాన్ని రూపొందిస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి తెలిపారు. బుధవారం సచివాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణతో కలిసి వెల్లడించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ పుస్తకాన్ని తెస్తున్నామని, ఉగాది పర్వదినం సందర్భంగా మార్చి 18 నుంచి ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు. 2.5 కోట్ల పుస్తకాలను ముద్రిస్తున్నామని, ఇందులో తెలంగాణ భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక అంశాలతో పాటు కవులు, కళాకారులు, రచనలు, రాజులు, రాజరికాలు, కోటలు, తెలంగాణ సామెతలు ఇలా అన్ని అంశాలనూ పొందుపరుస్తున్నట్లు వివరించారు. తెలంగాణలో జరిగే జాతీయ, అంతర్జాతీయ సమావేశాల్లోనూ తెలుగు వినిపించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి సమావేశంలో ప్రారంభ వ్యాఖ్యలు తెలుగులో మాట్లాడేలా చర్యలు తీసుకుంటున్నట్లు రమణాచారి చెప్పారు.



మాట్లాడుతున్న రమణాచారి, చిత్రంలో దేశపతి, మామిడి హరికృష్ణ

15 శతాబ్దం నాటి రామాలయం గుర్తింపు



బయటపడిన రామాలయం (ఇన్‌సెట్‌లో) బయటపడిన సీతారాముల విగ్రహం

- యాదాద్రి భువనగిరి జిల్లాలో వెలుగులోకి..

యాదాద్రి రూరల్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి ఆలయానికి సుమారు కిలోమీటరు దూరంలో 15, 16 శతాబ్దం నాటి పురాతన రామాలయం బుధవారం బయల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని సైదాపురం గ్రామానికి చెందిన పశువుల కాపరి మల్లేశ్ ఈ ఆలయాన్ని గుర్తించాడు. వివరాలిలా ఉన్నాయి.. మల్లేశ్ దినచర్యల్లో భాగంగా పశువులను బయటకు తీసుకెళ్లాడు. అయితే చెట్ల పొదల్లో వెళ్లిన పశువులు రాకపోవడంతో వాటిని తోలుకొచ్చేందుకు అటుగా వెళ్లాడు. అక్కడ ఓ పురాతన రాతి ఆలయం కనపడడంతో విషయాన్ని గ్రామస్థులు, హిందూ దేవాలయ పరిరక్షణ సమితి సభ్యులకు సమాచారమిచ్చాడు. గ్రామస్థులు ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా.. సీతారాములు, హనుమంతుడు, ఆళ్వార్లు, గరుత్మంతుడు, శంఖు, చక్ర నామాలు, శిలాశాసనాలు, పుట్టులింగం, రెండు పెద్ద పాదాలు, మర్రిచెట్లు ఊడల మధ్యలో చక్రం ఆకారంలో ఓ విగ్రహం, సమీపంలో శిథిలమైన ఆంజనేయస్వామి విగ్రహాలను గుర్తించారు. దీంతో గ్రామస్థులు వాటిని శుద్ధిచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

అభయహస్తం ఇక ఉచితం!

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందిస్తున్న అభయహస్తం పథకాన్ని ఇక ఉచితంగానే అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ పథకానికి సభ్యులు రోజుకు రూపాయి చొప్పున ఏడాదికి రూ.365 చెల్లిస్తే, ప్రభుత్వం కూడా తన వంతుగా అంత మొత్తాన్ని చెల్లిస్తోంది. ఆపై.. పథకంలో ఉన్న సభ్యులకు 60 ఏళ్ల వయసు దాటిన అనంతరం.. కనీసం రూ.500 తగ్గకుండా ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేసేందుకుగాను తాజాగా కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రధానంగా.. అభయహస్తం పథకాన్ని ఇకపై ఉచితంగానే అందించాలని నిర్ణయించింది. అంటే.. మహిళా సంఘాల సభ్యుల వాటాను కూడా ఇకపై ప్రభుత్వమే చెల్లించనుంది. దీంతోపాటు లబ్ధిదారులకు అందించే ప్రయోజనాల్లోనూ భారీ మార్పులు చేసింది. ఇందులో భాగంగా గతంలో చెల్లించిన ప్రీమియం మొత్తాలను వారికి వాపసు ఇవ్వాలని నిర్ణయించింది. దీనికితోడు సభ్యురాళ్ల భర్తలకు కూడా ఈ పథకం వర్తించేలా మార్పులు చేయనుంది. ఈ ప్రతిపాదనలకు సీఎం కేసీఆర్ ఇప్పటికే ఆమోద ముద్ర వేసినట్లు సమాచారం. ఈ మేరకు మార్పులతో కూడిన పథకం త్వరలో అమల్లోకి రానుంది.

మార్పుల నేపథ్యంలో అభయహస్తం వివరాలు..

బీమా కవరేజి	ప్రస్తుతం	ప్రతిపాదిత విధానంలో
	(రూపాయల్లో)	
పథకం వర్తిస్తున్న సభ్యులు	20.15లక్షలు	78లక్షలు భార్య 44 + భర్త34
సభ్యురాలి సహజ మరణానికి	0.30లక్షలు	2 లక్షలు
ప్రమాదవశాత్తూ చనిపోతే	0.75లక్షలు	4 లక్షలు
శాశ్వత అంగవైకల్యం సంభవిస్తే	0.75లక్షలు	2 లక్షలు
పాక్షిక అంగవైకల్యం సంభవిస్తే	0.37లక్షలు	1 లక్ష
భర్త సహజమరణం చెందితే	-	2 లక్షలు
భర్త ప్రమాదవశాత్తూ మృతి చెందితే	-	4 లక్షలు
భర్తకు శాశ్వత అంగవైకల్యం సంభవిస్తే	-	2 లక్షలు
భర్తకు పాక్షిక అంగవైకల్యం సంభవిస్తే	-	1 లక్ష
ఇద్దరు పిల్లలకు ఉపకార వేతనం	రూ.9,600	రూ.9,600

30 దాటిన మహిళలకు.. 40 దాటిన పురుషులకు

ఉచిత వైద్య పరీక్షలు!

రాష్ట్రంలో కోటిన్నర మందికి వర్తింపు..వైద్య ఆరోగ్యశాఖ కసరత్తు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దాదాపు 1.50కోట్ల మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. 30 ఏళ్లు, ఆ పైబడిన మహిళలకు, 40 దాటిన పురుషులకు ఉచిత వైద్య పరీక్షలు చేయబోతున్నట్టు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షించిన సీఎం కేసీఆర్.. అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఎవరికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు? ఎప్పటి నుంచి దీన్ని అమలు చేస్తారన్న ప్రశ్నలు తలెత్తాయి. మహిళలకు 30 ఏళ్లు వచ్చేసరికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, పురుషులకైతే 40ల్లో వస్తాయని, ఆ వయసు నుంచే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తే బాగుంటుందని అభిప్రాయపడినట్లు సమాచారం. రాష్ట్ర జనాభా మూడున్నర కోట్లు. ఇందులో 30ఏళ్ల లోపు వారు 2 కోట్ల మంది ఉంటారని అంచనా.

ఆరోగ్య డిజిటల్ తెలంగాణ కోసమే..

రాష్ట్రంలో ఉచిత వైద్య పరీక్షల ముఖ్య ఉద్దేశం ఎవరెవరికి ఏయే వ్యాధులున్నాయో తెలుసుకోవడంతోపాటు వాటిని ఎలక్ట్రానిక్ డేటా రూపంలోకి మార్చడం. ఇప్పటికే సకల జనుల సర్వేలో ప్రతి కుటుంబం వివరాలున్నాయి. కుటుంబంలో జబ్బులతో బాధపడే వారి వివరాలు కూడా నమోదు చేశారు. ఆ వివరాలను ఉచిత ఆరోగ్య పరీక్షల కోసం పూరిస్థాయిలో వాడుకోబోతున్నారు. పరీక్షల అనంతరం నివేదికలన్నింటినీ డిజిటల్ రూపంలో భద్రపర్చనున్నారు. ఫలితంగా రాష్ట్రంలో ఏయే జబ్బులు విస్తృతంగా ఉన్నాయి? ఎలాంటి మందులను అందుబాటులో ఉంచాలి? ఏయే ప్రాంతాలపై ఎక్కువగా దృష్టిపెట్టాలన్న విషయాలపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల పరీక్షల హడావుడిలో ఉన్నందున అవి పూర్తవగానే ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించనున్నారు. మొత్తం 90 రోజుల్లో వీటిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వేసవిలో అయితే గ్రామీణ ప్రజానీకమంతా అందుబాటులో ఉంటారన్న ఆలోచనలో ఉంది సర్కారు. నేత్ర పరీక్షల కోసం ప్రత్యేకంగా కార్యాచరణ ఏమీ లేకుండా ఇందులోనే నిర్వహించాలని భావిస్తున్నారు. రక్తపోటు, మధుమేహంతో పాటు కంటి నుంచి పంటి వరకు అన్ని పరీక్షలు చేయనున్నారు. మహిళలకు సంబంధించిన కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను మాత్రం ప్రత్యేకంగా నిర్వహించనున్నట్టు తెలుస్తోంది.

ఈ కార్పొరేట్ ఆస్పత్రి రైతుల కోసం

(మొదటిపేజీ తరువాయి)

అన్నదాతలను ఈ దుస్థితి నుంచి బయటపడేసేందుకు ఖమ్మం జిల్లా డీసీసీబీ ఒక వినూత్న ప్రయత్నం చేసింది. అన్నదాతల కోసం కార్పొరేట్ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.8 కోట్లతో నిర్మించిన ఈ ఆస్పత్రి.. 1.60 లక్షల రైతులకు, వారి కుటుంబాలకు ఆరోగ్య ధీమా అందించనుంది. మంత్రులు తుమ్మల, హరీశ్‌రావు 17వ తేదీన ఈ ఆస్పత్రిని రైతులకు అంకితం చేయనున్నారు.

డీసీసీబీ చైర్మన్ ఆలోచన..

అసలే ఆర్థిక కష్టాలతో సతమతమయ్యే రైతులకు.. అనారోగ్యం వస్తే ఆస్పత్రి ఖర్చులు తలకుమించిన భారమే అవుతున్నాయి. ఒక వైపు వ్యవసాయ అప్పులు మరో వైపు వైద్యశాల ఖర్చులతో రైతులు తీవ్ర కష్టాలపాలవుతున్నారు. వారి దుస్థితిని గమనించిన ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మువ్వా విజయ్‌బాబు.. రైతులను ఆదుకునేందుకు చేసిన ఆలోచనే ఈ ఆస్పత్రి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 99 సహకార సంఘాలలో సుమారు 1.60 లక్షల సభ్యులు ఉన్నారు. వారి నుంచి ఏటా రూ.200ల చొప్పున రైతు సంక్షేమ నిధికి జమ చేశారు. సహకార సంఘాల సభ్యులైన రైతులు మరణిస్తే వారి కుటుంబసభ్యులకు రూ.10వేలు అందించేందుకు విజయ్‌బాబు ఈ నిధిని ఏర్పాటు చేశారు. అయితే, రైతు సంక్షేమనిధికి సుమారు రూ.8 కోట్ల దాకా నిధులు సమకూరడంతో ఆయన ఆలోచన మారింది. రైతుల కోసం ప్రత్యేక ఆస్పత్రి పెట్టాలని సంకల్పించారు. మంత్రి తుమ్మలకు విషయాన్ని తెలిపి గత ఏడాది స్టార్ ఆస్పత్రికి పునాదులు వేశారు. అన్ని రకాల వ్యాధులకూ కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించేందుకు అత్యాధునిక సౌకర్యాలను, పరీక్షా యూనిట్లను ఏర్పాటు చేశారు.



ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే

ఇవీ సేవలు..

రైతాంగానికి తక్కువ ఖర్చుతో వైద్యం అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ ఆస్పత్రికి 100 పడకల సామర్థ్యం ఉంది. మొదటి దశలో భాగంగా.. జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పిల్లల విభాగాల్లో



వైద్యసేవలు అందించనున్నారు. రైతులతోపాటు ఇతరులకు కూడా ఈ సేవలు అందించి తక్కువ ఫీజులు తీసుకోవాలన్నదే కో-ఆపరేటివ్ స్టార్ ఆస్పత్రి లక్ష్యం. డీసీసీబీ చైర్మన్ పర్యవేక్షణలో ఒక సొసైటీ ఈ ఆస్పత్రి బాధ్యతలను నిర్వహిస్తుంది. డీసీసీబీ చైర్మన్‌గా ఎవరు ఉంటే వారే బాధ్యులుగా వ్యవహరించనున్నారు.

మొబైల్ ఆస్పత్రులూ..

ఈ ఆస్పత్రితోపాటుగా మరో రెండు మొబైల్ ఆస్పత్రులను కూడా ఏర్పాటు చేసి.. వాటి ద్వారా రైతుల ఇళ్ల వద్దకు, పొలాల దగ్గరకు వెళ్లి వైద్యం అందించేవిధంగా డీసీసీబీ కార్యాచరణ రూపొందిస్తోంది. దీనికి సంబంధించిన వాహనాలను కోయంబత్తూరుకు పంపి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో వాహనానికి గాను రూ.55లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. వీటితోపాటుగా మరో రెండు వెంటిలేటర్ సౌకర్యం ఉన్న అంబులెన్సులనూ కొనుగోలు చేశారు.

అన్నదాతలకు అండగా..



రైతులను, వారి కుటుంబాలను ఆరోగ్యపరంగా ఆదుకునేందుకే ఆస్పత్రిని నిర్మించాం. మనదేశంలో కేరళలో.. విదేశాల్లో అయితే బ్రెజిల్‌లో మాత్రమే ఇలా రైతుల కోసం ప్రత్యేకంగా ఆస్పత్రులున్నాయి. ఈ ఆస్పత్రి ఏర్పాటుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంతో సహకరించారు.

-ఖమ్మం డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు



రెయిన్‌బో ఆస్పత్రిని ప్రారంభించిన తర్వాత ప్రసంగిస్తున్న వెంకయ్య

భారత్ విశ్వగురువు

- ఎన్నారైలు రావాలి.. ప్రభుత్వం, ప్రైవేటు కలిస్తే మెరుగైన సేవలు
- ఢిల్లీలో రెయిన్‌బో ఆస్పత్రిని ప్రారంభించిన వెంకయ్య
- ఆరోగ్య పథకానికి ప్రైవేటు సహకారం:మంత్రి నడ్డా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మన దేశంలో ఇప్పుడు మౌలిక సౌకర్యాలు, వనరులు అందుబాటులో ఉన్నాయి కాబట్టి విదేశాల్లో ఉన్న ప్రవాసభారతీయులు(ఎన్నారైలు)స్వదేశానికి తిరిగి రావాలని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మధుకర్ ట్రస్ట్, హైదరాబాద్‌కు చెందిన రెయిన్‌బో హాస్పిటల్స్ సంయుక్తంగా ఢిల్లీలో నిర్మించిన పిల్లల ఆస్పత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ, స్వాతంత్ర్యానికి పూర్వం భారత్ విశ్వగురువుగా ఉండేదని, విద్యను అభ్యసించడానికి విదేశాల నుంచి ఇక్కడికి వచ్చేవారని గుర్తు చేశారు. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు కలిస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అందుబాటు ధరలకు ప్రజలకు వైద్యం అందాలని ఆకాంక్షించారు. ఆరోగ్య రంగాన్ని మెరుగుపర్చడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, ప్రైవేటు ఆస్పత్రులు కూడా సేవా దృక్పథంతో పనిచేయాలని హితవు పలికారు. ప్రజావైద్య వ్యవస్థను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వైద్య రంగంలో అనేక సవాళ్లు ఉన్నాయన్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా ప్రసంగిస్తూ, ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త ఆరోగ్య పథకం అమలుకు ప్రైవేటు సంస్థల సహకారం తీసుకుంటామని తెలిపారు. అన్ని సదుపాయాలతో ఉన్న అంబులెన్సులను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడానికి కేంద్రం పన్నులను మినహాయించాలని రెయిన్‌బో హాస్పిటల్స్ సీఎండీ రమేశ్ కంచర్ల కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరులో తమ ఆస్పత్రులు ఉన్నాయని, ఇప్పుడు ఢిల్లీలో సేవలందించడానికి ఇక్కడ ఆస్పత్రిని ఏర్పాటు చేశామని వివరించారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	14.5	31.0
హైదరాబాద్	18.7	30.5
ఖమ్మం	18.0	34.0
రామగుండం	18.8	31.2
మహబూబ్‌నగర్	19.5	33.0

సర్వదర్శనానికి 7 గంటలు

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దాదాపు 65 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 7 గంటలు, దివ్యదర్శనానికి సుమారు 2 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో గురువారం లాటరీ ద్వారా జారీచేసే టికెట్లు సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25, వస్త్రాలంకరణ:2, అభిషేకం:4. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి ttdsevaonline.com వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



మమ్మల్ని జైల్లో పెట్టండి కానీ నిధులివ్వండి

మా ఎమ్మెల్యేలనూ, మంత్రులందరినీ జైల్లో పెట్టండి. కానీ దయ ఉంచి నిధులివ్వండి. ప్రభుత్వ ఫైళ్లపై త్వరగా ఆమోదముద్ర వేయండి.

- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్



మోదీకి ఎవరైనా 'ఐ లవ్ యూ' చెప్పారా?

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీకి ఎవరైనా 'ఐ లవ్ యూ' చెప్పారా? నాకైతే అనుమానమే? నాకు మాత్రం చాలా మంది 'ఐ లవ్ యూ' చెప్పారు. ప్రేమికుల దినోత్సవాన్ని వ్యతిరేకిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌కు సినీనటి ప్రియా ప్రకాశ్ వీడియో చెంపపెట్టు. ఆ వీడియోను వైరల్ చేయడం ద్వారా భారతీయులు ద్వేషాన్ని కాదు.. ప్రేమను కోరుకుంటామని నిరూపించారు.

- జిగ్నేశ్ మెవాని, దళిత నేత

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.77.24	పాత ధర 68.99
కొత్త ధర రూ.77.08	కొత్త ధర 68.79
తగ్గింది : 00.16 పైసలు	తగ్గింది : 00.20 పైసలు



గర్భం దాల్చాలంటే వాటికి దూరం కావాలి!

బోస్టన్, ఫిబ్రవరి 14: తీపి ఎక్కువగా ఉన్న డ్రింక్‌లు తాగేవారికి గర్భం దాల్చే అవకాశాలు తగ్గిపోతాయని అమెరికాలోని బోస్టన్ వర్సిటీ పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. కేవలం మహిళలే కాకుండా వారి జీవిత భాగస్వామికి ఈ అలవాటు ఉన్నా పిల్లలు పుట్టే ఛాన్స్ తక్కువేనని అవుతాయని చెబుతున్నారు. ఎపిడిమియాలజీ అనే పత్రికలో వారి పరిశోధన వివరాలు ప్రచురించారు. పిల్లల్ని కనాలని అనుకునే వారు తప్పకుండా బలవర్ధమైన ఆహారం తీసుకోవాలని, దీనివల్ల గర్భం దాల్చినప్పుడు మానసిక ఒత్తిడి తగ్గుతుందని ఆ పరిశోధనలో వివరించారు.

కీటోన్ డ్రింక్‌తో అదుపులో మధుమేహం!

ఇన్సులిన్, మెడిసిన్ తగ్గించే దిశగా పరీక్షలు

టొరంటో, ఫిబ్రవరి 14:మధుమేహంతో బాధపడుతున్నారా? షుగర్ వ్యాధి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారా? అలాంటి వారికి ఒక శుభవార్త చెబుతున్నారు పరిశోధకులు. కీటోన్ పానీయాలు చక్కెర వ్యాధిని నియంత్రణలో పెడతాయని బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ, కెనడాకు చెందిన బ్రిటీష్ కొలంబియా వర్సిటీ ప్రతినిధులు సంయుక్తంగా చేసిన పరిశోధనలో వెల్లడైంది. వీటి వివరాలను జర్నల్ ఆఫ్ ఫిజియాలజీలో ప్రచురించారు.

సీపీఎస్‌ను రద్దు చేయండి

ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల వినతి.. కేంద్రంతో చర్చించాలి: సీఎస్

హైదరాబాద్/యాదాద్రి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు ఏమాత్రం ఆర్థిక భద్రత కల్పించలేకపోతున్న సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) విధానాన్ని రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం(సీపీఎస్‌టీఈఏ) డిమాండ్ చేసింది. బుధవారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్‌కే జోషిని కలిసి సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. కమలాకర్, సీహెచ్ భూపతిరావు వినతిపత్రం అందించారు. కుటుంబ పింఛను, గ్రాట్యుటీ తదితర సదుపాయాలేవీ సీపీఎస్‌లో లేవని, ఇప్పటికే పదవీ విరమణ చేసిన సీపీఎస్ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందని ఈ సందర్భంగా కమలాకర్ సీఎస్‌కు వివరించారు. సీపీఎస్ ఉండి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు తక్షణమే రూ. 12 లక్షల గ్రాట్యుటీని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సీఎస్ స్పందిస్తూ.. 'సీపీఎస్ రద్దు అంశం కేంద్రం పరిధిలోనిది. కేంద్రానికి లేఖ రాయాల్సి ఉంది. ఈ అంశాన్ని పరిశీలిస్తాం' అని పేర్కొన్నట్లు సంఘం నేతలు వెల్లడించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయం ప్రగతిభవన్ వరకు పాదయాత్రలు నిర్వహించనున్నట్లు కమలాకర్ వెల్లడించారు. కాగా, టీచర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి సత్వర చర్యలు చేపడుతున్నామని సీఎస్ ఎస్‌కే జోషి చెప్పినట్లు యూటీఎఫ్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి రాములు, చావ రవి తెలిపారు. బుధవారం వారు సీఎస్‌ను కలిసి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూపొందించాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మరోవైపు.. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎన్జీవో రాష్ట్ర సహ అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు జగన్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలనే డిమాండ్‌పై మార్చి 22న లక్ష మంది ఉద్యోగులతో టీఎన్జీవో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇదే రోజు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి మహబూబ్‌నగర్‌లో తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎస్ ధర్నా కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు.

సెలవుల మంజూరు అధికారం హెచ్‌ఎంలకే

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు సెలవుల మంజూరు అధికారాన్ని ప్రధానోపాధ్యాయులకే అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్‌సీ నం. 83లో సవరణలు చేస్తూ బుధవారం డైరెక్టర్ కిషన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ చెట్లను నరకొచ్చు!

(మొదటిపేజీ తరువాయి...)

సమర్పించారు. గత నెల 7న 'కులవృత్తుల కన్నీరు-వేప, నల్ల తుమ్మ, నేరేడు చెట్లు కొట్టడంపై ఆంక్షలు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించి.. ఈ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చింది. ఆ కథనానికి స్పందించిన అటవీ శాఖ... తెలంగాణ ఫారెస్ట్ ప్రొడ్యూస్ ట్రాన్సిట్ రూల్స్, 1970లోని షెడ్యూల్-2ని సవరించింది. వేప, నల్ల తుమ్మ, నేరేడు, రావి చెట్లను షెడ్యూల్-2లో చేర్చింది. వాటిని నరకడంతో పాటు, రవాణాకు అటవీ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఉత్తర్వుల్లో పేర్కొంది. తెలంగాణ ఫారెస్టు ప్రొడ్యూస్ ట్రాన్సిట్ రూల్స్ 1970 ప్రకారం అటవీ ఉత్పత్తులకు సంబంధించి 16 నిబంధనలు ఉన్నాయి. వీటి ఆధారంగా మూడు షెడ్యూల్స్ ఏర్పాటు చేశారు. మొదటి షెడ్యూల్‌లో రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో చెక్‌పోస్టులు, బారికేడ్లు ఏర్పాటు.. రెండో షెడ్యూల్‌లో సొంతభూమిలో పెంచుకున్న 20 రకాల చెట్ల నరికివేత, రవాణాకు అనుమతి అంశాలను పొందుపరిచారు. మూడో షెడ్యూల్‌లో అటవీ ఫలసాయం గురించి చేర్చారు. ప్రభుత్వం సెప్టెంబరు 6, 2017న రెండో షెడ్యూల్‌లోని 20 రకాల చెట్ల జాబితా నుంచి వేప, నల్లతుమ్మ, నేరేడు, రావి చెట్లను తొలగిస్తూ జీవో 31ని విడదల చేసింది. అందులో మరో 24 రకాల చెట్లను చేర్చింది. మొత్తం 40 చెట్ల నరికివేత, రవాణాకు అనుమతినిచ్చింది అటవీ శాఖ. జీవనాధారమైన వేప, తుమ్మ, రావి మర్రి, నేరేడు చెట్లను జాబితా నుంచి తీసివేయడంతో.. విశ్వకర్మలు, విశ్వ బ్రాహ్మణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కులవృత్తులు, రైతుల వినతులను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం.. జీవో 31ని సవరిస్తూ మరో జీవోను విడుదల చేసింది. ఇకపై గతంలో మాదిరి వేప, నేరేడు, రావి, నల్ల తుమ్మ చెట్లను అటవీ అధికారుల అనుమతి లేకుండా నరకవచ్చు... రవాణా చేసుకోవచ్చు.



చెట్ల కొట్టివేత జీవోపై 2018 జనవరి 7న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

గుజరాత్, రాజస్థాన్ నుంచీ సబ్సిడీ గొర్రెలు

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులో తలసాని



హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ గొర్రెలను గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచీ కొనుగోలు చేసేందుకు అధికారులకు అనుమతి ఇచ్చామని పశుసంవర్థక, మత్స్యశాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. గతంలో ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిసా రాష్ట్రాల నుంచి మాత్రమే గొర్రెలను కొనుగోలు చేశామన్నారు. గొర్రెల పెంపకందార్లు, మత్స్యకార సొసైటీలకు త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. పశుసంవర్థక, మత్స్య శాఖల్లో పథకాల అమలు తీరుపై జిల్లాల కలెక్టర్లు, శాఖాధికారులతో బుధవారం సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో మంత్రి మాట్లాడుతూ.. సబ్సిడీ గొర్రెల పంపిణీతో 87 లక్షల మెట్రిక్ టన్నుల పచ్చి మేత అవసరముందన్నారు. సబ్సిడీపై గడ్డి విత్తనాలను 10 రోజుల్లో పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. గొర్రెల షెడ్ల నిర్మాణానికి 90% సబ్సిడీపై ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. కాగా, రాష్ట్రంలోని చెరువులు, రిజర్వాయర్లలో ఈ ఏడాది 51 కోట్ల చేపపిల్లల విడుదల చేశామన్నారు. వీటితో 1.53 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి జరిగి రూ.1900 కోట్ల ఆదాయం రానుందని, 2.50 లక్షల మత్స్యకార కుటుంబాలు లబ్ధి పొందుతాయన్నారు. 11 రిజర్వాయర్లలో ప్రయోగాత్మకంగా రొయ్యల పెంపకం చేపట్టామని, వీటితో 217 టన్నుల రొయ్యల ఉత్పత్తి జరిగి 10 వేల మత్స్యకార కుటుంబాలకు రూ.5.45 కోట్ల అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు.

ఖలీదా కష్టాలు!

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, ప్రతిపక్ష బీఎన్పీ పార్టీ నాయకురాలు బేగం ఖలీదాజియాకు ఓ అవినీతి కేసులో ఐదేళ్ళ శిక్షపడటంతో అక్కడి రాజకీయాలు సమూలంగా మారిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. డిసెంబరులో ఎన్నికలు జరగబోతున్న తరుణంలో, ఎన్నికల్లో పోటీ చేసే అర్హతను కూడా ఆమె కోల్పోయే అవకాశాలున్నాయి. భర్త జియావుర్ రెహ్మాన్ పేరిట ఏర్పాటు చేసిన అనాథశరణాలయం కోసం సేకరించిన రెండున్నరలక్షల డాలర్ల విదేశీనిధులను దుర్వినియోగం చేసినందుకు ఢాకా ప్రత్యేక న్యాయస్థానం ఖలీదాకు ఈ శిక్ష విధించింది. ఆమె కుమారుడు, పార్టీ ఉపాధ్యక్షుడు తారిక్‌తో పాటు మరో నలుగురికి ఇదే కేసులో పదేళ్ళ శిక్షపడింది. తారిక్ మరో కేసులో చిక్కుకుని లండన్‌లో తలదాచుకుంటున్న నేపథ్యంలో, ఖలీదా అప్పీలును కనుక ఉన్నత న్యాయస్థానాలు తిరస్కరిస్తే బీఎన్పీ కనుమరుగైపోయి, బంగ్లాదేశ్ పూర్తిగా హసీనా హస్తగతమవుతుంది.

బంగ్లాదేశ్‌లో దశాబ్దాలుగా ఇద్దరు బేగంల మధ్య యుద్ధం సాగుతున్నది. ఖలీదా అధికారంలో ఉన్నప్పుడల్లా అవామీ లీగ్‌ను, అధినేత హసీనాను వెంటాడి వేధించడం తెలిసిందే. 2004లో హసీనా ర్యాలీపై గ్రనేడ్ దాడి జరిగినప్పుడు ఆమె తప్పించుకోగలిగారు కానీ, అవామీలీగ్ సీనియర్ నాయకులు అనేకులు మృతిచెందారు. పాతికమంది మరణించిన ఈ కేసులోనే అనంతర కాలంలో ఖలీదా కుమారుడితో సహా అనేకమంది బీఎన్పీ నాయకులకు శిక్షలు పడ్డాయి. ఖలీదాపై కేసులన్నీ రాజకీయంగా ఆమెను వేధించడానికేనని బీఎన్పీ నాయకుల ఆరోపణలో కొంత నిజం ఉండవచ్చునేమో కానీ, ఖలీదా పాలన అత్యంత అవినీతిమయమైనదని ప్రపంచమంతా తెలుసు. ఆమె ప్రధానిగా ఉన్న కాలంలో కుమారులు ఇద్దరూ పరోక్షంగా దేశాన్ని ఏలుతూ అధికార దుర్వినియోగానికీ, పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారు. దోపిడీలు, బలవంతపు వసూళ్ళకు దిగజారారు. ఖలీదా తమ దేశంలోని రియల్ ఎస్టేట్ రంగంలో వేలకోట్లు పెట్టుబడిపెట్టారని సౌదీ అరేబియా కూడా ఓ సందర్భంలో అంగీకరించింది. 2001–2006మధ్యకాలంలో ఐదేళ్ళపాటు బంగ్లాదేశ్ వరుసగా ప్రపంచంలోనే అత్యంత అవినీతిమయమైన దేశంగా గుర్తింపు పొందింది. ఇక ఆమె భారత వ్యతిరేక వైఖరి గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. ఈశాన్య రాష్ట్రాల్లోని తిరుగుబాటు గ్రూపులకు ఆమె ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచింది. పాకిస్థాన్‌నుంచి అత్యాధునికమైన ఆయుధాలు తెప్పించి ఉల్ఫాకు సహకరించిన ఆరోపణలపై ఖలీదావద్ద హోంమంత్రిగా పని చేసినాయన అనంతరకాలంలో జైలుకు పోయారు. ఆమె ప్రధానిగా ఉన్నకాలంలో ఇస్లామిక్ తీవ్రవాద గ్రూపులు అనేకం పుట్టుకొచ్చాయి. ఖలీదా కుమారుడు ఈ సంస్థలను అవామీ లీగ్‌ను దెబ్బతీయడానికి వాడుకుంటే, పాకిస్థాన్ వీటిని భారతదేశానికి వ్యతిరేకంగా వాడుకోవడానికి ప్రయత్నించింది.

ప్రత్యేక న్యాయస్థానం తీర్పుపై ఖలీదా అప్పీలుకు వెళ్ళినప్పటికీ ప్రయోజనం ఉండదని కొందరు అంటున్నారు. ఒకవేళ తీర్పు అమలును తాత్కాలికంగా నిలిపివేసి, బెయిలుపై ఆమెను అనుమతించినప్పటికీ, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు ఉన్నప్పుడే ఆమె పార్టీకి కాస్తంత ప్రయోజనం ఉంటుంది. బీఎన్పీ పూర్తిగా ఖలీదా కుటుంబ పార్టీ. కుమారుడు లండన్‌లో తలదాచుకుంటూండగా, దేశంలో ఆమె స్థానాన్ని భర్తీ చేయగలిగే నాయకులెవ్వరూ ఆ పార్టీలో లేరు. ఇందుకు భిన్నంగా ఆమె కూడా జైలులోనే మగ్గవలసి వస్తే పార్టీ నామరూపాలు లేకుండా పోతుంది. బీఎన్పీ భాగస్వామిగా ఉన్న జమాతే ఇస్లామీ కూడా దాని ఉన్నత స్థాయి నాయకులకు 1971యుద్ధనేరాల ఆరోపణలపై గత రెండేళ్ళకాలంలో ఉరిశిక్షలు, జైలుశిక్షలు పడటంతో బాగా బలహీనపడింది. బంగ్లాదేశ్‌లో దశాబ్దకాలం సైనిక పాలన సాగి, 1991తొలి ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన బీఎన్పీ మరుసటి ఎన్నికల్లో అవామీ లీగ్‌కు అధికారాన్ని కోల్పోయింది. తిరిగి 2001లో అధికారంలోకి వచ్చి ఆరేళ్ళపాటు అవినీతిమయమైన పాలన సాగించింది. 2007లో సైనిక మద్దతు ఉన్న తాత్కాలిక ప్రభుత్వం ఏలుబడిలో రెండు పార్టీలూ తీవ్ర కష్టాలు పడ్డాయి. 2008ఎన్నికల్లో అవామీ లీగ్ ఘన విజయం సాధించి అధికారంలోకి రావడంతోనే ఖలీదాపై విరుచుకుపడటంతో మరుసటి ఎన్నికలనాటికి ఆ పార్టీ తిరిగి ప్రజాదరణను పొందగలిగింది. అయితే, ఎన్నికలకు ముందు తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న రాజ్యాంగ నిబంధనను హసీనా మార్చినందుకు నిరసగా ఖలీదా 2014 ఎన్నికల్లో పోటీచేయలేదు. ఈ కారణంగా హసీనాకు మరోమారు సునాయాసంగా అధికారం దక్కింది. దాదాపు 11 సంవత్సరాల పాటు అధికారానికి దూరంగా ఉన్న ఖలీదా ఈ మారు ఎన్నికలకు సిద్ధపడుతున్న నేపథ్యంలో పరిస్థితులన్నీ వ్యతిరేకంగా తయారైనాయి. బీఎన్పీ పోటీలేకుండా మరోమారు సునాయాసంగా అధికారంలోకి రావాలని హసీనా కోరుకోవడం సహజమే అయినప్పటికీ, న్యాయస్థానాల ద్వారా, ఎన్నికల సంఘం ద్వారా ఖలీదాను అడ్డగించి సాధించే ఏకపక్ష విజయం కంటే, ఇప్పటికే ప్రజాక్షేత్రంలో బలహీనపడిన ఆమెతో ఎన్నికల్లో ఢీకొని విజయం సాధించడమే హసీనాకు శోభస్కరం.

'వెండితెర' గురువు

దక్షిణాది సినీరంగాన యం.జి.ఆర్, యన్.టి.ఆర్, ఏ.యన్.ఆర్, రాజ్‌కుమార్‌ల యుగం సాగుతున్న రోజుల్లో వారికి వారసత్వంగా మద్రాసు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్, అడయార్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్, మధు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్స్ నటనలో కొత్త తరానికి శిక్షణనిచ్చి సినిమా రంగానికి పరిచయం చేసాయి. ఈ సంస్థలలో నటశిక్షణా అధ్యాపకురాలిగా లక్ష్మీదేవి కనకాల తన 44ఏళ్ళ సుదీర్ఘ ప్రస్థానంలో ఎందరినో నటీ, నటులుగా తీర్చిదిద్దారు. తమిళనాట 'తలైవాగా' పేరొందిన రజినీకాంత్, తెలుగునాట మెగాస్టార్‌గా వెలుగుతున్న చిరంజీవి, హాస్యనటకిరీటి రాజేంద్రప్రసాద్, అరుణ్‌పాండ్యన్ వంటి తెలుగు, తమిళ, కన్నడ హీరోలు ఆమె దగ్గర నటనలో ఓనమాలు నేర్చుకున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి సినీనటులు కావాలనే గంపెడాశతో మద్రాసు, హైదరాబాద్‌లకు చేరిన కొత్తతరాన్ని ఆమె నటశిక్షణతో తీర్చిదిద్దారు. లక్ష్మీదేవి అందించిన నటనా మెళకువలు యువనటుల సినీ ప్రస్థానానికి పునాదులు వేశాయి. వారికి స్టార్ ఇమేజ్‌ను సృష్టించాయి. నటనలో మార్గ దర్శకత్వం చేసి వేలాది శిష్యులను ప్రోది చేసుకున్న లక్ష్మీదేవి కనకాల ఫిబ్రవరి 3న తన 79వ ఏట మృతిచెందారు.

నివాళి



నటశిక్షణా అధ్యాపకురాలిగా లక్ష్మీదేవి కనకాల నలభై నాలుగేళ్ళ సుదీర్ఘ ప్రస్థానంలో ఎందరినో నటీనటులుగా తీర్చిదిద్దారు. రజినీకాంత్, చిరంజీవి, రాజేంద్రప్రసాద్, భానుచందర్ వంటి తెలుగు, తమిళ, కన్నడ హీరోలెందరో ఆమె దగ్గర నటనలో ఓనమాలు నేర్చుకున్నారు.

లక్ష్మీదేవి రాయలసీమ ప్రొద్దుటూరుకు చెందిన కిడాంబి శ్రీనివాసాచార్య, జయమ్మ దంపతులకు 1939 జూన్ 19న జన్మించారు. ఆమె 11 ఏళ్ళకే నృత్య కళాకారిణిగా పరిచయమయ్యారు. నృత్యంలో మరిన్ని మెరుగులు దిద్దుకునేందుకు 1957లో హైదరాబాద్‌కు చేరుకున్నారు. నృత్య కళాకారిణిగా రాణిస్తున్న సమయంలో నాటక రంగానికి పరిచయమయ్యారు. అబ్బూరి రామకృష్ణారావు దర్శకత్వంలో హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రదర్శించిన 'కన్యాశుల్కం' నాటకంలో వయస్సుపైబడిన బుచ్చమ్మ పాత్రను పోషించారు. రామచంద్రకాశ్యప్, రామన్నపంతులు వంటి ప్రఖ్యాత రంగస్థల నటులతో పోటీపడి ఆమె నటించారు. ఆ మరుసటి రోజు అన్ని దినపత్రికలు లక్ష్మీదేవి ఫోటోను ప్రముఖంగా ప్రచురించాయి. నాటకం గొప్పదనాన్ని గమనించిన ఆమె ఆ తర్వాత శాస్త్రీయ నృత్యాలకు స్వస్తిపలికి రంగస్థలానికి అంకితమయ్యారు. కన్యాశుల్కం గుర్తింపుతో తెలుగుదేశం నలుమూలలా వేలాది నాటకాలు ప్రదర్శించారు. శాకుంతలం, నిజం, వీలునామా, పేరయ్య రాజయ్యాడు, మా నాన్నకావాలి, గువ్వగూడెక్కె, చుట్టు ముట్టండి, విశ్రాంతి సామ్రాజ్యం వంటి నాటకాలు ఆమెకు నటిగా మంచి పేరు తెచ్చిపెట్టాయి.

లక్ష్మీదేవి నాటకాల్లో నటిస్తూనే రవీంద్రభారతిలో నిర్వహించే నాట్య విద్యాలయంలో నటనలో 3 సంవత్సరాల డిప్లొమా కోర్సులో చేరి మంత్రి శ్రీనివాసరావు, ఏ.ఆర్. కృష్ణల వద్ద శిష్యరికం చేసారు. అక్కడ ఆమె శాస్త్రీయ దృక్పథంతో నటనలో అనేక మెళకువలు నేర్చుకున్నారు. ఈ అర్హతలతో 1970లో భారత ప్రభుత్వ గేయ నాటక విభాగంలో స్టేజీ ఆర్టిస్టుగా ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై అనేక నాటకాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించారు. అక్కడే దేవదాస్ కనకాల, రాళ్ళపల్లి, వేజెళ్ళ సత్యనారాయణ, బెనర్జీ, బి. సుబ్బారావు, మీనాకుమారి వంటి ప్రఖ్యాత నటీనటులతో కలిసిపనిచేసేవారు. 1971లో దేవదాస్ కనకాలతో ఆమెకు వివాహం జరిగింది. 1972లో 'మద్రాసు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్' వారు ప్రతిష్టాత్మకంగా మద్రాసులో యాక్టింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించారు. లక్ష్మీదేవి భర్త దేవదాస్ కనకాల అప్పటికే పూణే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో యాక్టింగ్ డిప్లొమా చేసి ఉండడం వల్ల ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ రాజా రాందాస్, దేవదాసును అధ్యాపకుడిగా ఎంపిక చేసారు. ఒక సంవత్సరం తర్వాత మద్రాసు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ వారు లక్ష్మీదేవి కనకాలకు కూడా అధ్యాపకురాలిగా అవకాశం ఇవ్వడంతో 1974లో ఆమె కొత్త ఉద్యోగంలోకి మారారు. ఈనాటి తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ ఆమెకు మొదటి విద్యార్థి. ఆ తర్వాత చిరంజీవి, రాజేంద్రప్రసాద్, భానుచందర్, అరుణ్‌పాండ్యన్, ప్రదీప్‌శక్తి, సుధాకర్ వంటి వారు నటనలో ఆమె దగ్గర శిక్షణ పొందారు. అయితే కొన్ని కారణాల వల్ల మద్రాసు ఫిలిం ఇన్‌స్టిట్యూట్ మూతపడటంతో 1979లో అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి యం.జి.రామచంద్రన్ ప్రోత్సాహంతో అడయార్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో ఆమె అధ్యాపకురాలిగా చేరారు. అక్కడే శుభలేఖ సుధాకర్, సుహాసిని వంటి ఎందరో ఆమె దగ్గర నటనలో శిక్షణ పొందారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో నాట్య విద్యాలయంలోను, మధు ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లోను అధ్యాపకురాలిగా, ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఈ సమయంలో శ్రీకాంత్, అల్లరి నరేష్, శివాజీరాజా, ఆహుతి ప్రసాద్, అచ్యుత్, సునీల్, వినోద్‌బాల, సమీర్ వంటి ఎందరో ఆమె వద్ద నటులుగా శిక్షణపొంది సినీరంగంలో ప్రఖ్యాతి పొందారు. మరెందరో టీవీ రంగంలో రాణిస్తున్నారు.

తరగతి గదిలో ఆమె క్రమశిక్షణకు పెద్దపీట వేసేవారు. 'స్టానిస్లవిస్కీ సిద్ధాంతాన్ని నట శిక్షణకు ఉపయోగించడం వల్లే ఎందరినో నటులుగా తీర్చిదిద్దినట్లు' ఆమె చెప్పేవారు. 20వ శతాబ్దంలో స్టానిస్లవిస్కీ నటశిక్షణా సిద్ధాంతం ప్రపంచంలో ఎందరో నటులకు దిక్సూచిగా నిలిచింది. లక్ష్మీదేవి రంగస్థలనటిగా, నటశిక్షణా అధ్యాపకురాలిగానే కాకుండా వెండితెరపై ప్రత్యేక పాత్రల్లో నటించారు. 'ప్రేమబంధం'లో జయప్రదకు తల్లిగా, 'పోలీసులాకప్'లో విజయశాంతి అత్తగా, 'కొబ్బరిబొండం'లో రాజేంద్ర ప్రసాద్‌కు తల్లిగా నటించారు. కొన్ని టీవీ సీరియళ్ళలో నటించారు. లక్ష్మీదేవి కుమారుడు రాజీవ్ కనకాల ప్రసిద్ధ సినీ నటుడిగా, కూతురు లక్ష్మి టీవీ నటిగా, కోడలు సుమ కనకాల ప్రసిద్ధ యాంకర్‌గా ప్రఖ్యాతి పొందారు. అల్లుడు డాక్టర్ పెద్ది రామారావు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రణాళిక సంఘం సభ్యుడిగా సేవలందిస్తున్నారు. ఆమె మృతి నట శిక్షణా రంగంలో ఎన్నటికీ భర్తీ కాని లోటుగా మిగిలే ఉంటుంది.

■ జె. విజయ్‌కుమార్‌జీ

లంబాడీల ఆరాధ్య దైవం



సంత్ సేవాలాల్ మహారాజ్‌ను లంబాడీలు దేవుడిగా భావించి కొలుస్తారు. ఆయన జయంతిని పండుగలా జరుపుకొంటారు. గిరిజనులకు దశ దిశను చూపి, హైందవ ధర్మం గొప్పదనం, విశిష్టతలను తెలియ జేయడానికే సేవాలాల్ మహారాజ్ జన్మించారని చరిత్రకారులు చెబుతారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారు. దీంతో శ్రీ సంత్ సేవాలాల్ ఇతర కులాలవారికి కూడా ఆదర్శ మూర్తిగా నిలిచారు. 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా రాంజీనాయక్ తండాలో సేవాలాల్ మహారాజ్ జన్మించారు. జగదాంబ మాతనే తన మార్గదర్శకురాలిగా, గురువుగా స్వీకరించి ఆమె ఆదేశానుసారం బంజారాల సేవలో నిమగ్నమయ్యారు. సేవాలాల్ ప్రజల మూఢవిశ్వాసమైన జంతుబలికి తీవ్ర వ్యతిరేకి. బంజారాలు రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు వివిధ రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగిస్తుండేవారు. ఆ క్రమంలో బ్రిటిష్, ముస్లిం పాలకుల మత ప్రచారం వల్ల బంజారా సమాజం అనేక ఇబ్బందులకు గురైంది. ఈ క్రమంలోనే బంజారా జాతిని సన్మార్గంలో నడిపించేందుకు సేవాలాల్ మహారాజ్ అవతరించారని చరిత్రకారుల ద్వారా తెలుస్తోంది. సేవాలాల్ మహారాజ్, దండి మేరామయాడీలను భక్తిశ్రద్ధలతో పూజిస్తూ లంబాడీలు ప్రతి ఏటా తీజ్ ఉత్సవాలను కూడా జరుపుకొంటారు. అనంతపురం జిల్లా గుత్తిలోని గొల్లలదొడ్డి ప్రాంతంలో కుల దైవమైన సేవాలాల్ మహారాజ్ గడ్ ఉంది. సేవాలాల్ శివ పూజారుడు. ఆయన తండ్రి, తాతలు తెగ పెద్దలు. తొమ్మిది రోజుల పాటు పెళ్లికాని యువతులు తీజ్ ఉత్సవాల్లో పాల్గొని తమకు వివాహం కావాలని పూజలు చేస్తారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ప్రజల కోసం చేసిన ఉద్యమాలలో ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులను అరికట్టడం వంటివి ఉన్నాయి. సన్మార్గంలో తన జాతిని నడిపించి భారత్‌లోని దాదాపు 11 కోట్ల బంజారాలకు ఆరాధ్య దైవంగా ఆయన నిలిచారు.

బంజారాలు రాజపుత్రుల్లాంటి వారని చరిత్రకారుడు కల్నల్ టాడ్ పేర్కొన్నారంటే... వారెంత దృఢకాయులో అర్థం అవుతుంది. లంబాడీలు, బంజారాలు, సుగాలీలు, గ్వార్ భాయ్ అని పిలవబడుతున్న ఈ గిరిజనులు ప్రపంచవ్యాప్తంగా గోర్ బంజారాలుగా పేరుపొందారు. మధ్య యుగంలో మహమ్మద్ ఘోరీకి వ్యతిరేకంగా పృథ్వీరాజ్ చౌహాన్ పక్షాన పోరాడిన వీరోచిత చరిత్ర బంజారాల సొంతం. దక్కన్ పీఠభూమిలో లంబాడీలు కాకతీయుల కంటే ముందే ఉన్నారని, సంచార జాతివారైనా వీరు రజాకార్లతో పోరాడారని, నవాబులు వారి ధైర్యసాహసాలకు మెచ్చి భూములను ఇనాములుగా ఇచ్చారని చరిత్ర చెబుతోంది. బంజారాలు ఎవరికీ హాని తలపెట్టేవారు కాదని, సహాయ గుణం విరివిగా కలవారని, ధైర్యసాహసాలకు ప్రతీకలనీ చరిత్ర ద్వారా తెలుస్తుంది. తరతరాలుగా జాతి వివక్షకు గురవుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధిలో వెనుకబడి ఉన్న లంబాడాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.

■ డాక్టర్ కె.లక్ష్మణ్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు

(నేడు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి)

ఆరోగ్య సంకల్పం సిద్ధించేనా?



■ కె. సుజాతారావు


ప్రజారోగ్య రంగంలో ప్రభుత్వ పాత్రను జాతీయ ఆరోగ్య సంరక్షణా పథకం పునర్ నిర్వచించింది. ఆరోగ్య సేవల ప్రదాతగా ఉన్న రాజ్యవ్యవస్థ ఆ సేవలకు అవసరమైన ఆర్థిక సౌలభ్యతను సమకూర్చే పెట్టుబడిదారుగా ఉండాలని ఆ పథకం నిర్దేశించింది. మరి బాధ్యతను ప్రభుత్వం సమర్థంగా నిర్వర్తించగలదా?

జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం (ఎన్‌హెచ్‌పిఎస్) జాతికి ఆరోగ్య విధాత కానున్నదా? మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాకరంగా ప్రవేశపెట్టిన ఈ పథకం నాలుగు ప్రతిపాదనలు, ఒక ఆశపై ఆధారపడి వున్నది. ప్రజారోగ్య రంగంలో సదుపాయాలు, సేవల లోటు తీవ్రంగా ఉన్న రంగాలు, ప్రాంతాలలో ప్రైవేట్ మదుపులు సమృద్ధమయ్యేందుకు అవసరమైన అనుకూల పరిస్థితులు సృష్టించడం; ప్రైవేట్ ఆస్పత్రులలో ఉపయుక్తం కాకుండా ఉన్న 30 శాతం వసతులను పేదల ఆరోగ్య భద్రతకు ఉపయోగించుకోవడం; పది కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమా సదుపాయం సమకూర్చడం; ఆస్పత్రిలో చేరడం అనివార్యం కాకుండా ప్రతి ఐదు వేల మంది ప్రజల స్థాయిలో వెల్‌నెస్ క్లినిక్‌లను పటిష్ఠంగా అభివృద్ధిపరచడం అనేవి ప్రతిపాదనలు. ఇక, ఈ సదుపాయాలు విశాల ప్రజానీకానికి అందుబాటులోకి వచ్చే క్రమంలో పేదరికం తగ్గి, అకాల మరణాలను నివారించడం సాధ్యమవుతుందనే ఆశ కూడా మోదీ సర్కార్ ఆరోగ్య సంరక్షణా పథకానికి ప్రాతిపదికగా ఉన్నది.

దేశ ప్రజలందరికీ ముఖ్యంగా పేదలకు ఆరోగ్యభద్రత సమకూర్చడం ఒక మహా సంకల్పం. ఎన్‌హెచ్‌పిఎస్‌తో ఈ సంకల్పం సాకారమయ్యే సమయమాసన్నమయిందనే ఆశాభావం ప్రజలు, ప్రభుత్వ వర్గాలు, ఆరోగ్యభద్రతా రంగ వర్గాలలో బాగా వ్యక్తమవుతున్నది. కనుకనే ఆర్థికమంత్రి ఈ నెల 1న లోక్‌సభలో 2018–19 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌లో భాగంగా ప్రకటించిన ఈ పథకంపై దేశ ప్రజలందరూ విశేష స్థాయిలో ఆసక్తి చూపుతున్నారు. అయితే ప్రభుత్వ సంకల్పానికి, ఆ సంకల్ప సాధనకు వాస్తవంగా కేటాయించిన నిధుల పరిమాణానికి మధ్య ఉన్న అంతరం గురించి చర్చ కూడా తీవ్రస్థాయిలోనే జరుగుతోంది.

మొదటి ప్రతిపాదన అదీ పాక్షికంగానైనా సఫలం కావాలంటే కనీసం ఐదు సంవత్సరాలకు పైగానే సమయం తీసుకొంటుంది. మదుపులు సమృద్ధంగా రావాలంటే వసతులు, సదుపాయాలు బాగా మెరుగుపడాలి. ప్రైవేట్ రంగంలో మెరుగుపడిన సదుపాయాలతో పాటు చికిత్సా వ్యయాలు కూడా పెరుగుతాయనే వాస్తవాన్ని విస్మరించకూడదు. రెండో ప్రతిపాదన విషయాన్ని తీసుకుంటే ప్రైవేట్ ఆస్పత్రులలోని వసతుల సంపూర్ణ ఉపయుక్తత ప్రయోజనాలు పట్టణ ప్రాంత ప్రజలకు మాత్రమే సమకూరతాయి. రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్ఎస్‌బివై) సేవలను పొందిన వారిలో 25 శాతం మంది, ఆస్పత్రి పాలుకావడం వల్ల అయిన పరోక్ష వ్యయాలకు ఆర్థికంగా చితికిపోయారని వెల్లడయింది. మూడో ప్రతిపాదనను మరింత నిశితంగా విశ్లేషించవలసి వున్నది. దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికీ అమలు పరుస్తున్న ఆరోగ్య భద్రతా పథకాలు కూడా ఎన్‌హెచ్‌పిఎస్ పరిధిలోకే వస్తాయి. గరిష్ఠంగా రెండు లక్షల రూపాయల విలువైన వైద్య సేవలు పొందడానికి వీలున్నప్పటికీ అత్యధికులు యాభైవేల రూపాయలకు మించని వైద్య సేవలను మాత్రమే పొందగలుగుతున్నారు. మరి ఎన్‌హెచ్‌పిఎస్ కింద అవే సేవలకు మరింత అధిక స్థాయి ఆర్థిక సహాయం కల్పించడం వల్ల లబ్ధిపొందేది ఆస్పత్రులు మాత్రమే. ప్రైవేట్ ఆస్పత్రులలో మానవ వనరుల కొరత సమస్య పరిష్కారానికి కూడా ఈ ఆర్థిక వితరణ తోడ్పడదు.

మరో ముఖ్యమైన విషయమేమిటంటే సదుపాయాల కొరత సేవలకు తీవ్ర ఆటంకమవుతోంది. కేవలం ముప్పై వేల రూపాయల విలువ చేసే ద్వితీయ స్థాయి వైద్య సేవలను అందించేందుకు ఉద్దేశించిన ఆర్ఎస్‌బివై అమలును ఉత్తరాది రాష్ట్రాలలో ముఖ్యంగా బిహార్, ఉత్తర ప్రదేశ్‌లో త్యజించడం జరిగింది. ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని ఎన్‌హెచ్‌పిఎస్‌కు రూ.12 వేల కోట్ల కేటాయింపు స్వల్పకాలికంగా హెచ్చుస్థాయిలో ఉన్నట్టు కన్పించవచ్చు. అయితే వసతులు మెరుగుపడి, అవుట్ పేషెంట్లకు కూడా సేవలను విస్తరించినప్పుడు ఆ కేటాయింపును మూడు రెట్లు పెంచవలసివుంటుంది. ఇక చివరి ప్రతిపాదనను చూద్దాం. ప్రాథమిక ఆరోగ్యభద్రతకు నిబద్ధమయివున్నామని సూచిస్తే సరిపోతుందా? స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ అన్ని ప్రభుత్వాలూ ఈ లక్ష్య సాధన విషయంలో తమ నిబద్ధతను ప్రకటిస్తూనే వున్నాయి. వెల్‌నెస్ క్లినిక్స్‌కు కేవలం రూ.2000 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులతో, మొత్తం వెల్‌నెస్ క్లినిక్‌లలో కేవలం ఐదో వంతును మాత్రమే పటిష్ఠంగా అభివృద్ధి పరచడానికి దోహదం జరుగుతుంది. వెల్‌నెస్ క్లినిక్స్‌తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ కూడా ప్రాథమిక ఆరోగ్యభద్రతా వ్యవస్థలో అంతర్భాగాలు. వ్యాధి నివారణ, సకాలంలో వైద్య సేవలు అందించడం, హైపర్ టెన్షన్, డయాబెటిస్, వృద్ధాప్య రుగ్మతలు మొదలైన దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స సమకూర్చడానికి ఈ మూడంచెల ప్రాథమిక ఆరోగ్య భద్రతా వ్యవస్థను ఉద్దేశించడం జరిగింది. అయితే ప్రాథమిక ఆరోగ్య భద్రతా వ్యవస్థకు కేంద్ర స్థాయిలో గానీ, రాష్ట్రాల స్థాయిలో గానీ ఎప్పుడూ అవసరాల మేరకు నిధులు కేటాయించడం జరగలేదు. దీనికి తోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది కొరత తీవ్ర స్థాయిలో ఉంటూ వస్తోంది. వసతుల విషయం మరి చెప్పనవసరం లేదు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే అంటురోగాల తాకిడిని సమర్థంగా ఎదుర్కోవడంలో ఈ వ్యవస్థ పూర్తిగా విఫలమయింది. ఫలితంగా నిర్దేశిత లక్ష్యమైన ముప్పైరకాల సేవలలో ఐదో వంతు సేవలను మాత్రమే ఈ మూడంచెల ప్రాథమిక ఆరోగ్య భద్రతా వ్యవస్థ సమకూర్చగలుగుతుంది. దీంతో చాలా మంది ప్రజలు రోగ ఉపశమనానికి ఈ వ్యవస్థను ఆశ్రయించడం బదులు చిట్కా వైద్యాల వైపు మొగ్గుతున్నారు.



సమగ్ర ప్రాథమిక ఆరోగ్య భద్రతను సమకూర్చడం విధాన లక్ష్యంగా ఉన్నది. మరి ఈ లక్ష్యం నెరవేరాలంటే ప్రాథమిక ఆరోగ్య భద్రతా వ్యవస్థకు తప్పనిసరిగా లక్ష కోట్ల రూపాయలు నిధులు సమకూర్చాలి. దీంతో పాటు తాగునీరు, ఆహారం, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిశుభ్రత మొదలైన అంశాలలో కూడా పరిస్థితులను ఇతోధికంగా మెరుగుపరచవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ రంగాలలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టిన బ్రెజిల్, జపాన్, చైనా, శ్రీలంకలు ప్రాథమిక ఆరోగ్య భద్రతలో గణనీయమైన ఫలితాలను సాధించగలిగాయి. జీవిత పరిమాణం పెంపుదల, ఎమర్జెన్సీ కేసులు, వ్యాధిగ్రస్తత, ఆస్పత్రీకరణను తగ్గించడం మొదలైన ఫలితాలను సాధించగలిగాయి. మన దేశంలో ఇంచుమించు 35 శాతం మరణాలు పోషకాహార లోపం, క్షయ, శ్వాసకోశ సంబంధ వ్యాధులతో సంభవిస్తున్నాయి. అలాగే నవజాత శిశువుల మరణాలూ చాలా పెద్ద సంఖ్యలో ఉంటున్నాయనేది విస్మరించలేని వాస్తవం. ప్రాథమిక ఆరోగ్య భద్రతా వ్యవస్థను పటిష్ఠపరిచినప్పుడే ఇవి నివారింపబడుతాయి.

ఆరోగ్య భద్రతా అంశాలలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య చాలా వ్యత్యాసాలున్నట్టు 2016 సంవత్సరపు 'వ్యాధి భారం నివేదిక' (బర్డెన్ ఆఫ్ డిసీజ్ రిపోర్ట్) స్పష్టం చేసింది. ఉదాహరణకు కేరళలో మహిళ సగటు జీవిత పరిమాణం 78.7 సంవత్సరాలుకాగా అసోంలో 63.5 సంవత్సరాలు మాత్రమే. ఉత్తరాది రాష్ట్రాలలో 33 శాతం రోగగ్రస్తత అంటు వ్యాధుల మూలంగా సంభవిస్తుందని ఆ నివేదిక పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాలలో అంటురోగాలు కాని వ్యాధుల మూలంగా సంభవిస్తున్న వ్యాధి భారం, జీవన శైలులలో మార్పుల ద్వారా గణనీయంగా తగ్గించడం జరిగిందని ఆ నివేదిక తెలిపింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే రక్తశుద్ధి చికిత్స (డయాల్సిస్) అవసరమయ్యేటటువంటి మూత్రపిండాల వైఫల్యాన్ని నివారించాలంటే మధుమేహం నివారణ, మద్యపానం అలవాటును తగ్గించడం ద్వారా సాధ్యమవుతుంది. ప్రభుత్వం చేయవలసింది డయాల్సిస్ అవసరమైన వ్యక్తికి ఏటా లక్షన్నర రూపాయలు సమకూర్చడం కాదు. మూత్ర పిండాల వైఫల్యానికి దారి తీస్తున్న జీవన శైలులను మార్చడం. మన దేశంలో ఆరోగ్య విధాన నిర్ణేతలకు ఈ వాస్తవాలు తెలుసు. అయినా వారు వాటిని విస్మరిస్తున్నారు. సుదృఢమైన ప్రాథమిక ఆరోగ్యభద్రతా వ్యవస్థ నిర్మాణ కర్తవ్యాన్ని ఉపేక్షిస్తున్నారు.

ప్రజారోగ్యం రంగంలో ప్రభుత్వం నిర్వహించాల్సిన పాత్రను జాతీయ ఆరోగ్య సంరక్షణా పథకం పునర్ నిర్వచించింది. ఆరోగ్య సేవల ప్రదాతగా ఉన్న రాజ్యవ్యవస్థను ఆ సేవలకు అవసరమైన ఆర్థిక సౌలభ్యతను సమకూర్చే పెట్టుబడిదారుగా ఎన్‌హెచ్‌పిఎస్ పునర్‌నిర్వచించింది. వైద్య సేవలను అందించడానికి అవసరమైన వసతులను, సదుపాయాల కల్పన బాధ్యతను, ఆ సేవలకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చడాన్ని వేరు చేయడం జరిగింది. దీని వల్ల ఆరోగ్య భద్రతా వ్యయాలను అధికమవుతాయి. అయితే ప్రజలకు నిక్కమైన ఆరోగ్యభద్రతా సేవలు అందేలా చేయడంలో వైద్య సేవలు అందించేవారిని, ప్రభుత్వాన్ని జవాబుదారులను చేస్తుంది. ఇదీ కొత్త ఆరోగ్యభద్రతా సిద్ధాంతం. మరి వాస్తవాలు ప్రజారోగ్యానికి అనుకూలంగా పరిణమిస్తాయా? ప్రైవేట్ వైద్య రంగం మరింతగా విస్తరిస్తుంది. ప్రజారోగ్య పరిరక్షణ కంటే ప్రభుత్వం నుంచి మరింతగా లబ్ధిపొందడానికే అది ప్రాధాన్యమిస్తుంది. పేదలు ఎక్కువగా ఆధారపడుతున్న ప్రభుత్వ వైద్య రంగం బలహీనపడుతుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే జాతీయ ఆరోగ్య సంరక్షణా పథకంను పటిష్ఠంగా రూపొందించి, సమర్థంగా అమలుపరచకపోతే, అది ఒక విషమ పరిస్థితికి దారితీస్తుంది. ప్రభుత్వం అనివార్యంగా పులిపై స్వారీ చేసే పరిస్థితిని, అది ఆ స్వారీ నుంచి దిగలేని సంకటస్థితిని కల్పిస్తుంది. ప్రజారోగ్య రంగం విషమ పర్యవసానాలను ఎదుర్కోవలసి వస్తుంది. ఈ దృష్ట్యా జాతీయ ఆరోగ్య సంరక్షణా పథకంపై పార్లమెంటులో సమగ్ర చర్చ జరగాలి. మరి మన రాజకీయవేత్తలు పక్షపాత వైఖరులను విడనాడి విశాల ప్రజానీకం ప్రయోజనాలను పరిరక్షిస్తారా?

(ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యం)

(వ్యాసకర్త కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి)

'రక్షణ'లో ప్రైవేటీకరణ వద్దు!

ఏ దేశానికైనా దేశ రక్షణ అతిముఖ్యమైన అంశం. అందుచేతనే ప్రపంచ దేశాలన్నీ తమ స్వంత రక్షణ విధానాన్ని కలిగి ఉన్నాయి. అత్యధిక మిలటరీ సామర్థ్యం కల్గిన ప్రపంచ దేశాల్లో భారతదేశం మూడో స్థానంలో ఉంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దేశీయ పరిజ్ఞానంతో పూర్తి సామర్థ్యం కలిగి ఉన్నట్లయితే దేశాన్ని సురక్షితంగా కాపాడుతాయి. రక్షణ రంగంపై ఖర్చు పెట్టే దేశాలలో భారతదేశం ప్రపంచంలో 5వ స్థానంలో ఉంది. 2015లో భారతదేశ జీడీపీలో 2.4038% రక్షణ రంగంలో ఖర్చు చేసింది. రక్షణ రంగంలో ఉపయోగించే టెక్నాలజీ చాలా క్లిష్టమైనది. ఖర్చుతో కూడుకున్నది. బ్రిటీష్ వారు దేశం నుంచి వెళ్లాక, భారతదేశం స్వంత రక్షణ సామర్థ్యం గురించి ఆలోచించి మొదటి పారిశ్రామిక తీర్మానం 1948లో అన్ని అంశాలు చేర్చడం జరిగింది. తర్వాత 1956లో భారతదేశంలోని కీలకరంగాలైన రక్షణ, రైల్వే, ట్రాన్స్‌పోర్ట్, అటామిక్ ఎనర్జీ మొదలగు రంగాలను అభివృద్ధి చేయాలని తీర్మానించారు. 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, 52 రక్షణరంగ పరిశోధన సంస్థలు (డీఆర్‌డీవో), డాక్‌యార్డులు మొదలగునవి నిర్మించబడ్డాయి. వీటిని నిర్వీర్యం చేసే పనులను గత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. బీజేపీ ప్రభుత్వం వాటిని మరింత ఉధృతంగా అమలు జరుపుతున్నది. ఇందులో భాగంగానే రక్షణ రంగంలోనికి 100% విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇచ్చింది. మన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు ఉత్పత్తి చేసే 182 వస్తువులను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. 20 వేల కోట్ల రూపాయల విలువైన యుద్ధనౌకల నిర్మాణాలను రిలయన్స్ లేదా ఎల్‌అండ్‌టీ సంస్థలకు అప్పగించాలని నిర్ణయించుకుంది. వీటి టెండర్లలో హెచ్‌సీఎల్ లాంటి ప్రభుత్వరంగ సంస్థలు ఏవీ పాల్గొనకూడదని షరతుపెట్టింది. ఇప్పటికే 220 కంపెనీలకు లైసెన్సులు ఇచ్చారు. 35 వేల కోట్ల రూపాయిలతో 12 యుద్ధ నౌకలను (స్వీపర్లను) దక్షిణ కొరియా నుంచి కొనేందుకు నిశ్చయించారు. లక్ష 40 వేల కోట్ల విలువైన యుద్ధ విమానాలను అమెరికా లేదా యూరప్ దేశాల నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించారు.

'రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ' (డీఆర్‌డీవో)ను 1958లో ఏర్పాటు చేశారు. డాక్టర్ అబ్దుల్ కలామ్ డైరెక్టర్‌గా ఎనలేని కృషి చేసి ఎన్నో విజయాలు సాధించారు. వారి నాయకత్వంలోనే డీఆర్‌డీవో చాలా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం డీఆర్‌డీవో 291 ప్రాజెక్టులపై పరిశోధన గావిస్తున్నది. వాటి విలువ రూ.49,300 కోట్లు. వీటితో పాటు రూ.5076 కోట్ల విలువగల 120 కొత్త ప్రాజెక్టులు కూడా నడుస్తున్నాయి. ఇప్పటి వరకు డీఆర్‌డీవో రూ.69,444 కోట్ల టెక్నాలజీని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, రక్షణ ఉత్పత్తి సంస్థలు, కొన్ని ప్రైవేట్ సంస్థలకు ప్రొడక్షన్‌కు ఇవ్వడం జరిగింది. ఐజీయండీపీ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం మూలంగా మిస్సైల్ తయారీలో భారతదేశాన్ని ప్రపంచంలో మొదటి 5 దేశాలలో ఒకటిగా నిలిపింది.

మోదీ అధికారంలోకి రాగానే రక్షణ శాఖలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 100% అనుమతిస్తూ రక్షణ శాఖలో డీపీపీపీ అనే కొత్త పాలసీని ప్రవేశపెట్టారు. డీఆర్‌డీవోలో వేలాది మంది అనుభవం, సామర్థ్యం ఉన్న సైంటిస్టులు, టెక్నీషియన్లు ఉన్నప్పటికీ టెక్నాలజీ పరిశోధన పనిని పెద్ద పెద్ద ప్రైవేట్ కంపెనీలు 'ఎల్‌ఎన్‌టీ', 'మహేంద్ర'లాంటి కంపెనీలకు ఈ ప్రభుత్వం కట్టపెట్టింది. 2000వ సంవత్సరంలో డీఆర్‌డీవోలో 35,000 మంది పనిచేసేవారు. ప్రస్తుతం వారిసంఖ్య 24,00కి పరిమితమైంది. హైదరాబాద్‌లో డీఆర్‌డీఎల్, డీఎల్ఆర్ఎల్, డీయంఆర్ఎల్, ఆర్‌సీఐ, అనురాగ్ మొదలగు డీఆర్‌డీవో ల్యాబ్స్ ఉన్నాయి. వీటిలో సుమారు 5వేలమంది సైంటిస్టులు, ఉద్యోగులు, వీరితో పాటు సుమారు మరో 5వేలమంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ విధానాల మూలంగా ఇంత ప్రతిష్ఠాత్మక రంగం భవిష్యత్తులో పూర్తిగా ప్రైవేటుపరమయ్యే ప్రమాదం కనిపిస్తోంది.



కమీషన్ల కోసమే ప్రైవేటు ఆయుధ పరిశ్రమలను పాలక వర్గాలు పోత్సహిస్తున్నాయి. బోఫోర్సు తుపాకులు నుంచి వెస్టా హెలికాప్టర్ల కొనుగోలు వరకు ఇదే జరిగింది. చివరికి శవపేటికల కొనుగోలులోనూ గతంలో బీజేపీ ప్రభుత్వ నేతలు కమీషన్లకు కక్కుర్తి పడి, తమ దేశభక్తిని నిరూపించుకున్నారు. రక్షణ రంగం అనగానే రహస్యం అని ప్రభుత్వం చెబుతోంది. ఈ రహస్యం మాటున వేల కోట్ల ప్రజాధనానికి జవాబుదారీతనం లేకుండా పోతోంది.

రాజకీయ నాయకులకు, పెద్దపెద్ద అధికారులకు ఆయుధ వ్యాపారులు భారీ ముడుపులు సమర్పించుకుంటారు. ఈ కమీషన్ల కోసమే ప్రైవేటు ఆయుధ పరిశ్రమలను దేశాన్ని ఏలే పాలక వర్గాలు ప్రోత్సహిస్తున్నాయి. బోఫోర్సు తుపాకులు నుంచి వెస్టా హెలికాప్టర్ల కొనుగోలు వరకు మనం చూశాము. చివరికి శవపేటికలు కొనుగోలులోనూ గతంలో బీజేపీ ప్రభుత్వ నేతలు కమీషన్లకు కక్కుర్తి పడి, తమ దేశభక్తిని నిరూపించుకున్నారు. రక్షణ రంగం అనగానే రహస్యం అని ప్రభుత్వం చెప్తుంది. ఈ రహస్యం మాటున వేల కోట్ల ప్రజాధనానికి జవాబుదారీతనం లేకుండా పోతోంది.

ప్రభుత్వ ఆధీనంలోని ఇస్రో ఒకేసారి 103 ఉపగ్రహాలను అంతరిక్షంలోనికి పంపి ప్రపంచానికి మన సత్తా చాటింది. అటువంటి సత్తా మన దేశంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, డీఆర్‌డీవోలకి ఉన్నది. మన రక్షణ రంగంలో శాస్త్రవేత్తలకూ, మేధావులకూ, అధికారులకూ, సుశిక్షితమైన కార్మిక వర్గానికి కొదువ లేదు. కావలసిందల్లా వాటికి తగిన నిధులిచ్చి, పరిశోధనలకు అడ్డం పడకుండా ఉండడమే! వీరి నైపుణ్యాన్ని ఉపయోగించుకుంటే ప్రపంచంలోనే తిరుగులేని అజేయశక్తిగా మన రక్షణరంగాన్ని నిలబెడతారు. దేశ రక్షణను కంటికి రెప్పలా కాపాడుతారు.

'మేకిన్ ఇండియా' పేరుతో సర్వ సంపదలను తనకు కావాల్సిన అదానీ, అంబానీ లాంటి బహుళజాతి కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నది బీజేపీ ప్రభుత్వం. నల్లధనం పేరుతో పెద్దనోట్లు రద్దుచేసి, నగదు రహితమంటూ కార్పొరేటు పన్నుల పోటుతో ప్రజలను ఇక్కట్ల పాలు చేస్తున్నది.

రక్షణశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులుగా, దేశాభిమానులుగా ఈ రంగంలో జరుగుతున్న దుర్మార్గాన్ని అర్థంచేసుకున్న వారిగా 'ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్' ఆధ్వర్యంలో జూలై 3వ తేదీ నుంచి న్యూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 35 రోజులు రిలే నిరాహార దీక్షలు చేపట్టాము. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీల జాతీయ నాయకులు ఈ ధర్నాకు మద్దతిచ్చారు. ఈ అంశంపై పార్లమెంటులో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఇతర పార్టీల ఎంపీలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ రిలే నిరాహార దీక్షలు జరుగుతున్న సందర్భంగా రక్షణశాఖ మంత్రి, రక్షణ శాఖ సెక్రెటరీలతో జరిగిన సమావేశంలో అన్ని అంశాలనూ వివరించడం జరిగింది. అయినా ఎలాంటి ఖచ్చితమైన హామీ వారి నుంచి రాలేదు.

■ బి. చంద్రయ్య

ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

(నేడు ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద 3 ఫెడరేషన్ల ఆధ్వర్యంలో మహాధర్నా)


తోటబావి ప్రాంగణంలో చీకట్లోనే పెద్ద పట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు

చిమ్మచీకట్లోనే మల్లన్నకు పెద్దపట్నం

- ఆలయ పరిసరాల్లో వెలగని విద్యుత్‌దీపాలు
- ఉత్సవమూర్తులను తీసుకొస్తుండగా తోపులాట
- భక్తులపై లాఠీలు ఝళిపించిన పోలీసులు

చేర్యాల, ఫిబ్రవరి 14 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున పెద్ద పట్నం వేసే కార్యక్రమం చిమ్మచీకట్లో కొనసాగింది. లింగోద్భవ సమయానంతరం ఒగ్గు పూజారులు తోటబావి ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా పెద్ద పట్నం వేయడం ప్రారంభించారు. ఇంతలోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వెంటనే సరఫరాను పునరుద్ధరించినా విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ఆలయ ప్రాంగణంలో చీకట్లు అలుముకున్నాయి. దీంతో సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో ఇబ్బందులు పడుతూ ఒగ్గు పూజారులు పెద్ద పట్నం పూర్తి చేయాల్సి వచ్చింది. మరోవైపు ఉత్సవ మూర్తులను తీసుకొస్తున్న పూజారులకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు, ఆలయ అధికారులు పెద్ద పట్నంపై చిత్ర కన్నుగా అమర్చిన నిమ్మకాయను దక్కించుకునేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలోనే పట్నంపై చిందేసేందుకు శివసత్తులు, భక్తులు ఒక్కసారిగా రావడంతో తోపులాట చోటు చేసుకుంది. ముందస్తు భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో భక్తులను పోలీసులు అదుపు చేయలేకపోయారు. ఒక దశలో భక్తులపై లాఠీలు ఝళిపించడంతో కొందరు సొమ్మసిల్లి పడిపోయారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బస్వరాజు అనే భక్తుడి కాలు విరిగింది. సమీపంలో 108 వాహనం సైతం అందుబాటులో లేకపోవడంతో అతడిని ఆస్పత్రికి తరలించేందుకు అరగంటకుపైగా సమయం పట్టింది. భద్రతా ఏర్పాట్లను అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

దోమ/నేరెడుగొమ్ము, ఫిబ్రవరి 14: అప్పుల బాధతో బుధవారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వికారాబాద్ జిల్లా దోమలో కొండని నర్సింహులు(58) నాలుగు ఎకరాల్లో మూడు బోర్లు వేసినా నీళ్లు పడలేదు. మొక్కజొన్న, కంది పంటలు సాగు చేశాడు. మూడేళ్ల నుంచి పంటలు పండక రూ.4 లక్షల వరకు అప్పులు కావడంతో మనస్తాపం చెంది చెట్టుకు ఉరేసుకున్నాడు. నల్లగొండ జిల్లా నేరెడుగొమ్ము మండలం మేగావత్ తండాలో మూడావత్ బాదన్(45) పెట్టుబడి కోసం రూ. 6 లక్షల వరకు అప్పులు చేశాడు. దిగుబడి రాకపోవడం, అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి అధికం కావడంతో పురుగు మందు తాగాడు.

కేంద్ర మాజీ మంత్రి బోళ్ల బుల్లిరామయ్య కన్నుమూత



తణుకు,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, ఏలూరు మాజీ ఎంపీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఆంధ్రా సుగర్స్ ఛైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బోళ్ల బుల్లిరామయ్య (93) బుధవారం తుది శ్వాస విడిచారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని తన స్వగృహంలో కన్నుమూశారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ వార్త తెలియగానే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హెలికాప్టర్లో తణుకు వెళ్లి బోళ్ల భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బుల్లిరామయ్య కోరిక మేరకు తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలం పెదపట్నం దగ్గర మానేపల్లిలో గురువారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరుగనున్నాయి. కాగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, టీడీపీ నాయకులు బుల్లిరామయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. ఇంకోవైపు.. బుల్లిరామయ్య కుటుంబ సభ్యులను ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ ఫోన్‌లో పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

పెద్ద దిక్కు కోల్పోయాం: చంద్రబాబు

బోళ్ల మరణంతో తెలుగుదేశం పార్టీ పెద్ద దిక్కు కోల్పోయిందని సీఎం చంద్రబాబు అన్నారు. పారిశ్రామికవేత్తగా రాష్ట్రాభివృద్ధికి తోడ్పతూనే రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించారని తెలిపారు. తాను అభిమానించే నాయకుల్లో బోళ్ల బుల్లిరామయ్య ముఖ్యులని.. ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేసి విశిష్ట స్థానం సంపాదించారన్నారు. ఆయన సిద్ధాంతాలు భావితరాలకు ఆదర్శమని కొనియాడారు.

వెయ్యి కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- వంగపల్లి శ్రీనివాస్



రాంనగర్/హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న మాదిగ, మాదిగ ఉప కులాల సంక్షేమం, అభివృద్ధి కోసం వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు సీఎం కేసీఆర్ వెంటనే చర్యలు చేపట్టాలని టీఎమ్మార్పీఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల ఖర్చుపై ఈనెల 16న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం విద్యానగర్‌లోని టీఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే మాదిగ, మాదిగ ఉపకులాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందని ఆరోపించారు. గత బడ్జెట్‌లో దళితుల సంక్షేమం కోసం కేటాయించిన 14 కోట్ల నిధులను ఖర్చు చేయడంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. 20న ఓయూలో మాదిగ ఉప కులాల సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సదస్సులో తమ డిమాండ్ల సాధన కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఈ లోపు ప్రభుత్వం స్పందించి మాదిగ, మాదిగ ఉప కులాల చర్యలను చేపట్టాలని లేనిపక్షంలో టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

రజకులకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలి

- తెలంగాణ రజక సంఘం

బేగంపేట/హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన రజకులకు అసెంబ్లీ సీట్లను కేటాయించాలని తెలంగాణ రజక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పూసాల సంపత్ అన్నారు. సోమాజిగూడలోని కుమ్మర బస్తీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీలు ప్రత్యేక రిజర్వేషన్ ద్వారా నాలుగు అసెంబ్లీ సీట్లు రజకులకు కేటాయించాలని కోరారు. చాకలి ఐలమ్మ భవన నిర్మాణం కోసం పదెకరాల స్థలాన్ని కేటాయించాలని, ఆమె విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రతిష్ఠించాలన్నారు. పోలీస్ శాఖలో పనిచేస్తున్న రజక ఉద్యోగులకు ప్రమోషన్లలో అన్యాయం జరిగిందని చెప్పారు. దేశంలోనే 18 రాష్ట్రాల్లో రజకులకు దళిత వర్గాలుగా గుర్తింపు ఉన్నప్పటికీ, తెలుగు రాష్ట్రాల్లో బీసీలుగా గుర్తిస్తున్నారని పేర్కొన్నారు.

కేసీఆర్‌కు ఉర్దూ భాషపై ఎనలేని ప్రేమ

- ఎంపీ జితేందర్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : సీఎం కేసీఆర్‌కు ఉర్దూ భాషపై ఎనలేని ప్రేమ ఉందని, అందులో భాగంగానే ఉర్దూకు రెండో అధికార భాషగా హోదా కల్పించారని టీఆర్ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో తెలంగాణ స్టేట్ ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్, వర్కర్స్ అసోసియేషన్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో హిందూ, ముస్లింలు సోదర భావంతో మెలుగుతున్నారని, ఎప్పటికీ అలాగే ఉండాలన్నారు. మైనార్టీ ఉద్యోగులు తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ముస్లింలు బంగారు తెలంగాణ నిర్మాణంలో వారు భాగస్వామ్యం అవుతున్నారన్నారు. మైనారిటీ ఉద్యోగుల డిమాండ్లను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

కొడంగల్ జడ్పీటీసీ సభ్యురాలిపై అనర్హత వేటు

నారాయణపేట, ఫిబ్రవరి 14: వికారాబాద్ జిల్లా కొడంగల్ జడ్పీటీసీ సభ్యురాలు శరణమ్మపై అనర్హత వేటు వేస్తూ బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి తీర్పునిచ్చారు. శరణమ్మకు నలుగురు సంతానమున్నారని, ఆమెపై అనర్హత వేటు వేయాలని ఆమె ప్రత్యర్థి ఎల్లమ్మ 2014లో పేట కోర్టును ఆశ్రయించింది. కొడంగల్ జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా శరణమ్మకు నలుగురు సంతానం ఉన్నట్లు ప్రత్యర్థులు ఫిర్యాదు చేసినా, ఆధారాలు సమర్పించలేక పోయారు. తర్వాత ఎన్నికల పిటిషన్ 2014ను చాలెంజ్ చేస్తూ ఎల్లమ్మ కోర్టును ఆశ్రయించి పంచాయతీ రాజ్ 1994 చట్ట ప్రకారం నల్గురు పిల్లలు ఉన్న శరణమ్మపై అనర్హత వేటు వేయాలని కోరింది. శరణమ్మకు 1997లో నాలుగో సంతానంగా కుమారుడు జన్మించినట్లు రికార్డులను సమర్పించింది. దీంతో శరణమ్మపై అనర్హత వేటు వేస్తూ, ఓటమి పాలైన ఎల్లమ్మను జడ్పీటీసీగా గుర్తించాలని జడ్పీ సీఈఓ, చైర్మన్‌కు పేట కోర్టు ఆదేశాలు జారీచేసింది.

కూతురి హత్య కేసులో తండ్రికి జీవిత ఖైదు

- 20 వేల జరిమానా విధింపు

కొడంగల్, ఫిబ్రవరి 14: భార్యపై అనుమానంతో కూతురు తనకు పుట్టలేదన్న భావనతో కన్న కుమార్తెను చంపిన తండ్రికి కోర్టు జీవితఖైదు, 20వేల జరిమానా విధించింది. మహబూబ్‌నగర్ జిల్లా ప్రత్యేక సెషన్స్ జడ్జి పి.ప్రభాకర్ బుధవారం ఈ తీర్పు ఇచ్చారు. పోలీసుల కథనం ప్రకారం వికారాబాద్ జిల్లా మోత్కులబండతండాకు చెందిన మాడవత్ గోపాల్‌నాయక్ 2013జూలై 1న క్షణికావేశంతో తన ఏడాదిన్నర కూతురిని హతమార్చి అడవిలోకి తీసుకెళ్లి కాల్చాడు. ఈ సంఘటనపై అప్పటి వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. కేసుకు సంబంధించిన పూర్వాపరాలను పరిశీలించిన తర్వాత జిల్లా కోర్టు తీర్పును వెలువరించింది.

విద్యార్థినులకు కరెంటు షాక్

- ఒకరి పరిస్థితి విషమం.. మరొకరికి తీవ్ర గాయాలు

బూర్గంపాడు, ఫిబ్రవరి 14: గిరిజనల బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో జరిగింది. బూర్గంపాడు గిరిజన బాలికల వసతి గృహంలో మరుగుదొడ్ల పక్కన ప్రహరీపై ఆరేసిన దుస్తులు తీసేందుకు ఆరోతరగతి చదువుతున్న మడివి మోతి, తాటి సునీత గోడకు ఉన్న ఇనుప చువ్వ సాయంతో ప్రహరీ ఎక్కారు. అయితే ఆ ఇనుప చువ్వకు హైటెన్షన్ విద్యుత్ తీగ తగలడంతో ఆ ఇద్దరు కిందపడ్డారు. తీవ్రగాయాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మోతి అనే బాలిక పరిస్థితి విషమంగా ఉందని.. అవసరమైతే వారిని వరంగల్ ఎంజీఎంకు తరలిస్తామని వైద్యులు తెలిపారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఘటన వివరాలు తెలుసుకున్నారు.

పక్కా రోడ్ల కోసం పాట్లు

10% వాటా నిబంధనతో సర్పంచ్‌ల తంటాలు.. గ్రామాల్లో సీసీ రోడ్ల కోసం రూ.750 కోట్లు

- ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మాణం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పక్కా రోడ్లు.. గ్రామ సర్పంచ్‌లను పరేషాన్ చేస్తున్నాయి. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో అంతర్గత రహదారుల(సీసీ రోడ్ల) నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 750 కోట్లను కేటాయించింది. గ్రామాల వారీగా చేపట్టనున్న రోడ్ల పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం గ్రామ పంచాయతీలు పది శాతం వాటా నిధులు చెల్లించాలని నిబంధన విధించింది. వాటా నిధులు కేటాయించిన పంచాయతీలకు వారం లోగా రహదారులను మంజూరు చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సమాయత్తమవుతున్నాయి. అయితే, చాలా గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో రోడ్లను ఎలా దక్కించుకోవాలో తెలియక సర్పంచ్‌లు తంటాలు పడుతున్నారు. ప్రతిపక్షపార్టీల సర్పంచ్‌లకు సీసీ రోడ్లను దక్కించుకోవడం పరీక్షగా మారితే.. అదే స్థాయిలో అధికార పార్టీ సర్పంచ్‌లు సైతం సవాళ్లు ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ కోటా నుంచి వాటా నిధులను చెల్లించే అవకాశం ఉన్నా... వీటి కోసం తీవ్ర పోటీ నెలకొనడంతో ఆ నిధులను సాధించుకోవడం సర్పంచ్‌లకు కష్టంగా మారుతోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల పరిధిలోని ప్రతిపక్ష పార్టీల సర్పంచ్‌లు నిధుల కోసం వెళితే నిరాశే ఎదువుతున్నట్లు సమాచారం. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రాతినిధ్యమున్న చోట అధికార పార్టీ సర్పంచ్‌లకు ఇదే పరిస్థితి ఎదురవుతోంది. రహదారులు పెద్ద ఎత్తున మంజూరు కావడం, పది శాతం వాటా నిధుల కోసం సర్పంచ్‌లంతా పోటీ పడుతుండడం... ప్రజాప్రతినిధులకూ సమస్యగా మారినట్లు తెలుస్తోంది.



రాజకీయ ముద్ర

చాలామంది ప్రజాప్రతినిధులు తమ వాళ్లకే నిధులు కేటాయిస్తుండడంతో పక్కా రోడ్ల మంజూరులో రాజకీయ జోక్యం పెరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో సగటున ప్రతి మండలానికి రూ. 1.5 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు నిధులు మంజూరవుతున్నాయి. అయితే, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన రోడ్లనే అధికారులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలోనూ ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన రోడ్లను పక్కన పెట్టారనే విమర్శలొచ్చాయి. ఈ సారి కూడా తాము సూచించిన వారికే రోడ్లు మంజూరు చేయాలని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.

మూడు నెలల్లో ముగించాల్సిందే

గ్రామాలకు మంజూరైన అంతర్గత రోడ్లను 31 మార్చి 2018 నాటికి పూర్తి చేసి, ఎంబీ రికార్డు చేయాల్సి ఉంటుంది. దీనికి నెలన్నర గడువు మాత్రమే ఉంది. అందులోనూ వాటా నిధులు కేటాయించిన తర్వాతే రహదారులు మంజూరవుతాయి. కానీ, వాటా నిధులు చెల్లించడమే సర్పంచ్‌లకు సమస్యగా మారుతోంది. ఆరేడు నెలల్లో పదవీ కాలం ముగియనున్న గ్రామాల్లో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించి, ప్రజాభిమానం చూరగొనాలని భావిస్తున్న సర్పంచ్‌లకు వాటా నిధుల తంటా ఎదురవుతోంది. అయితే పక్కా రోడ్ల మంజూరులో రాజకీయ జోక్యం తగదని పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, జనగామ జిల్లా గుండాల మండలం తుర్కలషాపూర్ సర్పంచ్ పి.మల్లేశ్ కోరారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కోటా నిధులకే అధికార యంత్రాంగం ప్రాధాన్యమిస్తోందని వారు ఆవేదన వ్యక్తంచేశారు.

రోడ్లకు సంబంధించిన మరిన్ని వివరాలు

- గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు నివాసముండే ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం
- ఉపాధి కూలీల వేతనం ఎక్కువ మొత్తంలో ఖర్చు చేసిన గ్రామ పంచాయతీలకు రహదారుల్లో ప్రాధాన్యం
- జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ... పక్కా రోడ్ల నిర్మాణానికి జాబితాను సిద్ధం చేస్తుంది.
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ప్రభుత్వ అనుమతితో ఈ పనులను మంజూరు చేస్తారు
- పూర్తి ఎస్టీ జనాభా ఉన్న ఆవాసాల్లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రహదారుల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తారు.

టీఆర్ఎస్ పాలనపై ప్రజలు పోరాడాలి

'పులిచింతల' బాధితులకు పరిహారమేదీ?.. మీడియా ప్రజల పక్షాన నిలవాలి: ఉత్తమ్ కుమార్‌రెడ్డి


పులిచింతల ముంపు బాధితులనుద్దేశించి మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్/చింతలపాలెం: రాష్ట్రంలో గాడి తప్పిన టీఆర్ఎస్ పాలనపై ప్రజలు పోరాటం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని ధ్వజమెత్తారు. పాలకులను ప్రశ్నించినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభమైన మీడియా ప్రజల పక్షాన నిలవాలని సూచించారు. సంబంధిత యాజమాన్యాలు కూడా విలువలను కాపాడాలని కోరారు.సుస్థిర పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని పునరుద్ఘాటించారు. పులిచింతల ప్రాజెక్టు పరిధిలోని ముంపు బాధితులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించేందుకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ప్రకటించారు. చింతలపాలెం మండలం చింత్రియాల పులిచింతల పునరావాస కేంద్రంలో ముంపువాసులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ముంపు బాధితులకు అత్యధిక పరిహారం ప్రకటించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. పెండింగ్‌లో ఉన్న పరిహారం బిల్లులను చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఏసీబీకి చిక్కిన ఎస్సీ వెల్ఫేర్ డీడీ


యాదయ్య

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 14: కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎస్సీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ పెరక యాదయ్య, మధ్యవర్తిగా వ్యవహరించిన కరీంనగర్ ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్యాంసుందర్‌రావును కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. కరీంనగర్‌లోని మారుతీనగర్‌కు చెందిన బాకం కనకయ్య జిల్లా కేంద్రంలోని మూడు ఎస్సీ హాస్టళ్లకు కూరగాయలు, పండ్లు, గుడ్లు సరఫరా చేయడంతోపాటు హాస్టల్‌లో క్యాటరింగ్ కూడా నిర్వహిస్తున్నాడు. కనకయ్యకు టెండర్‌లో క్యాటరింగ్ దక్కేలా చూశానని, అందుకు లక్షా ముప్పై వేల రూపాయలు ఇవ్వాలని, అంత వరకు క్యాటరింగ్ బిల్లు ఇవ్వరంటూ డిప్యూటీ డైరెక్టర్ యాదయ్య డిమాండ్ చేశాడు. అంత మొత్తం ఇచ్చుకోలేనని కనకయ్య బతిమిలాడగా, చివరకు లక్ష రూపాయలకు ఒప్పందం కుదిరింది. ఆ మొత్తాన్ని రాంనగర్ ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్యాంసుందర్‌రావుకు ఇవ్వాలని డీడీ యాదయ్య సూచించాడు. బుధవారం సాయంత్రం శ్యాంసుందర్‌రావు తన ఇంటిలో కనకయ్య నుంచి లక్ష రూపాయలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం శ్యాంసుందర్‌రావు, కనకయ్య ఇచ్చిన వాంగ్మూలంతో యాదయ్యను అతడి కార్యాలయంలో అరెస్టు చేశారు. డీడీ ఆదేశాలతోనే తాను డబ్బులు తీసుకున్నానని శ్యాంసుందర్ రావు తెలిపారు.

గురుకుల విద్యార్థులను సైన్యంలో చేర్చడమే లక్ష్యం

- ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

చొప్పదండి, ఫిబ్రవరి 14: గురుకుల విద్యార్థులను సైన్యంలో చేర్చడమే లక్ష్యంగా సైనిక స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ గురుకుల విద్యాలయాన్ని రిటైర్డ్ ఆర్మీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుకుల విద్యార్థులు సైన్యంలో చేరే ఎన్‌డీఏ లాంటి పరీక్షలకు అర్హత సాధించలేక పోతున్నారని అన్నారు. కొంత మంది మిలటరీ అధికారులతో మాట్లాడితే దీర్ఘకాలిక శిక్షణ ఇస్తే సైన్యంలోకి విద్యార్థులు ఎంపిక కావడం సులభం అవుతుందని చెప్పారని ఆయన తెలిపారు. రిటైర్డ్ ఆర్మీ అధికారుల నేతృత్వంలో సైనిక్ స్కూల్‌కు రూపకల్పన చేశామని, రుక్మాపూర్ గురుకులం అందుకు అనువుగా ఉంటుందని ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఇది ప్రయోగాత్మకంగా చేపడుతున్నామని, ఫలితాలను చూసిన తర్వాత మరిన్ని సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. దీనిని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేత్రపర్వం... మల్లన్న రథోత్సవం!


మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీశైల మల్లన్న రథోత్సవం అశేష భక్తజనం వెంటరాగా నేత్రపర్వంగా సాగింది. భ్రమరాంబ సహితుడై స్వామి రథంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రథశాల వద్ద ఆలయ అర్చకులు రథాంగపూజ, హోమాది క్రతువులు నిర్వహించారు. - శ్రీశైలం


మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లి గ్రామ శివారులోని ఏడుపాయల జాతరలో వనదుర్గామాతకు బండ్ల ఊరేగింపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ ఉత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మేడ్చల్ జిల్లా కీసర గుట్టలోని శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. - పాపన్నపేట/మేడ్చల్


మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తిలో గౌరీశంకరుల రథోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. - శ్రీకాళహస్తి

● ఎర్రజొన్న రైతులూ.. ఆందోళనొద్దు: ఎంపీ కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రజొన్న రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతి బస్తాను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని.. ఎర్రజొన్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎర్రజొన్న రైతుల బకాయిలను చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. పంటలకు అవసరమైన నాణ్యమైన కరెంటుతోపాటు మార్కెటింగ్ సౌకర్యాలు పెంచామని, సాగునీటి వనరులను మెరుగు పరిచామన్నారు. ప్రతిపక్షాల తప్పుడు మాటలను నమ్మవద్దని సూచించారు.

● టీఆర్టీలో తప్పుల సవరణకు మరో చాన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్టీ)కు చేసుకున్న దరఖాస్తుల్లో తప్పులసవరణకు అభ్యర్థులకు చివరిఅవకాశం ఇచ్చామని టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ వాణీప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం 5 నుంచి శుక్రవారం ఉదయం 5 గంటల వరకు వెబ్‌సైట్ ద్వారా తప్పులు సవరించుకోవాలన్నారు. పాత 10 జిల్లా ప్రకారం ఆప్షన్లు మార్చుకోని వారికి ఈ నెల 19 నుంచి జారీ చేసే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ కావన్నారు.

● 'స్పోర్ట్స్ కోటా' అక్రమాలపై విచారణకు కమిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్-2017 అడ్మిషన్లలో స్పోర్ట్స్ కోటాలో అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఓ కమిటీని నియమిస్తూ బుధవారం ప్రభుత్వ కార్యదర్శి బి.వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి మహ్మద్ అలీ రఫత్‌ను విచారణ అధికారిగా, హకీంపేట తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ పాఠశాల ఓఎస్డీ కె.నరసయ్యను సహాయకులుగా నియమించారు. ఈ నెల 24లోగా నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని జీవోలో పేర్కొన్నారు.

● తెలంగాణ ఎక్సెలెన్స్ అవార్డుల ఎంపికకు కమిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలులో ప్రభావ వంతంగా పనిచేసిన ఐఏఎస్ అధికారులకు సివిల్స్ సర్వీస్ డే సందర్భంగా ప్రభుత్వం తెలంగాణ ఎక్సెలెన్స్ అవార్డులతో సత్కరించనుంది. ఈ అవార్డుల ఎంపికకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ ఛైర్మన్‌గా మైనారిటీ సంక్షేమ శాఖ ఛైర్మన్ జి.సుధీర్, సభ్యులుగా విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, కన్వీనర్‌గా సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శిని నియమించింది.

● కాంగ్రెస్ పార్టీకి అధికారం కల్ల: జూపల్లి



హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భ్రమల్లో బతుకుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే అన్నీ చేసేస్తామంటూ ఉత్తర కుమార ప్రగల్భా లు పలుకుతున్నారని దుయ్యబట్టారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ పదేళ్ల పాలన లో హామీలను నెరవేర్చలేకపోయిందన్నారు. మరో పాతికేళ్ల టీఆర్ఎస్సే అధికారంలో కొనసాగుతుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ హయాంలో కంటే మెరుగ్గా తమ ప్రభుత్వం పింఛన్ల పంపిణీ, మహిళలకు రుణాలు అందిస్తోందంటూ గణాంకాలను వెల్లడించారు. తాను చెప్పిన లెక్కలు తప్పయితే దేనికైనా సిద్ధమే అన్నారు. అభయహస్తం పింఛన్‌దారులకు ప్రస్తుత బీమా స్థానంలో కొత్త పథకాన్ని తీసుకొచ్చే ప్రతిపాదన ఉందన్నారు.

● కాంగ్రెస్‌ది మైండ్ గేమ్: రావుల

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ కూడా టీఆర్ఎస్ మాదిరిగా మైండ్ గేమ్ ప్రారంభించింది. దీన్ని మానుకుంటే మంచిది. మా పార్టీ నుంచి ఎవరూ కాంగ్రెస్‌లో చేరరు"అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రైతాంగసమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని, పంట అంతా దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. హైదరాబాద్ మెట్రో సవ్యంగా నడవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటో చెప్పాలన్నారు.ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో సుబాబుల్, జామాయిల్ రైతుల సమస్యలపై మాట్లాడేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య లేఖ రాశారు.

● జాతీయ పండుగగా 'మేడారం': నారాయణ



హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ కోరారు. మేడారంలో తాగునీరు, మరుగుదొడ్లు, ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాలు తదితర సౌకర్యాలను మెరుగుపరచాలంటూ ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్‌కు బుధవారం ఆయన లేఖలు రాశారు. యాదాద్రి, తిరుమల తరహాలో శాశ్వత సౌకర్యాలు కల్పించాలన్నారు. కాగా, గ్యాంగ్‌స్టర్ నయీం దుశ్చర్యలకు సహకరించిన వాళ్లు ఎంతటివారైనా వదిలిపెట్టబోమని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సీఎం కేసీఆర్ మౌనంలో ఆంతర్యం ఏమిటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రశ్నించారు. బాధితులకు అండగా సీపీఐ తరపున పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

● పసుపు, జొన్న రైతుల్ని ఆదుకోవాలి: సురేశ్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం వల్లే రైతులు రోడ్లపైకి వస్తున్నారని కాంగ్రెస్ నేత, మాజీస్పీకర్ సురేశ్‌రెడ్డి అన్నారు. ఎర్రజొన్న, పసుపు రైతులు గిట్టుబాటు ధర కోసం 15 రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపారులతో కుమ్మక్కయ్యాయన్న అనుమానం కలుగుతోందన్నారు. పంట ఉత్పత్తులకు మద్దతు ధర ఇచ్చేందుకు రూ.2000 కోట్లు కేటాయిస్తామని మేనిఫెస్టోలో పేర్కొని, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. హరితహారం పేరిట గిరిజనుల పోడు భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ ఆరోపించారు. బయ్యారం, గూడూరు ప్రాంతాల్లో అటవీ అధికారుల చర్యలే ఇందుకు నిదర్శనమన్నారు. వేధింపులు ఆపకుంటే ఉద్యమిస్తామన్నారు. నకిలీ విత్తనాల కంపెనీలపై టీఆర్ఎస్ సర్కారు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాగా, ఓటరు జాబితా సవరణ గడువు పెంచాలని కాంగ్రెస్ నేత మర్రి శశిధర్‌రెడ్డి ప్రధాన ఎన్నికల అధికారి అనూప్‌సింగ్‌ను కోరారు.

● టీఆర్ఎస్‌వి చిల్లర రాజకీయాలు: దాసోజు



హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ పార్టీలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, అందుకే పార్టీని వీడాలని నిర్ణయించుకున్నానని, రెడ్ల ఆధిపత్యంలో ఇమడలేక పోతున్నా" అంటూ తన ట్విటర్‌లో దుష్ప్రచారానికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ముఖ్యఅధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ కోరారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌తో కలిసి బుధవారం సీసీఎస్‌లో డీసీపీ అవినాష్ మహంతికి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించిన వారిని గుర్తించాలన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న తప్పుడు భావనను ప్రచారం చేసి లబ్ధి పొందేందుకు టీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. టీఆర్ఎస్ కుట్ర రాజకీయాల్లో తనను బలిపశువును చేస్తున్నారని మండిపడ్డారు. "బద్‌నాం చేసేలా చిల్లర రాజకీయాలు చేస్తే ఖబర్దార్" అని హెచ్చరించారు.

● పొత్తుల వల్ల నష్టపోయాం: తమ్మినేని



హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వివిధ పార్టీలతో పొత్తులు, కూటములతో రెండున్నర దశాబ్దాలుగా ఎంతో నష్టపోయామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌ను బలోపేతం చేస్తామన్నారు. బుధవారం నాడిక్కడ సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం తర్వాత తమ్మినేని మాట్లాడుతూ.. టీజేఏసీ కొత్తపార్టీపై విధివిధానాలు వెల్లడయ్యాక స్పందిస్తామన్నారు. ప్రభుత్వ వైఖరిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ వాస్తవాలు తెలుసుకుని, తమతో కలిసి వస్తే ఆహ్వానిస్తామన్నారు. పెన్షన్ల పంపిణీ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని సీఎం కేసీఆర్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి బహిరంగ లేఖ రాశారు.

నేడు జైట్లీతో సీఎం భేటీ

- పెట్టుబడి మద్దతు పథకానికి అప్పులు
- వెసులుబాటు ఇవ్వాలని కోరనున్న కేసీఆర్
- నాబార్డు రుణాలపై సడలింపుల కోసం పట్టు



హైదరాబాద్, 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీని కలవనున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తెస్తారని సమాచారం. ముఖ్యంగా ఏప్రిల్ నెలలోనే రాష్ట్రం అప్పు తీసుకునేందుకు అనుమతివ్వాలని, వ్యవసాయ పెట్టుబడి మద్దతు కోసం బ్యాంకుల్లో నగదు నిల్వ ఉండేలా చూడాలని కోరనున్నట్లు తెలిసింది. సాధారణంగా ఒక రాష్ట్రం ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడి రుణాలను సేకరించుకోవాల్సి ఉంటుంది. ఈ రుణాల కోసం కేంద్ర ఆర్థిక శాఖ ప్రతి రాష్ట్రానికి రెండు సార్లు మాత్రమే అనుమతి ఇస్తుంటుంది. మొదటి మూడు త్రైమాసికాలకు మే, జూన్ నెలల్లో అనుమతి ఇస్తుంది. చివరి త్రైమాసికానికి డిసెంబరు నెలలో అనుమతి ఇస్తుంది. ఈ అనుమతులు లభించినదానిని బట్టి రాష్ట్రాలు రిజర్వు బ్యాంక్ ఇండియాను సంప్రదించాల్సి ఉంటుంది. ఆర్‌బీఐ ప్రతి వారం రోజులకో సారి వేలం నిర్వహించి, బ్యాంకుల నుంచి రాష్ట్రాలకు రుణాలు ఇప్పిస్తుంటుంది. ఈ ప్రక్రియ అంతా జూన్ చివరి నాటికి పూర్తవుతుంది. కానీ... రాష్ట్ర ప్రభుత్వం మే నెలలోనే పంట పెట్టుబడి మద్దతు పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. అప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి పన్నులు, పన్నేతర రాబడులు పెద్దగా రావు. ఈ పథకం కింద మొదటి దశలోనే రూ.6000 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వ ప్రాథమిక అంచనా. అందుకే జైట్లీతో ఈ అంశంపై సీఎం కేసీఆర్ మాట్లాడనున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెల అయిన ఏప్రిల్ నెలలోనే తమకు అప్పు తీసుకునే ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని కోరనున్నారు. ఇక ఈ పథకం కింద రూ.6000 కోట్ల మేర నగదును పంపించాలంటూ రాష్ట్ర మంత్రులు ఈటల, పోచారం ఇదివరకే జైట్లీని కోరారు. కానీ... కేంద్రం నుంచి ఇప్పటివరకు ఎలాంటి భరోసా లభించలేదు. ఈ దృష్ట్యా ముఖ్యమంత్రే స్వయంగా జైట్లీతో ఈ విషయాన్ని ప్రస్తావించనున్నట్లు సమాచారం. కాగా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు రూ.10 వేల కోట్ల మేర రుణాలను అందించడానికి నాబార్డు ముందుకు వచ్చింది. కానీ... ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడి ఈ రుణాలను అందిస్తామన్న షరతు విధించింది. నాబార్డు రుణాలను ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలతో సంబంధం లేకుండా ఇప్పించాలని సీఎం కోరనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అభివృద్ధి కార్పొరేషన్‌కు ఈ రుణాలు ఇచ్చేలా సడలింపునివ్వాలని అడగనున్నారు.

మా వాటా మాకు రావాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో హరీశ్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల తలెత్తే ముంపు సమస్యలపైనా చర్చించారు. పోలవరం కారణంగా భద్రాచలం సీతారామస్వామి దేవాలయం సహా పలు గ్రామాలు, బొగ్గు గనులు, మణుగూరు భార జల కేంద్రం తదితర ముఖ్యమైన ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని హరీశ్ చెప్పారు. ఈ ప్రాజెక్టు ప్రభావం భద్రాచలం పట్టణం, దాని చుట్టుపక్కల గోదావరి పరివాహక ప్రాంతంలో 124 కిలోమీటర్ల మేరకు ఉంటుందన్నారు. పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావిత ప్రాంతాలు, తలెత్తే సమస్యలపై అధ్యయనం చేయాలంటూ పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని హరీశ్ ఉన్నతాధికారులను కోరారు. బచావత్ ట్రైబ్యునల్ అవార్డు ప్రకారం పోలవరానికి కేంద్ర జలసంఘం అనుమతులిచ్చిన తర్వాత నాగార్జునసాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలకు 45 టీఎంసీల నీటిని వినియోగించుకునే హక్కు దక్కుతుందన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రస్తుతం కేంద్రమే పోలవరాన్ని చేపట్టినందున ఆ 45 టీఎంసీల నీటిని తెలంగాణకు కేటాయించాలంటూ కేంద్రాన్ని కోరతామని చెప్పారు. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల కింద 36.45 లక్షల హెక్టార్ల భూములున్నప్పటికీ కేవలం 5.75లక్షల (15 శాతం)హెక్టార్ల భూమికి మాత్రమే సాగునీరు అందుతున్నదని తెలిపారు. 45 టీఎంసీల నీటిని తెలంగాణకు కేటాయిస్తే నీరందని ప్రాంతాల్లో సాగుకు వాడుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్ కొత్తగా పట్టిసీమ ప్రాజెక్టు చేపట్టి గోదావరి జలాలను వాడుకుంటున్నట్టు కేంద్రానికి ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టిసీమ నీటిలోనూ తెలంగాణకు వాటా ఉందన్నారు. మొత్తంగా రెండు రాష్ట్రాలకు కృష్ణాలో కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణకు 575 టీఎంసీలు కేటాయించి రాష్ట్రానికి న్యాయం చేయాలంటూ కేంద్రాన్ని కోరాలని ఆదేశించారు. రాజోలిబండ డైవర్షన్ పథకం కింద రాష్ట్రానికి 15.9 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ సగటున 4.56 టీఎంసీలకు మించి రావడం లేదని మంత్రి తెలిపారు. ఆర్డీఎస్ కాలువల ఆధునికీకరణ చేపట్టాలని 2004లో నిపుణుల కమిటీ సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సమైక్య రాష్ట్రంలో ఈ పనులు ముందుకు సాగలేదని.. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఏపీ అనేక అడ్డంకులు సృష్టిస్తున్న విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులకు చెప్పారు. ఇక శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల కింద నీటి వాడకాన్ని లెక్క గట్టేందుకు టెలిమెట్రీ స్టేషన్లు ఏర్పాటు చేయాలని 2016 జూన్‌లో కేంద్ర జలవనరుల శాఖ నిర్ణయించినప్పటికీ బోర్డు వాటిని అమలు చేయలేదన్నారు. తొలివిడతలో ఏర్పాటు చేసిన టెలిమెట్రీ స్టేషన్లు పనిచేయడం లేదని చెప్పారు. రెండో విడత టెలిమెట్రీ స్టేషన్ల జాబితాను ఇంతవరకు ఖరారు చేయకపోవడాన్ని ఆక్షేపించారు. బోర్డుపై కేంద్రానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.



రైల్వే బ్రిడ్జిల పెండింగ్ పనులపై నిర్వహించిన సమీక్షలో మంత్రులు హరీశ్, తుమ్మల, మహేందర్

ఏఐబీపీ ప్రాజెక్టులను పూర్తి చేయండి

ఏఐబీపీ కింద రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రి హరీశ్ అధికారులను ఆదేశించారు. కేంద్ర నిధుల వ్యయానికి సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లను వెంటనే జారీచేయాలని చీఫ్ ఇంజనీర్లకు సూచించారు. పలు ప్రాజెక్టులను పూర్తిచేయడానికి డెడ్‌లైన్లను ఖరారు చేశారు. వచ్చే జూన్ వరకు భీమా, నీల్వాయి, కొమురంభీం ప్రాజెక్టులను పూర్తిచేయాలన్నారు. గొల్లవాగు ప్రాజెక్టును వచ్చే నెలాఖరుకు పూర్తిచేయాలని, పాలెంవాగును మే కల్లా పూర్తిచేయాలని, దేవాదులను 2019 మార్చి నాటికి, ఎస్సారెస్పీ వరద కాలువను 2019 జూన్ నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు.

జోషి చిత్తశుద్ధిని కేసీఆర్ గుర్తించారు

తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా సాగునీటి వ్యవహారాలను పర్యవేక్షించిన జోషి అత్యంత బాధ్యతాయుతంగా పనిచేశారని హరీశ్‌రావు కొనియాడారు. ఆయన చిత్తశుద్ధి, నిబద్ధత, కృషిని సీఎం కేసీఆర్ గుర్తించారన్నారు. అనేక క్లిష్టమైన సమస్యలను ఆయన సునాయాసంగా పరిష్కరించారని కొనియాడారు. జలసౌధలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎస్‌గా నియమితులైన జోషీని మంత్రి హరీశ్‌రావు, సీఈలు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ.. తన 34 ఏళ్ల సర్వీసులో ఎందరో మంత్రులను చూశానని, హరీశ్ లాంటి మంత్రిని మాత్రం చూడలేదని చెప్పారు.

జనవరిలో గజ్వేల్‌కు సీఎం రైలు ప్రయాణం

- ఈ ఏడాది చివరికి లైన్లు నిర్మించాలి: హరీశ్
- మియాపూర్-పటాన్‌చెరులో రైల్వే టెర్మినల్: తుమ్మల

'అక్కంపేట-మెదక్, కొత్తపల్లి-మనోహరాబాద్' రైలు మార్గాల నిర్మాణాన్ని ఈ ఏడాది చివరిలోగా పూర్తి చేయాలని రైల్వే అధికారులను మంత్రి హరీశ్‌రావు కోరారు. వచ్చే ఏడాది జనవరిలో సీఎం కేసీఆర్‌తో కలిసి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజ్వేల్‌కు రైలులో ప్రయాణించాలన్నారు. రైల్వే బ్రిడ్జిల పెండింగ్ పనులపై బుధవారం హరీశ్ అధ్యక్షతన జలసౌధలో సమీక్ష సమావేశం జరిగింది. మంత్రులు తుమ్మల, మహేందర్ రెడ్డి, ఎస్సీఆర్ జీఎం వినోద్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. రాష్ట్రంలో 460 రైల్వే లెవెల్ క్రాసింగ్‌లకు ఆర్‌వోబీల నిర్మాణ పనులను దశల వారీగా చేపడుతున్నామని జీఎం వినోద్ తెలిపారు. రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ అంతరాయాలను తగ్గించేందుకు రాష్ట్రంలో 4 వరుసల ఆర్‌వోబీల నిర్మాణానికి ప్రభుత్వం సుముఖంగా ఉందని మంత్రి తుమ్మల చెప్పారు. హైదరాబాద్ శివార్లలోని మియాపూర్-పటాన్‌చెరు ప్రాంతంలో రైల్వే టెర్మినల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పరిశీలిస్తున్నామన్నారు. భూసేకరణ పనులు చేపట్టాలని అధికారులను సమావేశం నుంచే ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న 16 ఆర్‌వోబీల పనుల పురోగతిపై చర్చించారు.

ప్రాజెక్టుల కింద 19 లక్షల ఎకరాలకు నీరు

- రబీ సాగుపై ఇదీ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- భగీరథ కోసం నీటి నిల్వలు కాపాడుకోవాలి
- సీఈలు, ఎస్ఈల సమీక్షలో మంత్రి హరీశ్

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రానున్న రబీలో రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల కింద 19 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల కింద రబీలో నీటి నిర్వహణ, సాధించిన ఆయకట్టు, మిషన్ భగీరథ అవసరాలు తదితర అంశాలపై చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్లతో బుధవారం మంత్రి జలసౌధలో సమీక్షించారు. రబీలో సాగు నీటిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద ఎల్ఎండీకి ఎగువన 4 లక్షల ఎకరాలు, దిగువన 1.15 లక్షల ఎకరాలకు అందించాలని ఆదేశించారు. నాగార్జునసాగర్ కింద 5 లక్షల ఎకరాలకు, పాలేరుకు ఎగువన 3 లక్షల ఎకరాలు, దిగువన 2 లక్షల ఎకరాలకు నీరు అందించాలన్నారు. ఈ లక్ష్యాలను సాధిస్తూనే మిషన్ భగీరథ పథకానికి కేటాయించిన నీటిని జలాశయాల్లో కాపాడుకోవాలన్నారు. శ్రీరాంసాగర్ జలాశయంలో ప్రస్తుతం 10 టీఎంసీలు ఉన్నాయని ఆ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ శంకర్ తెలిపారు. కాలువలపై రాత్రి వేళల్లోనూ గస్తీ నిర్వహించి తూములు పగులగొట్టకుండా, గేట్లు ఎత్తివేయకుండా చూడాలని ఇంజనీర్లకు మంత్రి సూచించారు. కృష్ణా నదితో గోదావరి నదిని అనుసంధానం చేసే 16ఎల్, 18ఎల్ కాలువల పనులను సత్వరమే పూర్తి చేయించాలని అధికారులను మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

డిసెంబరు డెడ్‌లైన్!

(మొదటి పేజీ తరువాయి)

తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తెలంగాణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.558 కోట్లను వచ్చే బడ్జెట్ సమావేశాలు పూర్తయిన తర్వాత... డిసెంబరులోపు ఆరు వాయిదాల్లో బాధితులకు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. లేని పక్షంలో ఎదురయ్యే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇక ఏపీలో ప్రభుత్వ ప్రాజెక్టులు, ఇతర అవసరాల కోసం సేకరించిన భూములకు రూ.62 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారంపై కోర్టు సందేహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ అవసరాలకోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లించాలని కోర్టులు ఇచ్చిన ఆదేశాల అమలులో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీంతో కోర్టు ఉత్తర్వుల అమలు కోసం ఈపీ కేసులు పెరుగుతున్నాయని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన జడ్జి జి.వెంకట క్రిష్ణయ్య రాసిన లేఖను హైకోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)గా స్వీకరించింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె. విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం బుధవారం దీనిపై విచారణ జరిపింది. క్రితం విచారణ సందర్భంగా రెండు రాష్ట ప్రభుత్వాలు దాఖలు చేసిన కౌంటర్ల ప్రకారం... తెలంగాణలోని 31 జిల్లాల్లో 1669 ఈపీలు పెండింగ్‌లో ఉన్నాయి వాటికి రూ.457.79 కోట్లు చెల్లించాల్సి ఉందని ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ మొత్తాన్ని డిసెంబరులోగా 6 వాయిదాల్లో చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ వాదనలు నమోదు చేస్తున్నామని, కోర్టుకు ఇచ్చిన హామీ ప్రకారం బకాయిలు చెల్లించకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హైకోర్టు స్పష్టం చేసింది.

ఏపీలో ఇంతేనా...

ఈనెల 5వ తేదీ నాటికి రాష్ట్రంలో 918 ఈపీలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి 84.32 కోట్లు చెల్లించాల్సి ఉందని ఏపీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇందులో ఇప్పటికే ప్రభుత్వం 21.55 కోట్లు చెల్లించిందని, మిగిలింది రూ.62 కోట్లు మాత్రమేనని చెప్పారు. ఈ బకాయిలు పూర్తిగా చెల్లించడానికి మరో మూడు నెలలు సమయం పడుతుందన్నారు. తెలంగాణలో సుమారు రూ.458 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఏపీలో 62 కోట్లు మాత్రమే చెల్లింపులు పెండింగులో ఉన్నాయనడంపై ధర్మాసనం సందేహం వ్యక్తం చేసింది. అయితే... ఏపీలో చేపట్టిన ప్రాజెక్టులకు భూసేకరణ ఇప్పుడే జరుగుతోందని, వీటిపై ఇంకా ఈపీలు దాఖలు కాలేదని ఏపీ తరపు న్యాయవాది చెప్పారు. ఈ అంశాలపై పలు సందేహాలు ఉన్నాయని వ్యాఖ్యానిస్తూ... రెండు తెలుగు రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న ఈపీల మొత్తాలకు సంబంధించిన పూర్తి వివరాలు మార్చి 31లోగా సేకరించి కోర్టు ముందుంచాలని రిజిస్ట్రార్‌ను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేసింది.

తెలంగాణలో ఇవీ పెండింగ్

జిల్లా	పెండింగ్ ఈపీలు	చెల్లించాల్సిన బకాయిలు
ఆదిలాబాద్	43	55,47,271
కె.బి. అసిఫాబాద్	26	5,90,19,392
మంచిర్యాల	12	9,84,77,916
నిర్మల్	42	9,49,25,392
కరీంనగర్	12	4,12,37,274
పెద్దపల్లి	62	7,07,46,000
రాజన్నసిరిసిల్ల	04	93,54,302
జగిత్యాల	10	1,96,66,250
ఖమ్మం	44	3,74,68,810
భద్రాది కొత్తగూడెం	14	1,95,09,682
సిద్దిపేట	05	1,97,37,831
సంగారెడ్డి	42	6,27,64,021
మహబూబ్‌నగర్	18	6,19,35,570
గద్వాల్	149	222,62,58,299
వనపర్తి	843	40,95,78,814
నాగర్‌కర్నూల్	30	1,33,27,774
నల్లగొండ	19	1,23,92,642
సూర్యాపేట	26	1,64,.64,841
యాదాద్రి భువనగిరి	12	3,12,58,462
నిజామాబాద్	02	62,54,49,109
కామారెడ్డి	21	26,99,75,379
జనగామ	02	3,27,89,479
వరంగల్ రూరల్	23	1,07,63,169
వరంగల్ అర్బన్	08	6,63,60,744
మహబూబాబాద్	13	1,94,18,961
జయశంకర్ భూపాల్‌పల్లి	06	71,08,450
రంగారెడ్డి	17	16,96,10,711
వికారాబాద్	22	5,06,13,669
మేడ్చల్	21	4,89,18,917
మెదక్	-	-
హైదరాబాద్	01	-
మొత్తం	1669	రూ.457,78,89,622

వరి, పత్తి విత్తన పంటలకూ

రుణపరిమితి

- తులసి, రూఫ్ టాప్ సాగుకు ప్రోత్సాహం
- 108 పంటలకు రుణపరిమితి ఖరారు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరంలో విత్తన పంటలకు కూడా రుణపరిమితి వర్తించనుంది. తాజాగా మొత్తం 108 పంటలకు రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ రుణపరిమితిని ఖరారు చేసింది. ఇందులో వరి విత్తన పంట, పత్తి విత్తన పంట కూడా ఉన్నాయి. వరి విత్తన పంటకు ఎకరాకు రూ. 40 వేల నుంచి 42 వేల వరకు, పత్తి విత్తన పంటకు ఎకరాకు రూ. 94 వేల నుంచి రూ. 1.26 లక్షల వరకు రుణపరిమితిని కమిటీ నిర్ణయించింది. ఈ రెండింటికి గతంలో సాధారణ రుణపరిమితే వర్తిస్తుండేది. ఇక పంటల విషయానికి వస్తే.. పత్తికి ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. 35 వేల వరకు నిర్ణయించింది. ప్రస్తుతం అమలవుతున్న దానికంటే ఇది రూ. 2 వేల నుంచి రూ. 5 వేలు ఎక్కువ. వరికి రూ. 30 వేల నుంచి రూ. 34 వేల వరకు నిర్ణయించింది. ఇది ప్రస్తుతం కంటే రూ. వెయ్యి నుంచి మూడు వేల వరకు ఎక్కువ. టమాటా పంటకు ఎకరాకు రూ. 28 వేల నుంచి రూ. 30 వేల మేరకు, క్యాప్సికానికి రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు, సీడ్ లెస్ ద్రాక్ష పంటకు రూ. 1.20 లక్షల నుంచి రూ. 1.25 లక్షల వరకు రుణపరిమితిని కమిటీ ఖరారు చేసింది. తులసి సాగు కూడా ప్రోత్సాహం అందించింది. దీనికి రుణ పరిమితిని రూ. 17,600 వరకు ఖరారు చేసింది. సేంద్రియ కూరగాయల సాగుకు రూ. 37 వేల నుంచి రూ. 40 వేల వరకు ఖరారు చేసింది. రూఫ్ గార్డెనింగ్‌కూ రుణపరిమితిని



ప్రకటించడం విశేషం. వరి, పత్తి వంటి పంటలకు రుణ పరిమితి ప్రకటించినా.. బ్యాంకులు ఆ మేరకు రైతులకు రుణాలు మంజూరు చేయడం లేదు. అవి పంట రుణాల మంజూరులో రుణపరిమతిని కాకుండా.. తిరిగి చెల్లించే సామర్థ్యాన్నే పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

ప్రధాన పంటలకు రుణపరిమితి ఇదీ..

పంట పేరు	2017-18 రుణపరిమితి (ఎకరాకు రూ.)	2018-19 రుణపరిమితి (ఎకరాకు రూ.)
వరి	29 వేలు - 31 వేలు	30 వేలు - 34 వేలు
వరి విత్తన పంట		40 వేలు - 42వేలు
మొక్కజొన్న (వర్షాధారం)	16 వేలు - 18 వేలు	16 వేలు - 20 వేలు
కంది	11 వేలు - 13 వేలు	12 వేలు - 14 వేలు
వేరుసెనగ (ఇరిగేటెడ్)	20 వేలు - 22 వేలు	12 వేలు- 23 వేలు
సోయాబీన్	15 వేలు - 16 వేలు	16 వేలు - 18 వేలు
పత్తి	28 వేలు - 30 వేలు	30 వేలు- 35 వేలు
పత్తి విత్తన పత్తి		94 వేలు-1.26 లక్షలు

గనులు పదిలం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. నాలుగు రోజుల పాటు కొనసాగే 'మైనింగ్ టుడే-2018' అంతర్జాతీయ సదస్సును గవర్నర్ బుధవారం ఇక్కడ హైటెక్స్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనింగ్... పవర్ (అధికారం) లాంటిదని, దానిని సరైన పద్ధతిలో ఉపయోగించుకోవాలని, లేని పక్షంలో వ్యవస్థకు హాని జరుగుతుందని హెచ్చరించారు. మైనింగ్ కార్యకలాపాల్లో అక్రమాలు జరగకుండా ఉండేందుకు కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ముఖ్యంగా మైనింగ్ రంగంలో మైనర్లు పనిచేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మైనింగ్ కోసం భూముల సేకరణ సందర్భంలో నిర్వాసితులకు రక్షణ కల్పించాలని, పునరావాసం చూపించాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. గిరిజన ప్రాంతాల్లో దీనిని మరింత పారదర్శకంగా అమలు పరచాలన్నారు. మైనింగ్ రంగంలో ఆధునిక సాంకేతికత విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుందని తెలిపారు. కేంద్ర గనుల శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ మైనింగ్ విధానం ద్వారా అనేక మార్పులు తీసుకువచ్చినట్టు చెప్పారు. బంగారం వంటి విలువైన గనులు ఉన్న ప్రాంతంలోనే కటిక పేదరికం ఉందని అన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఈ-వేలం ద్వారా 32 గనులను వేలం చేసినట్టు చెప్పారు. వీటి ద్వారా సుమారు రూ.1.35 లక్షల కోట్ల ఆదాయం రానుందని వివరించారు. దేశంలో సుమారు 8 లక్షల చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో గనులు ఉన్నాయని, వీటిలో ప్రస్తుతం ఒక్క శాతం మాత్రమే వెలికి తీస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వాలు సరైన నిర్ణయాలు తీసుకుని ఉంటే ఇది 10 శాతానికి పెరిగేదని, దేశానికి ఎక్కువ ఆదాయం వచ్చి ఉండేదని చెప్పారు. మైనింగ్ వల్ల పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలను తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో మైనింగ్ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చినట్టు చెప్పారు. ఇసుక విషయంలో ఆన్‌లైన్ విధానాన్ని అమలుపరుస్తున్నట్టు తెలిపారు. టి-ఐపాస్ విధానం ద్వారా అనుమతులను జారీ చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోందని, ఈ విషయంలో కేంద్రం కూడా సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఇప్పటికే కేంద్ర మంత్రులు, అధికారులతో అనేక సార్లు చర్చించినట్టు గుర్తు చేశారు. బయ్యారం ప్రాంతానికి రైలు మార్గాన్ని ఏర్పాటు చేయడంలో భాగంగా సాధ్యాసాధ్యాలపై సర్వే చేయడం కోసం రూ.2 కోట్లను కేటాయించినట్టు చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యల కారణంగా రాష్ట్రంలో గనుల ద్వారా 2016-17లో రూ.3170 కోట్ల ఆదాయం వచ్చిందని, 2017-18లో ఈ ఆదాయంలో మరో 30 శాతం పెరుగుదల ఉంటుందని తెలిపారు. మైనింగ్ విషయంలో పర్యావరణ అనుకూలత, రక్షణ చర్యలు, సాంకేతిక పరిజ్ఞాన ఉపయోగం వంటి అంశాలకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందని వివరించారు. తెలంగాణ మైనింగ్ బ్రోచర్‌ను గవర్నర్ విడుదల చేశారు. ఈ సదస్సు ఈ నెల 17 వరకు కొనసాగనుంది. ఈ నెల 15, 16వ తేదీల్లో మైనింగ్‌లోని పలు అంశాలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు చర్చించనున్నారు. 17న ప్రత్యేక ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎండీసీ ఛైర్మన్ సుభాష్ రెడ్డి, కేంద్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్, రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం



శ్రీ శక్తి

రంగుల కళ నెరవేరిందిలా!

ఊహ తెలిసినప్పటి నుంచి ఆమె ప్యాషన్ బిజినెస్... పైగా ఆమెది పూర్తిగా ఇండిపెండెంట్ స్వభావం. ఎవరి మీదా ఆధారపడకుండా స్వయంశక్తితో ఎదగాలనుకుని... తన కలను సాకారం చేసుకున్నారు శృతీరెడ్డి. సొంత డబ్బుతో ఐదు చీరలు కొని, వాటితో బిజినెస్ మొదలెట్టి... క్రమక్రమంగా 'మాన్యా' బ్రాండ్‌గా ఎదిగారామె. ఈ బ్రాండ్‌కు దేశ, విదేశాల్లో కస్టమర్లున్నారు. 'ఈ సక్సెస్ కేవలం మౌత్ పబ్లిసిటీతో సాధించిందే' అనే శృతి.. ఈ స్థాయికి రావడానికి చాలా ఒడుదొడుకులనే ఎదుర్కొన్నారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...

'మాది మహబూబాబాద్ జిల్లాలోని రెడ్యాల అనే చిన్న ఊరు. నాన్న విజయేందర్ వెన్నం వ్యవసాయం చేస్తారు. అమ్మ సీత గృహిణి. ఇంటర్మీడియెట్ తర్వాత హైదరాబాద్‌లో వెబ్‌డిజైనింగ్ డిప్లొమా చేశాను. ఎప్పటికైనా ఒక వ్యాపారవేత్తను కావాలనే కోరిక చిన్నప్పటి నుంచి బలంగా ఉండేది. మనసులో ఆ ఆలోచన ఎలా మొగ్గ తొడిగిందో తెలియదు కానీ నా కాళ్ల మీద నేను నిలబడాలి... తల్లిదండ్రులు, భర్త ఎవరి మీదా ఆధారపడకుండా ఇండిపెండెంట్‌గా ఉండాలనిపించేది. అలా ఏడేళ్ల క్రితం నా ప్రయత్నాలకు శ్రీకారం చుట్టాను.

❖ అక్క కూడా...

మా అక్క ఘనా (ఆఫ్రికా)లో 'టీక్ వుడ్' బిజినెస్ చేస్తుంది. మా ఇద్దరికీ బిజినెస్ చేయడం చాలా ఇష్టం. బహుశా ఇండిపెండెంట్‌గా ఉండాలనే ఆలోచన వల్లే బిజినెస్ రూటును ఎంచుకున్నాం కావొచ్చు. పెళ్లయిన తర్వాత ఇంట్లో ఊరికే కూర్చోకుండా ఏదో ఒక పని చేస్తూ మా కాళ్ల మీద మేం నిలబడాలనుకున్నాం కాబట్టి... పెళ్లికి ముందే మేమిద్దరం బిజినెస్ ప్రయత్నాలు మొదలెట్టాం. పేరెంట్స్ ఇంట్లో మమ్మల్ని అమ్మాయిలుగా కన్నా అబ్బాయిలుగానే పెంచారని చెప్పాలి. కావాల్సినంత స్వేచ్ఛను మా ఇద్దరికీ ఇచ్చారు. పెళ్లి చేసుకునే నాటికే నా వ్యాపారం సాఫీగా సాగుతోంది. పెళ్లికి ముందే మా వారితో "నేను బిజినెస్ వదలను. ఎందుకంటే నాకు మీతో సహా ఎవరి మీదా ఆర్థికంగా ఆధారపడ్డం ఇష్టం లేదు" అని చెప్పాను. తనకెలాంటి అభ్యంతరం లేదని ఆయన నాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాతే పెళ్లి చేసుకున్నాను (నవ్వుతూ...).



డిజైనింగ్ ఐడియాలకు బీజం పడిందక్కడే..

నా చదువు క్రిస్టియన్ మిషనరీల్లో సాగింది. అక్కడ నిత్యం రకరకాల సృజనాత్మక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. వాటన్నింటిలో నేను ఎంతో ఉత్సాహంగా పాల్గొనేదాన్ని. ఆ ఆటల్లో రంగులు నన్ను విపరీతంగా ఆకర్షించేవి. అవే నాలో డిజైనింగ్ ఐడియాలకు బీజం పడేలా చేశాయి. బోటిక్ నా సృజనాత్మకతకు కేంద్రంగా మలచుకున్నాను. నేను ఇచ్చిన డిజైన్లకు స్టూడియోలోని వర్కర్లు అద్దాలతో, రాళ్లతో, స్టిచ్చింగ్, మెరుపులతో చిక్కటి వర్క్ చేస్తారు. నా దగ్గర ప్రస్తుతం 12 మంది పనివాళ్లున్నారు. వారంతా బెంగాలీలే. వాళ్లకి రాళ్లు, కుట్లు, మెరుపులు, అద్దాల వర్క్ చేయడం వంశపారంపర్యంగా వస్తాయి. బాగా కష్టపడతారు. సమయానికి పని పూర్తిచేస్తారు.



❖ 'మాన్యా'తో మార్పు...

సరిగ్గా ఏడు సంవత్సరాల క్రితం 'మాన్యా ఎత్నిక్ స్టూడియో'ను ప్రారంభించాను. ఒకేసారి పెద్ద ఎత్తున ప్రారంభించకుండా మెల్లమెల్లగా ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ ఈ రోజు ఈ స్థాయికి వచ్చాను. ఏ బిజినెస్ అయినా నిర్వహణ చాలా కష్టం. బోటిక్, వెడ్డింగ్ శారీ డిజైనింగ్ కూడా ఇందుకు మినహాయింపేమీ కాదు. ట్రెండ్స్‌కు తగ్గట్టు డిజైన్స్‌లో కొత్తదనం చూపించాలి. శ్రమ కూడా ఎక్కువే. రోజుకు పన్నెండు గంటలు పనిచేస్తాం. ఇక పెళ్లిళ్లు, పండగల సీజన్లలో విశ్రాంతి అసలే ఉండదు. దాదాపు పదిహేను గంటల పైన పని చేస్తాం. బిజినెస్‌కు విలువ ఇవ్వడమంటే ప్రతి రూపాయికీ విలువ నివ్వడమే. అందుకే బిజినెస్ చేయాలనుకునే వారితో 'ఒక్క రూపాయి సంపాదించడం అంటే అనుకున్నంత సులభం కాదు. ఎంతో జాగ్రత్తగా, పొదుపుగా, దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అడుగులు వేయాల'ని చెప్తుంటాను.

❖ ఐదు చీరలతో...

నేను తొలిసారి బెంగళూరు నుంచి ఐదు చీరలు తెచ్చి ఇక్కడ అమ్మాను. మెల్లగా డ్రెస్సులు, శారీ డిజైనింగ్ వంటివి ప్రారంభించాను. ఏడాది తర్వాత బిజినెస్ కొద్దిగా నిలదొక్కుకుంది. దుస్తుల విషయానికి వస్తే ఎక్కువగా రా సిల్క్ పైనే డిజైనింగ్ వర్క్ చేస్తా. ట్రెడిషనల్ వేర్ నా సిగ్నేచర్ ట్యూన్. అందులోనే సృజన బాగా వికసిస్తుందని నమ్ముతా. ఫ్యాబ్రిక్‌ను ముంబయి, బెంగళూరు, కోల్‌కతా, ఢిల్లీల నుంచి తెస్తుంటాను. రకరకాల నేత ఫ్యాబ్రిక్స్ కూడా తెస్తాను. డిజైనింగ్ దుస్తులతో పాటు, అనార్కలీ, వర్క్‌తో ఉండే లెహెంగాలు, జాకెట్లు, పిల్లల దుస్తుల డిజైనింగ్ చేస్తాను. వెడ్డింగ్ డ్రస్సులు ప్రత్యేకంగా డిజైన్ చేస్తాను.

❖ ఏడేళ్లలో టర్నోవర్ పెరిగింది...

ఏడాదికి ఐదారు లక్షల టర్నోవర్ నుంచి ప్రస్తుతం 15 లక్షల టర్నోవర్‌కు వ్యాపారాన్ని వృద్ధిచేశాను. కేవలం 'మౌత్ పబ్లిసిటీ'తో కస్టమర్ల సంఖ్య పెరిగింది. చాలామంది వారి డిజైనింగ్ ఆలోచనలు చెపుతుంటారు. ఇష్టమైన కలర్స్ చెపుతుంటారు. క్లాత్ రంగు, వారి చర్మం టెక్చ్సర్ బట్టి వారికి ఏవి బాగా నప్పుతాయో చెప్పి కన్విన్స్ చేస్తాను. ఏ రంగులతో వారి అందం ఇనుమడిస్తుందో వివరిస్తాను. అలా కస్టమర్లు 'ఓపెన్'గా ఉండడం వల్ల దుస్తుల డిజైన్లు మరింత సృజనాత్మకంగా వస్తాయనేది నా అభిప్రాయం.



❖ డిజైనింగ్ దుస్తులదే పైచేయి...

ఇప్పుడు డిజైనింగ్ వేర్‌కి ఎక్కువ డిమాండ్ ఉంది. పెళ్లిళ్లు, పార్టీలు, ఫంక్షన్లు ఇలా ఒకటేమిటి అన్ని సందర్భాలలో డిజైనింగ్ వేర్‌ని వేసుకోవడానికి మహిళలు ఇష్టపడుతున్నారు. ఒకసారి పార్టీకో, ఫంక్షన్‌కో వేసుకున్న దుస్తులు మరోసారి వేసుకోవడం లేదు. అంతెందుకు మధ్యతరగతివారు కూడా ఈ ట్రెండును అనుసరిస్తున్నారంటే డ్రెస్ కల్చర్‌లో వచ్చిన మార్పులు ఎలా ఉన్నాయో అర్థమవుతుంది. స్వంత ఇంట్లో పెళ్లికి, ఫంక్షన్లకు, పార్టీలకు డిజైనింగ్ దుస్తులు కుట్టించుకోవడం మామూలే కానీ ఇప్పుడు ఇతరులు పిలిచే ఫంక్షన్లకు కూడా ఒకసారి వేసుకున్న డిజైనింగ్ వేర్‌ని ఇంకోసారి వేసుకోవడం లేదు. నేను ఈ స్థితికి రావడానికి ప్రతి స్థాయిలో బాగా కష్టపడ్డం ఒక కారణమైతే... చెప్పిన సమయానికి డ్రెస్ డెలివరీ చేయడం మరో కారణం.

❖ ఓర్పు అవసరం...

ఈ రోజుల్లో చాలామంది ఊ ...అంటే బోటిక్ పెడుతున్నారు. నెల రోజుల్లోనే తీసేస్తున్నారు. 'ఎందుకలా?' అని ప్రశ్నిస్తే 'డబ్బులు రావడం లేదు' అంటున్నారు. ఈ బిజినెస్‌లో నిలదొక్కుకోవడానికి నాకు ఏడేళ్లు పట్టింది. ఈ రంగంలో సంపాదన చూడాలంటే ఓర్పు అవసరం. బిజినెస్ పెట్టిన వెంటనే లాభాలు రావాలనుకోవడం సరైన ఆలోచన కాదు. ఈ పనిలో ఉన్న మరో ఇబ్బంది ఏమిటంటే కస్టమర్లకు, డిజైనర్‌కు మధ్య మంచి అవగాహన ఉండాలి. అందుకే కస్టమర్ల అభిప్రాయాలను మన్నిస్తూనే బిజినెస్‌ను సున్నితంగా సాగించాలి. మా బ్రాండ్ స్టోర్స్ హైదరాబాద్‌లో మూడున్నాయి. మిగతా చోట్ల కూడా ప్రారంభించాలనే ఆలోచన ఉంది.

• **నవ్య డెస్క్**
ఫోటోలు: రాజ్‌కుమార్

స్ఫూర్తి

'అందరు విజేతల్లా ఆమె గురించి ఒక్కమాటలో చెప్పలేం! అదే ఆమె స్పెషాలిటీ! అయినా ఒక్కమాటలో చెప్పాలంటే.. సాహసమే ఆమె ఊపిరి' ఇది శీతల్ మహాజన్ గురించి తెలిసినవాళ్లు చెప్పేమాట! ఆమె గురించి చెప్పాలంటే అవార్డులు, రివార్డులు, రికార్డులే మాట్లాడతాయి. తాజాగా చీరతో స్కైడైవింగ్ చేసి మరో రికార్డు సృష్టించింది. క్వీన్ ఆఫ్ స్కై, జంప్ క్వీన్, ఫ్లయింగ్ బర్డ్... అని అందరూ పిలుచుకునే శీతల్‌కు ఆకాశమే ఆటస్థలంగా ఎలా మారిందంటే...

ఆకాశం ఆమె ఆటస్థలం!

థాయ్‌లాండ్‌లోని పట్టాయా రిసార్ట్... ఆ రోజు అందరిలో ఉత్కంఠ...

ఎందుకంటే అప్పటిదాకా అక్కడి 'థాయ్ స్కై అడ్వెంచర్' ఆధ్వర్యంలో ఆకాశంలో నుంచి డైవ్ చేసిన వారంతా, దానికి తగ్గట్టుగా సూట్ వేసుకుని దూకినవారే. కానీ తొలిసారిగా ఓ భారతీయ మహిళ చీర కట్టుకుని డైవ్ చేయడం ఆ ఉత్కంఠకు ప్రధాన కారణం. శీతల్ 9 గజాలుండే మహారాష్ట్ర నవ్వార చీర కట్టుకొని, నేలకు 13 వేల అడుగుల ఎత్తునుంచి డైవ్ చేశారు. సాహసాలకు చీరకట్టు అడ్డుకాదని నిరూపించారు. విజయగర్వంతో నేలను ముద్దాడారు.



స్నేహితురాలి సోదరుడి స్ఫూర్తితో...

ఆకాశంతో నేలను ముడి వేసిన శీతల్ ప్రస్థానం అతి సామాన్యురాలిగానే ప్రారంభమైంది. శీతల్ మహాజన్ 1982లో మహారాష్ట్రలోని పుణేలో సామాన్య కుటుంబంలో జన్మించారు. జువాలజీలో బీఎస్సీ పూర్తి చేశారు. ఆమె స్నేహితురాలి సోదరుడు వింగ్ కమాండర్ కమల్‌సింగ్ ఒబెరాయ్ పారాచూట్ జంప్‌తో చేసే సాహసాలు చూసి శీతల్ ప్రభావితమైంది. పారా జంపింగ్ చేయాలనే కోరిక ఆమెలో రెక్కలు విప్పుకుంది. అప్పటి నుంచి నింగి నుంచి నేలను ముద్దాడటం అలవాటైంది.

పేరులో పొదువుకున్న శీతలాన్ని తన సాహస యాత్ర శుభారంభానికి వేదికగా ఎంచుకున్నారామె. మంచుఖండం ఆర్కిటిక్ ఉత్తర ధ్రువంలో శీతల్ తొలిసారి పారా జంపింగ్ చేశారు. మైనస్ 37 డిగ్రీల సెల్సియస్.. ఎముకలు కొరికే చలి. కఠిన వాతావరణ పరిస్థితుల మధ్యన 2004 ఏప్రిల్‌లో నేలకు 2400 అడుగుల ఎత్తు నుంచి రష్యన్ ఎం.ఐ హెలికాప్టర్ నుంచి పారాచూట్‌తో జంప్ చేశారు. ప్రపంచంలోనే ఉత్తర ధ్రువంలో పారాచూట్ జంపింగ్ చేసిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. శీతల్ ఈ జంప్ చేయటానికన్నా ముందు ఎన్నడూ హెలికాప్టర్ ఎక్కిందే లేదు.

2006 డిసెంబర్. అంటార్కిటికా దక్షిణ ధ్రువంలో మైనస్ 38 డిగ్రీల సెల్సియస్. గడ్డకట్టించే చలి. ఈసారి ఏకంగా 11,600 అడుగుల ఎత్తు నుంచి జంప్ చేశారు. ఉత్తర దక్షిణ ధృవాల్లో పారాచూట్ జంపింగ్ చేసిన అతి పిన్న వయస్కురాలిగా (అప్పుడు 23 ఏళ్లు) ఆమె ప్రపంచ రికార్డు సృష్టించారు.

నింగిలో పెళ్లి!

2008లో శీతల్‌కు పెళ్లైంది. ఫిన్‌లాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వైభవ్ రాణే వరుడు. పెళ్లి కూడా ఆకాశంలోనే చేసుకున్నారు శీతల్. నేలకు 600 అడుగుల ఎత్తులో హాట్ ఎయిర్ బెలూన్‌లో జరిగిన పెళ్లి అప్పట్లో టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం అవ్వడమేగాక 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో కూడా ఎక్కింది. తరువాత ఆమె అమెరికాలోని అరిజోనాలో యూఎస్‌పీఎ(యునైటెడ్ స్టేట్స్ పారాచూట్ అసోసియేషన్) శిక్షణలో పాల్గొని స్కై డైవింగ్ లైసెన్స్ పొందారు. 2009లో ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చారు. కొన్నాళ్ల విరామం తరువాత 2010లో స్పెయిన్‌లో ఆమె సాధన కొనసాగించారు. శిక్షణలో ఉండగానే వింగ్‌సూట్ జంప్ చేశారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా పేరు గడించారు. 2011లో భారత ప్రభుత్వం ఆమెను 'పద్మశ్రీ'తో సత్కరించింది. పారా జంపింగ్ క్రీడలో ఆమె పేరిట 6 ప్రపంచ రికార్డులు, 17 జాతీయ రికార్డులున్నాయి. ఇప్పటి వరకు శీతల్ 704 జంప్‌లు చేశారు. అడ్వాన్స్ స్కై డైవింగ్ శిక్షణ కోసం భర్తతో కలిసి అమెరికాలోని అరిజోనా వెళ్లారు. అప్పుడే హాట్ ఎయిర్ బెలూన్‌లో 5800 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవ్ చేశారు. కాలిఫోర్నియాలో జరిగే పీ3 ఫార్మేషన్ స్కై డైవింగ్ క్యాంపులో సహచరులతో కలసి భూమి నుంచి 18 వేల అడుగుల ఎత్తులో విన్యాసాలు చేశారు.





మొదటి కపుల్ వాళ్లే!

శీతల్ భర్త వైభవ్ రాణే కూడా యూఎస్‌పీఎ లైసెన్స్ పొందారు. దాంతో మొదటి ఇండియన్ స్కైడైవింగ్ కపుల్‌గా వారు రికార్డుల్లోకెక్కారు. 2011లో స్పెయిన్‌లో అత్యంత కష్టసాధ్యమైన కోచ్ శిక్షణను శీతల్ పూర్తి చేసుకుని, మొదటి భారతీయ మహిళా స్కైడైవింగ్ కోచ్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. 2012లో పుణేలో స్కైడైవింగ్ అకాడమీని ఏర్పాటు చేసి ఆ క్రీడలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. "అమ్మాయిలు రకరకాల క్రీడల్లో రాణించారు. కానీ పారా జంపింగ్‌లోకి మాత్రం ప్రవేశించడం లేదు. మన తొలి మహిళా స్కై డైవర్ రాచెల్ థామస్ స్ఫూర్తితో నేను ఆమె బాటలోనే ముందుకెళ్లాలనుకున్నాను. అందుకే పారా జంపింగ్‌ను వృత్తిగా ఎంచుకున్నాను. మరింత మంది మహిళలు నాలాగే ఈ క్రీడలో రాణించాలని కోరుకుంటున్నా" అంటారు శీతల్. ఇండియన్ టీమ్‌ను 'స్కై డైవింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్'కు తీసుకుపోవాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారు. కృషి పట్టుదలతో అంచెలంచెలుగా ఎదిగి ఆకాశాన్ని చుంబించిన ఆమె ప్రస్థానం అమ్మాయిలకే కాదు అబ్బాయిలకు కూడా స్ఫూర్తి మంత్రం!

వరుడి ఆభరణాలివిగో...

పెళ్లిలో అందరి కళ్లు వధూవరుల మీదే! అలాంటప్పుడు అలంకరణలో వరుడు వధువుకి ఏమాత్రం తక్కువ కాకూడదు. నిలువెత్తు ఆభరణాలతో పెళ్లి కూతురు ధగధగలాడిపోతుంటే, పెళ్లి కొడుకు వెలవెలాపోతే ఎలా? అందుకే ప్రత్యేకంగా వరుడి అలంకరణలో ఆభరణాలు కూడా భాగం కావాలి. అందుకోసం ఇవిగో ఆభరణాలు...

వర మాల: వరుడి మెడలో చంద్రహారం వేసే సంప్రదాయం ఒకప్పుడు ఉండేది. తిరిగి ఇప్పుడదే ఫ్యాషన్ కొనసాగుతోంది. అయితే సాదా చంద్రహారం వేసినా కూడా పక్కకి ఎమరాల్డ్ పెండెంట్ ఉండేలా డిజైన్ చేయించుకుంటే మరింత ప్రత్యేకంగా ఉంటుంది. ఓనిక్స్ లో రెండు, మూడు వరసలు వేసి, సైడ్ పెండెంట్ వేసినా చూడముచ్చటగా ఉంటుంది. ఇవి లక్ష నుంచి లక్షన్నర లోపు ధరల్లో దొరుకుతాయి. ఇంత భారీ ఆభరణాలు వద్దనుకుంటే ముత్యాల మాలలు నాలుగైదు వరసలు వేస్తే సరిపోతుంది. సాత్ లడా (ఏడు పేటల గొలుసు) కూడా అందంగా ఉంటుంది. దీన్ని కుందన్, అన్‌కట్, మోజనైట్‌లో తయారు చేయించుకోవచ్చు.



నగధగ

సర్ పేంచ్: తలపాగా ధారణ వరుడి వస్త్రధారణలో భాగమైంది. అలాంటప్పుడు ఆ తలపాగాకు 'సర్ పేంచ్' తగిలిస్తే వరుడు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాడు. సర్ పేంచ్ ఆభరణం బంగారం, డైమండ్స్, అన్‌కట్, కుందన్లలో దొరకుతాయి. వీటన్నిట్లో కుందన్ సర్ పేంచ్ తక్కువ ధరల్లో దొరుకుతాయి. ఇవి సుమారుగా ఒక లక్ష నుంచి ఒకటిన్నర లక్షల్లో దొరుకుతాయి. పెళ్లయ్యాక ఈ ఆభరణం వృథా అవుతుందేమోననే భయం అక్కర్లేదు. ఇదే సర్ పేంచ్‌ను వధువు తర్వాత లాకెట్‌గా కూడా ఉపయోగించుకోవచ్చు. సర్ పేంచ్‌లు 30 నుంచి 40 గ్రాముల వరకూ బరువు తూగుతాయి. అన్‌కట్స్, మోజనైట్స్‌లో సర్ పేంచ్‌లు మరింత అందంగా ఉంటాయి.




కడా: చేతికి ధరించే సాదా బంగారు కడియం వరుడికి హుందాతనాన్ని తెచ్చి పెడుతుంది. వీటిలో పనితీరు అద్భుతంగా ఉన్నవైతే కాస్త మేకింగ్ ఛార్జెస్ ఎక్కువైనా, ఎంతో ప్రత్యేకంగా కనిపిస్తాయి. ఇక సాదా కడియాలైతే పెళ్లయ్యాక కూడా క్యాజువల్ జ్యువెలరీగా వేసుకుంటూ ఉండొచ్చు. యూనిక్ కూడా అయితే పెళ్లి తర్వాత అవసరానికి తగ్గ ఆభరణాల కొనుగోలుకు ఎక్స్‌చేంజ్ చేసుకోవచ్చు. ఏదేమైనా వరుడికి కొన్న ఆభరణాలు ఎప్పటికీ వృథా కావు.



• **మంజుల రావు,**
మంజుల జ్యువెల్స్,
హైదరాబాద్.

మహామస్తకాభిషేకం



ఆయన హిందువులకు గోమతేశ్వరుడు... జైనులకు బాహుబలి... వీరత్వానికీ, త్యాగానికీ ప్రతీక! అహింసకూ, నిరాడంబరతకూ మారుపేరైన ఆ జైన దిగంబరుడి విగ్రహం శ్రావణ బెళగొళ వింధ్యగిరిపై కొలువు తీరింది. క్రీస్తు శకం 981 లో గంగ వంశ రాజులు బ్రహ్మాండమైన విగ్రహాన్ని నిర్మించినట్టు శాసనాలు చెబుతున్నాయి. అప్పటి నుంచి పన్నెండేళ్ళకు ఒకసారి 'బాహుబలి'కి మహామస్తకాభిషేకం జరపడం సంప్రదాయంగా వస్తోంది. ఈ నెలలో నిర్వహిస్తున్నది 88వ మహామస్తకాభిషేకం.

శ్రావణబెళగొళ...

అభిషేక కళ!





ఎక్కడ?: కర్ణాటకలోని హసన్ జిల్లాలోని శ్రావణబెళగొళలో

ఎప్పుడు?: ఈనెల 17 నుంచి 25 వరకూ

ఎలా వెళ్ళాలి?: రైలు మార్గంలో బెంగళూరు లేదా మైసూరు వెళ్ళి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రావణ బెళగొళ చేరుకోవచ్చు. సమీపంలోని విమానాశ్రయం మైసూరులో (సుమారు 81 కిలోమీటర్లు) ఉంది.

ఏమిటీ వేడుక?: ప్రతి పన్నెండేళ్ళకూ నిర్వహించే మహా వేడుకల్లో- సుమారు 57 అడుగుల గోమతేశ్వరుడి విగ్రహాన్ని 1,008 కలశాలతో పసుపు, కుంకుమ, చందనం, కొబ్బరి నీరు, ఔషధీ జలం, వివిధ నదీ జలాలతో అభిషేకిస్తారు. ఈ సందర్భంగా వివిధ ఆరాధనలు జరుగుతాయి. ప్రపంచంలోని వివిధ ...




ఉత్సవ వివరాలు:

- మొదటి మహా మస్తకాభిషేకం: ఈనెల 17న: 108 కలశాలతో అభిషేకం
- రెండవ మహా మస్తకాభిషేకం: ఈనెల 18న: 1,008 కలశాలతో అభిషేకం
- మహా మస్తకాభిషేకాలు: ఈనెల 19 నుంచి 25 వరకూ: ప్రతిరోజూ పూజ, 1,008 కలశాలతో అభిషేకాలు

మీకు తెలుసా?

ఊరంతా తినొచ్చు!



బవాబెట్ డిమాష్క్ లేదా డమాస్కస్ గేట్... ప్రపంచంలో అతి పెద్దదైన ఈ రెస్టారెంట్ సిరియాలోని డమాస్కస్‌లో ఉంది. ఇండియన్, చైనీస్, అరబ్, మిడిల్ ఈస్ట్, సిరియన్, ఇరానియన్... ఇలా ఆరు ప్రాంతాల రుచులు ఇక్కడ దొరుకుతాయి. అంతేకాదు, ఫౌంటెన్లు, జలపాతాలు, సిరియా పురావస్తు సంపద నమూనాలు ఈ రెస్టారెంట్‌ను సందర్శించినవారికి కనువిందు చేస్తాయి. 2002లో ప్రారంభమైన ఈ రెస్టారెంట్‌లో 6,014 మంది ఒకేసారి భోజనం చెయ్యొచ్చు. సుమారు 1,800 మంది సిబ్బంది పని చేస్తున్న ఈ రెస్టారెంట్‌లో డైనింగ్ ఏరియా 54వేల చదరపు మీటర్లు, వంటిల్లు విస్తీర్ణం 2,500 చదరపు మీటర్లు. 2008లో గిన్నిస్ బుక్ ఆఫ్ ది వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు సైతం ఈ రెస్టారెంట్‌కు దక్కింది.

ఈ-జీ ట్రావెల్

జ్ఞాపకాలు పదిలం!



ఏ కొత్త ప్రదేశానికి వెళ్లినా, అక్కడి ప్రకృతి అందాలను చూసినా వాటిని పంచుకోవాలన్న ఆతురత అందరిలోనూ ఉంటుంది. ముఖ్యంగా ప్రయాణాల్లో మరీనూ! ఈ జ్ఞాపకాలను అక్షరాలుగా మార్చకపోతే మర్చిపోయే ప్రమాదం ఉంది. వాటిని రాయడమే కాకుండా స్మార్ట్‌గా షేర్ చేసుకోవడానికి ఓ యాప్ ఉంది. దాని పేరు 'పోలో'. ఇందులో ఎప్పటికప్పుడు మీ ప్రయాణంలో పదనిసలను పలికించవచ్చు. మొత్తం ట్రిప్ అయ్యాక, మీరు రాసిన అనుభవాలను ఒక చోటికి చేరుస్తుంది. మార్కెట్‌లో ఉండే ఈ తరహా ఇతర యాప్స్‌కి, దీనికీ తేడా ఉంది. ఆఫ్‌లైన్‌లో కూడా రాసుకొనే సౌకర్యం ఈ 'పోలో' యాప్‌లో ఉంది. మరి 'పోలో'లో మీ జ్ఞాపకాలను రాయడానికి మీరు సిద్ధమేనా?

ట్రై చేయండి

ట్యాబ్లెట్ టవల్!



ట్యాబ్లెట్ అంటే నోట్లో వేసుకోవడానికి పనికొస్తుంది గానీ తుడుచుకోవడానికి ఏంటా? అని ఆలోచిస్తున్నారా! అయితే ఇదే వెరైటీ. ఇవి ట్యాబ్లెట్ లాంటి టవల్స్. టూర్‌కు వెళ్లినప్పుడు టవల్స్ పెట్టుకోవడం, అవి ఆరకపోగా బ్యాగ్ అంతా అదో రకమైన వాసన రావడం ఇది అందరికీ ఎదురయ్యే సమస్యే. సింపుల్‌గా, టిష్యూ పేపర్‌లా వాడి పారేసే టవల్ కావాలంటే ఈ 'బయోడిగ్రేడబుల్ హ్యాండ్ టవల్' కావాల్సిందే. ఇవి చూడటానికి ట్యాబ్లెట్ ఆకారంలో, ఇంకా చెప్పాలంటే పిప్పర్‌మెంట్‌లా ఉంటాయి. వాటి మీద నీళ్లు పోస్తే చాలు, పొంగి మినీ టవల్‌లా మారిపోతాయి. ఇందులో విశేషమేమిటంటే ఇవి ఎకో-ఫ్రెండ్లీ. ఆన్‌లైన్‌లోనూ ఇవి అందుబాటులో ఉన్నాయి. వీటి ధర సుమారు రూ.250.

ట్రావెల్ టిప్స్

'పెట్'తో ప్రయాణిస్తున్నారా?

ఇంటిల్లిపాదీ సరదాగా ఎక్కడికో గడపడానికి బయల్దేరాలనుకుంటాం. ఇంతలో మన పెంపుడు జంతువులు 'మరి మా సంగతేంటి?' అని చుట్టూ తిరుగుతూ ఉంటాయి. అవి జంతువులైనా కావచ్చు, పక్షులైనా కావచ్చు.... ఇప్పుడు మీ కుటుంబంలో సభ్యులైపోయాయి. వాటి సంరక్షణ కోసం ఎవరో ఒకరు ట్రిప్ మానుకోవాలి. లేదంటే వాటిని కూడా మీతోపాటు తీసుకువెళ్ళడానికి ప్లాన్ చేసుకోవాలి. ముఖ్యంగా రోడ్డు మార్గంలో లాంగ్ ట్రిప్పులు వేస్తున్నప్పుడు పెంపుడు జంతువుల విషయంలో అనుసరించాల్సిన టిప్స్ కొన్ని:

- లాంగ్ ట్రిప్స్‌కు పెట్స్‌ని తీసుకువెళ్ళడానికి ముందు వాటికి ప్రయాణాలు అలవాటు చెయ్యాలి. అందుకని తక్కువ దూరాలకు కొన్ని సార్లు వాటితో ప్రయాణం చెయ్యండి. అవి సురక్షితంగా, ఎలాంటి గందరగోళం చెయ్యకుండా ఉన్నాయా? అనేది గమనించండి. అవి ఎలా స్పందిస్తున్నాయో, వాటివల్ల ఎదురయ్యే ఇబ్బందులేంటో మీకు అర్థమవుతుంది. దానికి అనుగుణంగా మీ ట్రిప్‌ని డిజైన్ చేసుకోవచ్చు .
- మీ పెట్ కోసం ఒక ట్రావెల్ కిట్ తయారు చేసుకోండి. వాటి ఆహారం, తినడానికి గిన్నె, చెత్తను పారెయ్యడానికి ప్లాస్టిక్ సంచీలు, సోప్, స్పాంజి, ఫస్ట్ ఎయిడ్ కిట్, అవసరమైన మందులు, వాటికి నచ్చే బొమ్మలు, సౌకర్యంగా ఉండడానికి దిండు... ఇలాంటివి కిట్‌లో సర్దుకోండి.
- బాగా గాలి తగిలే బుట్టలోనో, బోనులోనో మీ పెంపుడు జంతువులను తీసుకెళ్ళొచ్చు.





సర్వేసారం

వీళ్లు చాలా 'స్మార్ట్'

టూర్ వెళ్లాలంటే ఇప్పుడు చాలా ఈజీ. ఇదివరకటి రోజుల్లా తిప్పలు పడక్కర్లేదు. స్మార్ట్‌ఫోన్‌లో యాప్ ఓపెన్ చేస్తే చాలు, ఫ్లయిట్, బస్, ట్రైన్, హోటల్ ఇలా ఏదైనా సరే అన్నీ ఒకే సారి బుక్ చేసుకోవచ్చు. 'స్మార్ట్' బుకింగ్‌లో ఎవరెవరు మెరుగ్గా ఉన్నారనే అంశం మీద 'క్యుబిట్' అనే సంస్థ మొత్తం వెయ్యి మందిని ఆరా తీసింది.

- ఏ ట్రిప్‌కి వెళ్లాలి, అక్కడ ఏ హోటల్ బుక్ చేయాలి? అని సందేహం వస్తే టక్కున మొబైల్‌ల్లో వెతికేయడంలో 35 ఏళ్ల లోపు వారు 42 శాతం మంది క్రియాశీలంగా ఉన్నారట. ఇక మొబైల్‌లోనే టికెట్ బుక్ చేసే విషయంలో కూడా వీళ్లే ఫాస్ట్.
- మరి 35కు కి పైబడిన గా వయసు వారి సంగతి ఏంటి? వాళ్లు ఈ విషయంలో టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో కాస్త వెనుకబడిఉన్నారట. కేవలం 24 శాతం మంది మాత్రమే మొబైల్‌లో కావాల్సింది వెతకడంలో కాస్త బెటర్. వారిలో 20 శాతం మంది 'స్మార్ట్' బుకింగ్‌లో ...



ఒంటరి బాటసారి!

స్టార్ వెకేషన్



నవ్య సకల

దారులు రెండు.. ఒకటే ప్రయాణం!



మహేశ్‌తో మంజుల

రైలు పట్టాలు రెండూ ఒకేలా ఉంటాయి. ప్రయాణం సాఫీగా సాగాలంటే ఒకటి వంగితే మరొకటి కూడా వంగాల్సిందే. ఒకటి ఆగితే ఇంకొకటి ఆగాల్సిందే. అయినా దేని ప్రత్యేకత దానిదే. సినిమాలో డైరక్టర్, హీరో కూడా రైలు పట్టాలలాంటివారే. ఇద్దరికీ వేవ్‌లెంగ్త్ కలవాలి. అప్పుడే సినిమా బాగా వస్తుంది. ఈ విషయాన్ని అంతే చక్కగా నమ్మేవారు దర్శకురాలు మంజుల ఘట్టమనేని, హీరో సందీప్‌కిషన్. ఇద్దరూ మంచి వాక్చాతుర్యం గలవారే. ఇద్దరికీ ఎమోషన్స్ ఎక్కువే. అయితే భిన్నాభిరుచులు వీరి సొంతం. 'మనసుకు నచ్చింది' సినిమా కోసం ప్రయాణం చేసిన వీరిద్దరి మనసులోని మాటలు.. 'నవ్య' పాఠకుల కోసం...



సందీప్ కిషన్, మంజుల

నవ్య: మీరు బాగా చదువుతారా మంజులగారు?

సందీప్: చదువుల తల్లిని పట్టుకుని అంత మాట ఎలా అడగగలిగారు?

మంజుల: నేనెప్పుడూ ఏదో ఒకటి చదువుతూ ఉంటా. మిల్టన్, సిడ్నీ, రాబర్ట్ రాసిన పుస్తకాలన్నీ దాదాపుగా చదివేశా. ప్రస్తుతం స్పిరిచ్యువల్ బుక్స్ చదవడం మొదలుపెట్టా. 'కాన్వర్జేషన్స్ విత్ గాడ్', 'సీక్రెట్' వంటివన్నీ ఈ మధ్య చదివా.

...

సందీప్: అబ్బో.. యోగా, మెడిటేషన్‌లకి నాకింకా చాలా టైమ్ ఉంది. పుస్తకాలేమో అప్పుడెప్పుడో 'హ్యారీపోటర్'తో ఆపేశాను. ఇక జిమ్ అంటారా! నా ట్రైనర్ నాకు సాయంత్రం టైమింగ్ ఇచ్చారు. ముందే వెళ్లి నేనేం చెయ్యను?


...

మంజుల: ఛీ.. సరేలే. అదే ఇప్పుడైతే నీ సొంత హోటల్ 'వివాహభోజనంబు' నుంచి తెప్పిస్తావు కదా!

● డా. చల్లా భాగ్యలక్ష్మి
ఫోటో: రాజ్‌కుమార్

మీకు మీరే డాక్టర్

బలుసు వైద్యం భలేభలే



- బలుసు ఆకులను కూరగా వండుకుని తింటూ ఉంటే గౌట్ వ్యాధి తగ్గుతుంది.
- ఆకు రసాన్ని రోజూ 10 మి. లీ చొప్పున చక్కెరతో కలిపి తాగుతూ ఉంటే మూత్రపు మంట తగ్గుతుంది.
- బలుసు వేరు రసాన్ని లేదా కషాయాన్ని తాగితే పొట్టలోని క్రిములన్నీ నశిస్తాయి.
- ఐదారు బలుసు ఆకుల చొప్పున అప్పుడప్పుడు తింటూ ఉంటే అజీర్తి తగ్గి ఆకలి పెరుగుతుంది.
- చక్కగా పండిన బలుసు పండ్లను తింటూ ఉంటే మలబద్ధకం సమస్య తొలగిపోతుంది.
- నెల్లికూర, బలుసు కూర ఈ రెండింటినీ పచ్చడిగా చేసుకుని అన్నంలో కలుపుకుని తింటే వానాకాలంలో వచ్చే పలు రకాల వ్యాధులకు అడ్డుకట్ట పడుతుంది. వర్షాకాలం మొదలవ్వడానికి ముందు నుంచే వారానికి రెండు సార్లు క్రమం తప్పకుండా ఈ పచ్చడి తింటూ ఉన్నా ఈ వానకాలంలో వచ్చే వ్యాధులు నిరోధించబడతాయి.

డైలీ సుడోకు - 107

4	9		6					
			2				5	9
			7	8			2	1
	1							7
	6	4				9	3	
5							4	
7	5			9	4			
3	4				2			
					1		8	4


ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 106 సమాధానం



ప్రేమ... ప్రేమ... ప్రేమ.... ఇది ప్రేమ... సినిమా ప్రేమ! ప్రేమలో పడని మనుషులు... ప్రేమ లేని సినిమా కథలు... మన లోకంతో చాలా అరుదు. అందుకే, ప్రేమికుల రోజును సినిమా జనాలు తమ కొత్త సినిమా లుక్కులు, పాటలు, టీజర్‌లతో సందడిగా జరుపుకున్నారు. ఈ ఏడాది లవర్స్ డే సినిమా బుక్కులోకి నితిన్ టీజర్‌తో వస్తే... నిఖిల్, బెల్లంకొండ శ్రీనివాస్-పూజా హెగ్డే, సుమంత్ అశ్విన్-నిహారిక జోడీలు లుక్కులతో వచ్చారు. నాగశౌర్య అయితే ప్రేయసితో పాటు ఏకంగా అమ్మమ్మను తీసుకొచ్చాడు.

టీజరూ... లుక్కూ... లవర్స్ డే బుక్కు!



ఛల్ మోహన్‌రంగలో నితిన్

ప్రేమకాలంలో మోహన్‌రంగ

ప్రేమకు... ప్రేమలో ఉన్నోళ్లకు... వర్షాకాలం, శీతాకాలం, వేసవికాలం అంటూ తేడాలుండవ్! ప్రతిరోజూ ప్రేయసి లేదా ప్రియుడు ఊహల్లో, తలపుల్లో, మాటల్లో తేలుతూ విహరిస్తుంటారు. ...



'సాక్ష్యం'లో పూజా హెగ్డే, బెల్లంకొండ శ్రీనివాస్

... బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డే తమ లుక్కును తీసుకొచ్చారు. వీళ్లిద్దరూ జంటగా శ్రీవాస్

ప్రేమకు సాక్ష్యం

దర్శకత్వంలో అభిషేక్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'సాక్ష్యం'. అభిషేక్ నామా నిర్మాత. వినూత్న కథాంశంతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో ప్రేమకథకూ మంచి ప్రాముఖ్యం ఉందట! అందుకని, హీరో హీరోయిన్ల లుక్కును ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదల చేశారు. ప్రస్తుతం ఈ సినిమా పతాక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రానికి యాక్షన్: పీటర్ హెయిన్.



'కిరాక్ పార్టీ'లో నిఖిల్

భగ్న ప్రేమికుడు!



'అమ్మమ్మగారిల్లు'లో నాగశౌర్య, సుమిత్ర, షామిలి

అమ్మమ్మగారింట్లో ప్రేమకథ

... బాలనటిగా, 'ఓయ్'లో కథానాయికగా సందడి చేసిన షామిలి కొంత విరామం నటిస్తున్న చిత్రమిది. ఈ చిత్రానికి కె.ఆర్. సహ నిర్మాత. ఛాయాగ్రహణం: రసూల్ ఎల్లోర్, సాహిత్యం: సిరివెన్నెల, సంగీతం: కల్యాణ్ రమణ.

పెళ్లి... ప్రేమ!



నిహారిక, సుమంత్ అశ్విన్

అసలు, ప్రేమ అనేది రెండు మనసులకు సంబంధించిన అంశం కావొచ్చు. కానీ, పెళ్లి? అలా కాదు! రెండు కుటుంబాలకు సంబంధించినది. పెళ్లికి ముందు ప్రేమలో పడనివాళ్లు పెళ్లి కుదిరిన రోజు నుంచి, పెళ్లి రోజు వరకూ కాబోయే భాగస్వామి ప్రేమ కబుర్లు చెప్పుకోవచ్చు. పెళ్లి కుదిరిన దగ్గర్నుంచి పెళ్లి రోజు వరకూ ఓ జంట జీవితంలో, రెండు కుటుంబాల మధ్య ఏం జరిగిందనే కథతో రూపొందుతోన్న సినిమా 'హ్యాపీ వెడ్డింగ్'. సుమంత్ అశ్విన్, నిహారికా కొణిదెల జంటగా యువి క్రియేషన్స్, పాకెట్ నిర్మిస్తున్న చిత్రమిది. ఇందులోని హీరో హీరోయిన్ల లుక్కును ప్రేమికుల దినోత్సవం సందర్భంగా రెండు రోజుల ముందు విడుదల చేశారు.

ఈ టీజర్, లుక్కులతో పాటు రామ్‌చరణ్ 'రంగస్థలం'లోని 'ఎంత సక్కగున్నాదే...', అల్లు అర్జున్ 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా'లోని 'ఐయామ్ లవర్ ఆల్సో... ఫైటర్ ఆల్సో', విశాల్ 'అభిమన్యుడు'లోని 'అడిగా...' పాటలు ప్రేమికుల రోజు సందర్భంగా విడుదలయ్యాయి.



అల్లు అర్జున్, అను

సైనికుడు... ప్రేమికుడూ!

ప్రతి ప్రేమ పాట, రచయిత పెన్నుకి సరికొత్త పరీక్ష పెడుతుంది! అందులోనూ అమ్మాయి బుంగమూతి పెట్టుకుని వెళ్తుంటే... అబ్బాయి బతిమాలే సందర్భం వస్తే కత్తి మీద సామే!

పదహారణాల తెలుగు అక్షరాలను పడుచు పదాలుగా మలిచి బాణీలోకి కుదిరేలా రాయాలంటే... కవిరాజుకి కష్టమే సుమీ!

అటువంటి సందర్భంలో పాట రాసి దర్శక, నిర్మాతలను, కథానాయకుణ్ణి, ప్రేక్షకులను మెప్పించినప్పుడే పాటల రచయితలోని ప్రతిభ బయట పడుతుంది.

రామజోగయ్య శాస్త్రికి అటువంటి సందర్భమే ఎదురైంది. కథానాయకుడు సూర్య సైనికుడు. సరిహద్దుల్లో శత్రువులతో యుద్ధం చేసే అతను ప్రేమికుడు కూడా! ఓ అమ్మాయితో ప్రేమలో పడతాడు. అమ్మాయీ అతణ్ణి ప్రేమిస్తుంది. కానీ, ఒక రోజు సూర్యపై కోపం వస్తుంది. అతడిపై యుద్ధం ప్రకటిస్తుంది. చిన్న చిన్న మనస్పర్థలతో ప్రేమ యుద్ధం అన్నమాట! సరిహద్దుల్లో యుద్ధం అయితే ఎలా చేయాలో సూర్యాకు తెలుసు. ప్రేమ యుద్ధం కొత్త. ప్రేయసిపై బోల్డంత ప్రేమ ఉంది. బ్రేకప్ చెప్పేసి వెళ్ళలేదు. అమ్మాయిని ఏడిపించలేదు. అతడి ప్రేమలో నిజాయితీ ఉంది. పాటలో అది కనిపించాలి. అలాగని, సైనికుడిగా అతని వ్యక్తిత్వాన్ని తగ్గించకూడదు. పాటలో ఆ వ్యక్తిత్వం కనిపించేలా రాయాలి. రామజోగయ్య శాస్త్రి ప్రతిభతో పాటు అనుభవాన్ని రంగరించి 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా' చిత్రంలో 'ఐయామ్ లవర్ ఆల్సో... ఫైటర్ ఆల్సో!' పాటను ట్రెండీగా రాశారు. ప్రేమికుల రోజు సందర్భంగా విడుదలైన ఈ పాటకు శ్రోతల నుంచి మంచి స్పందన లభిస్తోంది. పాట చరణాల్లోని 'నీ హార్ట్ బుక్ పై లవ్ స్టోరీ మళ్లీ రాసే రైటర్ ఆల్సో', 'నీలోని ప్రేమని పట్టుబట్టి బయటపెట్టె లైటర్ ఆల్సో' ప్రయోగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.

పాట: ఐయామ్ లవర్ ఆల్సో... ఫైటర్ ఆల్సో!
చిత్రం: నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా
సంగీతం : విశాల్-శేఖర్
సాహిత్యం: రామజోగయ్య శాస్త్రి
గానం: శేఖర్

పల్లవి:
అట్ట సూడకే... కొట్టినట్టుగా అట్ట సూడకే
సిట్టి గుండెకే... ఊరికూరికే సొట్టబెట్టకే (2)
గురి పెడుతూ సూపులతోనా...
నువు పెల్చకు బొమ్మ తుపాకి
సరిహద్దులు తెంచుకురానా...
నే నీ జిందగిలోకి
ఐయామ్ లవర్ ఆల్సో! ఫైటర్ ఆల్సో! (2)
లవర్ ఆల్సో! ఫైటర్ ఆల్సో!
నో సెప్పి కూసున్న నీ హార్ట్ బుక్ పై
లవ్ స్టోరీ మళ్లీ రాసే రైటర్ ఆల్సో
ఐయామ్ లవర్ ఆల్సో! ఫైటర్ ఆల్సో!

చరణం1:
ఏం చూశావని...
నాలోని ప్రేమికుణ్ణి పూర్తిగా (2)
ఏం చేశానని...
వేలెత్తి చూపుతావు సూటిగా
చలో చలో చలో చెరో సగం తప్పుగా
మరో కథై కలుద్దామా కొత్తగా
ఫ్లాషుబ్యాకు బొమ్మని గుర్తుకే తెచ్చుకో
ప్యాచప్ అయిపోవడానికెంత ఛాన్సో... ఓఓఓ
ఐయామ్ లవర్ ఆల్సో! ఫైటర్ ఆల్సో!

చరణం 2 :
ఇను ఇనవే...
మాట ఇనవే మంచి పిల్లవే
సిన్న గొడవే...
సన్న గొడవే సల్లబడవే
బెదిరింపులు తెగతెంపులుగా... ఎల్లిపోకే బ్రేకప్ లోకి
గడియేసిన తలుపులు తీసి... తిరిగొస్తా నీ లోకి
ఐయామ్ లవర్ ఆల్సో! ఫైటర్ ఆల్సో! (2)
లవర్ ఆల్సో! ఫైటర్ ఆల్సో!
సీకట్లో దాకున్న నీలోని ప్రేమని
పట్టుబట్టి బయటపెట్టె లైటర్ ఆల్సో
ఐయామ్ లవర్ ఆల్సో! ఫైటర్ ఆల్సో!

అప్పుడు కరుణాకరన్.. ఇప్పుడు వెంకీ! - దిల్‌రాజు



రాశీ ఖన్నా, వరుణ్‌తేజ్, దిల్ రాజు

"అప్పుడు 'తొలిప్రేమ'తో కరుణాకరన్ మేజిక్ చేస్తే, ఇప్పుడు వెంకీ అట్లూరి దాన్ని మరలా క్రియేట్ చేశాడు. 'తొలి ప్రేమ' సినిమా డబుల్ పాజిటివ్ చూసినప్పుడే నాకు నచ్చింది. వర్ష పాత్రలో రాశీ ఖన్నా ఎలా ఉంటుందోనని ముందు అనుమానించా. కానీ చాలా బాగా నటించింది. వరుణ్‌తేజ్‌కి 'ఫిదా' తర్వాత చక్కటి ప్రాజెక్ట్ కుదిరింది. ఇందులో వరుణ్ త్రీ షేడ్స్‌లో చాలా బాగా కనిపించారు. ఈ చిత్రాన్ని బీవీయస్‌యన్‌గారి ప్రొడక్షన్‌లో చేస్తానని వెంకీ అట్లూరి చెప్పినప్పుడు ఓ కొత్త దర్శకుడి మానసిక పరిస్థితిని అర్థం చేసుకున్నాను. సినిమా విజయవంతమైనందుకు ఆనందంగా ఉంది" అని దిల్‌రాజు అన్నారు. వరుణ్ తేజ్, రాశీ ఖన్నా జంటగా నటించిన 'తొలిప్రేమ' చిత్రాన్ని ఆయన ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. బీవీయస్‌యన్ ప్రసాద్ నిర్మాణంలో వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ చిత్రం థాంక్స్ మీట్ హైదరాబాద్‌లో బుధవారం జరిగింది. నిర్మాత మాట్లాడుతూ "ఈ కథను నమ్మి చేశాం. మంచి నటీనటులు, టెక్నీషియన్లు కుదిరారు. సినిమా హిట్ అయినందుకు ఆనందంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నా తొలి ప్రయత్నాన్ని ఆదరించినందుకు ధన్యవాదాలు. రాశీ ఖన్నాను అందరూ తమ ఇంట్లో అమ్మాయిలా చూసుకుంటున్నారు. వరుణ్ కథను నమ్మడం వల్లే ఈ సినిమా కుదిరింది" అని చెప్పారు. వరుణ్ మాట్లాడుతూ "దిల్‌రాజుగారు మా సినిమాను చాలా బాగా నమ్మారు. వెంకీ అట్లూరి కథ చెప్పేటప్పుడే కన్విక్షన్ కనిపించింది. చిరంజీవిగారు సినిమా చూసి కొత్త దర్శకుడే తీశాడా? అని షాక్‌కి గురయ్యారు. మా టీమ్ చేసిన కృషికి ఫలితం దక్కింది" అని అన్నారు.



సమంతను కోరిన చైతూ!

చైతూ జీవితంలో శ్రీమతి సమంత చాలా స్పెషల్! అందుకనే కదా... అక్కినేని కుర్రాడు ఏరికోరి ప్రేమించిందీ! పెళ్లి చేసుకున్నదీ! జీవితంలోనే కాదు... సినిమాల్లోనూ సమంతతో వేయబోయే అడుగులు చాలా ప్రత్యేకంగా ఉండాలని నాగచైతన్య (చైతూ) కోరుకుంటున్నారు. పెళ్లికి ముందు చైతూ, సమంత మూడు చిత్రాల్లో కలిసి నటించారు. పెళ్లి తర్వాత ఒక్క సినిమా కూడా చేయలేదు. ఇప్పుడు ఈ జోడీ సినిమా చేస్తే... దానికి ఉండే క్రేజే వేరు. 'నిన్ను కోరి'తో మంచి విజయం అందుకున్న కొత్త దర్శకుడు శివ నిర్వాణ, పెళ్లి తర్వాత చైతూ, సమంతలను దర్శకత్వం వహించే అవకాశం కూడా అందుకోబోతున్నారు. ఇటీవల చైతూ, సమంత కలిసి ఒక సినిమా చేయనున్నారనే వార్త వచ్చిన సంగతి తెలిసిందే. అది శివ నిర్వాణ దర్శకత్వంలో షైన్ స్క్రీన్ సినిమా పతాకంపై హరీశ్ పెద్ది, సాహు గారపాటి నిర్మించనున్న చిత్రమే. ఈ చిత్రకథ చైతూకి బాగా నచ్చేసిందట! ఎంతలా అంటే... అందులోని ఒక ప్రత్యేక పాత్రను సమంత చేస్తే బాగుంటుందనేంతలా! కథ నచ్చడంతో ఆ పాత్రకు సమంత పేరును చైతూనే సూచించారట! సినిమాలో ఆమె పాత్ర నిడివి తక్కువసేపు ఉంటుందని సమాచారమ్. మరి, సినిమాలో ఇంకో హీరోయిన్ ఎవరన్నా ఉన్నారా? లేదా? అనేది తెలియాలి. ఇంకా సమంత కథ వినలేదని తెలుస్తోంది. చైతూకి నచ్చిన కథ కాబట్టి సమంత 'నో' చెప్పే ఛాన్సులు తక్కువే!!

ప్రేమకథ.. ఎందుకో ఏమో!



బోయపాటి శ్రీను, నందు

నందు, నోయల్, పునర్నవి హీరోహీరోయిన్లుగా కోటి వద్దినేని దర్శకత్వంలో మాలతి వద్దినేని నిర్మిస్తున్న 'ఎందుకో ఏమో' చిత్రంలోని తొలి పాటను దర్శకుడు బోయపాటి శ్రీను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టైటిల్ చాలా క్యాచీగా ఉంది. నేను విడుదల చేసిన తొలి పాట వినడానికే కాదు.. చూడటానికీ బాగుంది. హీరో నందు హార్డ్ వర్కర్ . ఈ సినిమా అతనికి పేరు తీసుకురావాలని కోరుకొంటున్నాను' అన్నారు. హీరో నందు మాట్లాడుతూ 'బోయపాటి శ్రీనుగారు లాంచ్ చేసిన పాట నా ఫేవరెట్. మంచి లొకేషన్స్‌లో తీశాం. మా దర్శకనిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా సినిమా తీశారు' అని తెలిపారు. దర్శకుడు కోటి వద్దినేని మాట్లాడుతూ 'సినిమాలో మొత్తం నాలుగు పాటలు ఉన్నాయి. సంగీత దర్శకుడు ప్రవీణ్ ఒక్కో పాటను ఒక్కో విధంగా కంపోజ్ చేశారు. దర్శకుడు వినాయక్‌గారు విడుదల చేసిన టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ప్రేమకథతో రూపుదిద్దుకొన్న ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేస్తాం' అని చెప్పారు. మాలతి వద్దినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో రామ్?



'గరుడ వేగ' సక్సెస్ మీద ఉన్నారు దర్శకుడు ప్రవీణ్ సత్తారు. ఆయన తర్వాతి చిత్రం ఎవరితో అనే విషయం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన త్వరలో రామ్ హీరోగా ఓ సినిమా చేయబోతున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. రామ్ హీరోగా ప్రవీణ్ సత్తార్ దర్శకత్వంలో రూపొందబోయే సినిమాను భవ్య క్రియేషన్స్ పతాకంపై వి. ఆనంద్‌ప్రసాద్ తెరకెక్కించనున్నట్టు సమాచారం. 'నేను శైలజ', 'ఉన్నది ఒకటే జిందగీ' అంటూ ఈ మధ్య కాలంలో ఫీల్ గుడ్ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రామ్ కోసం ప్రవీణ్ సత్తార్ సరికొత్త జోనర్‌లో కథను సిద్ధం చేశారట. కథ, కథనాలు కొత్తగా ఉంటూనే కమర్షియల్ వేల్యూస్‌తో ఉంటాయని సన్నిహితుల సమాచారం. సినిమా ఎప్పటి నుంచి ఉంటుందనేది అధికారికంగా తెలియాల్సి ఉంది.

మరోసారి 'ప్రేమ పావురాలు'



కేజీ, అతుల్య

గత ఏడాది తమిళనాట విడుదలైన లో బడ్జెట్ చిత్రం 'కాదల్ కన్ కట్టుదే' అందరినీ ఆకట్టుకొని ఘనవిజయం సాధించింది. ఆ సినిమాలో జంటగా నటించిన కేజీ, అతుల్య రాత్రికి రాత్రి స్టార్స్ అయ్యారు. ఈ సినిమా విజయం చాలా మంది తెలుగు నిర్మాతలను ఆకర్షించింది. రీమేక్ హక్కుల కోసం పోటీ జరిగినా నిర్మాత శ్రీరామ్ అందులో విజేత అయ్యారు. 'ప్రేమపావురాలు' పేరుతో తెలుగులోకి ఆయన అనువదిస్తున్నారు. గతంలో ఇదే పేరుతో ఓ అనువాద చిత్రం వచ్చిన సంగతి పాఠకులకు గుర్తుండే ఉంటుంది. ఇంతకుముందు నయనతార ప్రధాన పాత్ర పోషించిన 'వాసుకి' చిత్రాన్ని ఆయన తెలుగు ప్రేక్షకులకు అందించారు. 'ఈ సినిమాను తెలుగులో రీమేక్ చెయ్యాలనుకొన్నా. అయితే ఒరిజనల్ వెర్షన్ అంత ఫ్రెష్‌గా, నేచురల్‌గా సినిమా రాదని భావించి, 'ప్రేమపావురాలు' పేరుతో డబ్ చేస్తున్నా. ప్రస్తుతం అనువాద కార్యక్రమాలు జరుగుతున్నాయి. కథ, కథనాలు ఆసక్తికరంగా ఉంటాయి. దర్శకుడు శివరాజ్ అద్భుతంగా తీశారు.వేసవిలో సినిమను విడుదల చేస్తాం' అని తెలిపారు శ్రీరామ్.

బెంగళూరు నుంచి 325 టన్నుల గులాబీల ఎగుమతి

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రేమికుల దినోత్సవం కోసం బెంగళూరు నుంచి ప్రపంచ వ్యాప్తంగా 25 దేశాలలోని 36 ప్రధాన నగరాలకు 325 టన్నుల గులాబీలు ఎగుమతి అయ్యాయని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ హరి మరార్ తెలిపారు. ఈ నెల ఒకటవ తేదీ నుంచి బుధవారం వరకు ఈ గులాబీల ఎగుమతి జరిగిందన్నారు. మలేషియా, కువైట్, సింగపూర్, జపాన్, యుఎస్ఎలకు బెంగళూరు నుంచి గులాబీల ఎగుమతి ఎక్కువగా ఉందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 100 టన్నులకుపైగా ఎగుమతి పెరిగిందన్నారు. బెంగళూరు శివారు తోటలలో ప్రత్యేకంగా పెంచే గులాబీలు ఆకర్షణీయంగా ఉండడంతోపాటు సువాసనలు వెదజల్లుతూ వారంపాటు నిల్వ ఉంటాయని మరార్ వెల్లడించారు.

పిఎన్‌బిలో దొంగలు పడ్డారు



రూ. 11,346 కోట్ల అక్రమ లావాదేవీలు.. అక్రమార్కులతో కుమ్మక్కయిన సిబ్బంది

- 10 మంది బ్యాంకు ఉద్యోగులపై వేటు
- రూ.3,844 కోట్లు నష్టపోయిన ఇన్వెస్టర్లు
- జువెలరీ డిజైనర్ నీరవ్ మోదీపై ఇడి కేసు
- 'గీతాంజలి'తో సహా 3 సంస్థలపై దర్యాప్తు!

న్యూఢిల్లీ : దేశ బ్యాంకింగ్ రంగంలో మరో భారీ కుంభకోణం బయట పడింది. సరైన లెక్కా పత్రాలు లేకుండా అధికారులతో కుమ్మక్కయి ప్రముఖ జువెలరీ డిజైనర్ నీరవ్ మోదీ, అతడి అనుచరులు ముంబైలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)కు చెందిన ఓ బ్రాంచ్ ద్వారా రూ.11,346 కోట్ల అక్రమ లావాదేవీలు జరిపినట్టు బయట పడింది. విదేశాల్లోని సరఫరాదారులకు చెల్లించేందుకు బ్యాంకుల్లో పైసా కూడా నగదు డిపాజిట్ చేయకుండా వీరు అక్రమంగా లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్‌ఒయు) పొంది రూ.11,346 కోట్ల అక్రమ లావాదేవీలు జరిపినట్టు పిఎన్‌బి గుర్తించింది. బ్యాంకు సిబ్బందితో కలిసి 2011 నుంచి జరుగుతున్న ఈ అక్రమ లావాదేవీల వ్యవహారం ఇటీవలే బయట పడింది. దీంతో మంగళవారం రాత్రే ఈ విషయాన్ని సిబిఐకి ఫిర్యాదు చేసినట్టు పిఎన్‌బి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది. ఈ కుంభకోణానికి బాధ్యులను చేస్తూ బ్యాంక్ శాఖ డిప్యూటీ మేనేజర్‌తో సహా 10 మంది ఉద్యోగులపై పిఎన్‌బి వేటు వేసింది. మోదీ మోసాలపై సిబిఐకి పిఎన్‌బి ఫిర్యాదు చేయడం గత 10 రోజుల్లో ఇది రెండో సారి. ఈ లావాదేవీలన్నీ మోదీ ద్వారా జరిగాయా? లేక మరొకరి ద్వారా జరిగాయా? అనే విషయాన్ని పిఎన్‌బి తన ఫిర్యాదులో పేర్కొలేదు. సిబిఐ అధికారులు మాత్రం ఈ అక్రమ లావాదేవీలతో మోదీకి, మరో జువెలరీ సంస్థకు ప్రమేయం ఉందని చెప్పాయి.

భారీ నష్టం

తాజాగా బయట పడిన కుంభకోణం పిఎన్‌బిని కుదిపేస్తోంది. ఈ అక్రమ లావాదేవీల విలువ బ్యాంకు షేర్ల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ (రూ.36,000 కోట్లు)లో మూడో వంతుకు సమానం. డిసెంబరు 2017నాటికి బ్యాంకు రుణాలుగా ఇచ్చిన రూ.4.5 లక్షల కోట్లలో ఇది 2.55 శాతం. 2016-17 ఆర్థిక సంవత్సరంలో పిఎన్‌బి ఆర్జించిన రూ.1,324 కోట్ల నికర లాభానికి ఎనిమిది రెట్లు ఎక్కువ. ఇప్పటికే మొండి బకాయిలతో సతమతమవుతున్న పిఎన్‌బి ఈ భారీ కుంభకోణంతో మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

రూ.3,844 కోట్లు నష్టపోయిన ఇన్వెస్టర్లు

ఈ భారీ కుంభకోణం బయటికి పొక్కడంతో స్టాక్ మార్కెట్‌లో పిఎన్‌బి షేర్లు కుప్పకూలాయి. బిఎస్ఇలో ఈ షేరు 9.81 శాతం నష్టపోయి రూ.145.80 వద్ద ముగిసింది. దీంతో ఒక్కరోజులోనే ఈ బ్యాంక్ షేర్లలో మదుపు చేసిన ఇన్వెస్టర్ల సంపద విలువ రూ.3,844 కోట్లు హరించుకుపోయింది.

ఎలా జరిగింది?

ఈ సంవత్సరం జనవరి 16న డైమండ్ ఆర్ యుస్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్స్ అనే మూడు డైమండ్ కంపెనీలు బయ్యర్స్ క్రెడిట్ కావాలని ముంబైలోని ఒక పిఎన్‌బి బ్రాంచ్ అధికారులను కోరాయి. విదేశీ సరఫరాదారులకు చెల్లించేందుకు అవసరమైన ఈ రుణం కోసం లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్‌ఒయు) కావాలని ఈ మూడు సంస్థలు విజ్ఞప్తి చేయడంతో 100 క్యాష్ మార్జిన్లు (పూర్తి నగదు) సమర్పించాలని స్థానిక పిఎన్‌బి శాఖ కోరింది. అప్పుడు ఈ మూడు సంస్థలు 'అబ్బే అదేం లేదు. గతంలోనూ మేము క్యాష్ మార్జిన్లేవీ లేకుండానే ఎల్‌ఒయులు తీసుకున్నాం' అని వాదించాయి. రికార్డులను పరిశీలించిన అధికారులకు అలాంటిదేమీ లేదని అర్థమైంది. మరింత లోతుగా పరిశీలించే సరికి ఈ కుంభకోణం బయట పడింది.

ఇతర బ్యాంకులపైనా ప్రభావం !

పిఎన్‌బి అధికారులతో కుమ్మక్కయి తీసుకున్న ఎల్‌ఒయుల ఆధారంగా ఈ డైమండ్ వ్యాపార సంస్థలు విదేశాల్లోని ఇతర బ్యాంకుల నుంచీ పెద్ద మొత్తంలో అడ్వాన్స్‌లు తీసుకునేవి. దీంతో అన్ని బ్యాంకులు దీనిపై ఈ వారాంతంలోగా స్టేటస్ నివేదిక సమర్పించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక సేవల విభాగం బ్యాంకులను కోరింది. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని ఆ శాఖ జాయింట్ సెక్రటరీ లోక్ రాజన్ ప్రకటించారు.



నీరవ్ మోదీపై ఇడి కేసు

- జువెలరీ సంస్థలపై దర్యాప్తు
- అప్రమత్తమైన సెబి

నీరవ్ మోదీ నిర్వాకంతో దర్యాప్తు సంస్థలు గీతాంజలి, జిన్ని, నక్షత్ర వంటి పెద్ద జువెలరీ సంస్థల ఆర్థిక లావాదేవీలపైనా దృష్టి పెట్టాయి. పిఎన్‌బిని రూ.280 కోట్ల మేరకు మోసగించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఇప్పటికే నీరవ్ మోదీ, ఆయన భార్య అమి, సోదరుడు నిశాల్, మెహుల్ చినుభాయ్ చోక్సీలపై అక్రమ నగదు లావాదేవీల నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద కేసులు నమోదు చేసింది. వీరందరూ డైమండ్ ఆర్‌యుఎస్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్స్ అనే కంపెనీల పేరుతో తమ నుంచి అక్రమంగా లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్‌ఒయు) తీసుకున్నట్టు పిఎన్‌బి ఇప్పటికే ఫిర్యాదు చేసింది. సిబిఐ ఎఫ్ఐఆర్, పిఎన్‌బి ఫిర్యాదు ఆధారంగా ఇడి ఈ చర్యలు తీసుకుంది. మోసపూరితంగా సంపాదించిన ఈ నిధుల ద్వారా వీరు అక్రమంగా ఏమైనా ఆస్తులు, నల్ల ధనం పోగు చేశారా? అనే విషయంపైనా ఇడి దర్యాప్తు చేయబోతోంది.

సెబి దర్యాప్తు!

లిస్టెడ్ బ్యాంకులు, జువెలరీ సంస్థలు ఈ కుంభకోణానికి సంబంధించి వెల్లడించాల్సిన విషయాల విషయంలో ఏమైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించాయా? అనే విషయంపై సెబి కూడా దర్యాప్తునకు ఆదేశించే అవకాశం ఉందని సమాచారం. ఈ కంపెనీల షేర్ల లావాదేవీల వివరాలనూ సెబి, స్టాక్ ఎక్స్ఛేంజీలు పరిశీలించే అవకాశం ఉంది. ఇందులో ఇప్పటికే కొన్ని కంపెనీల ఉన్నతాధికారులు ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

నిధుల వినియోగంపైనా....

ఈ సంస్థలు వ్యాపారం కోసమని బ్యాంకుల నుంచి తీసుకునే నిధులను చివరికి ఎలా ఉపయోగిస్తున్నాయనే దానిపై సిబిఐతో పాటు ఇడి వివరాలు సేకరిస్తున్నట్టు పేరు వెల్లడించేందుకు ఇష్టపడని ఒక ప్రభుత్వ రంగ బ్యాంక్ ఉన్నతాధికారి చెప్పారు. అయితే దీనిపై ఈ జువెలరీ సంస్థలేవీ నోరు మెదపడం లేదు. మరో వైపు నిజాయితీగా వ్యాపారం చేసే వారిని వేధించకుండా, అక్రమార్కులు ఎంతటి పెద్దవారైనా వదలొద్దని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అన్ని బ్యాంకులను ఆదేశించింది. పిఎన్‌బి కుంభకోణం నేపథ్యంలో ఇలాంటి కుంభకోణాలు మళ్లీ తలెత్తకుండా నివారించేందుకు తీసుకోవలసిన చర్యలపై బ్యాంకులు దృష్టి పెట్టాయి.

హోండా ఎక్స్-బ్లేడ్ బుకింగ్స్ ప్రారంభం

న్యూఢిల్లీ: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తన 160సిసి బైక్ ఎక్స్-బ్లేడ్ బుకింగ్స్‌ను ప్రారంభించింది. మార్చి మధ్య నుంచి ఈ బైక్‌ల డెలివరీని కంపెనీ మొదలుపెట్టనుంది. ఈ బైక్ కొత్త సెగ్మెంట్లో ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుందని, ఇందులోని ఫీచర్ల మూలంగా యువత నుంచి మంచి ఆదరణ పొందే అవకాశం ఉందని హెచ్ఎంఎస్ఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్, మార్కెటింగ్) యద్విందర్ సింగ్ గులేరియా తెలిపారు. ఈ బైక్ ధర సుమారు 79,000 రూపాయలు.

త్వరలో ఇ-ట్రియో ఎలక్ట్రిక్ కార్లు

- హైదరాబాద్‌లో అసెంబ్లింగ్ యూనిట్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న స్టార్టప్ కంపెనీ ఇ-ట్రియో.. వచ్చే కొన్ని నెలల్లోనే రెండు ఎలక్ట్రిక్ కార్లను మార్కెట్లోకి తెచ్చే సన్నాహాల్లో ఉంది. ఈ రెండు కార్ల (హ్యాచ్‌బ్యాక్, సెడాన్) ప్రొటోటైప్‌లను కంపెనీ ప్రస్తుతం పరీక్షిస్తోంది. హైదరాబాద్ శివారులోని బొల్లారంలో ఎలక్ట్రిక్ కార్ల అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశామని, నెలకు 1,500 కార్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం దీనికి ఉందని కంపెనీ వ్యవస్థాపకుడు సత్య యలమంచిలి తెలిపారు. ఇవి 150 పేరుతో హ్యాచ్‌బ్యాక్, ఇవి 180 పేరుతో సెడాన్ కార్లను తెస్తామని, ఒక్కసారి చార్జింగ్ చేస్తే ఇవి 150 కారు 150 కిలో మీటర్లు, ఇవి 180 కారు 180 కిలో మీటర్లు ప్రయాణించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. భారత్, అమెరికాలోని ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్లతో టైఅప్ కుదుర్చుకున్నామని తెలిపారు. చైనా, తైవాన్‌లోని పవర్ ట్రెయిన్ సప్లయర్లతోనూ ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. వచ్చే కొన్ని నెలల్లో 300 కార్లను విడుదల చేసే యోచనలో ఉన్నామని తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ సర్వీసులు అందించే వారిని దృష్టిలో ఉంచుకుని వాహనాలను తెస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్లకు వినియోగిస్తున్న బ్యాటరీలు 30 నిమిషాల వ్యవధిలోనే 80 శాతం చార్జింగ్ అవుతాయన్నారు. ఇప్పటికే తాము 13 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టామని, విస్తరణ కోసం నిధులు సమీకరించే యోచనలో ఉన్నామని పేర్కొన్నారు.

ఈ ఏడాది మరిన్ని కొత్త బైక్స్

- బిఎండబ్ల్యు మోటరాడ్

న్యూఢిల్లీ : జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బిఎండబ్ల్యు గ్రూప్‌నకు చెందిన బిఎండబ్ల్యు మోటరాడ్.. భారత ప్రీమియం మోటార్‌సైకిళ్ల మార్కెట్‌పై భారీ అంచనాలతో ఉంది. భవిష్యత్‌లో ఇక్కడి మార్కెట్ మరింత జోరుగా పెరిగే అవకాశం ఉందని కంపెనీ చెబుతోంది. గత ఏడాది నుంచి ఈ కంపెనీ తన బైక్‌లను భారత మార్కెట్లో విక్రయిస్తోంది. తొమ్మిది నెలల కాలంలోనే 252 బైక్‌లను విక్రయించింది. ఈ బైక్‌ల ధర 15.6 లక్షల రూపాయల నుంచి 29.9 లక్షల రూపాయల (ఎక్స్‌షోరూమ్) వరకు ఉంది. ఆటో ఎక్స్‌పోలో భాగంగా బిఎండబ్ల్యు ఎఫ్ 750 జిఎస్ (ధర రూ.12.2 లక్షలు), బిఎండబ్ల్యు ఎఫ్ 850 జిఎస్ (రూ.13.7 లక్షలు) బైక్‌లను విడుదల చేసింది.

ఈ ఏడాది ద్వితీయార్థంలో జి310 శ్రేణి కింద ఎంట్రీ లెవల్ మోడళ్లను విడుదల చేయాలని కంపెనీ భావిస్తోంది. ఈ బైక్‌లను దేశీయంగానే ఉత్పత్తి చేయాలనుకుంటోంది.

మా బైక్‌లపై అంత సుంకమా?

- మీ దేశ బైక్‌లపైనా వేలకు వేలు వసూలు చేస్తాం..
- భారత ప్రభుత్వానికి ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్: ఖరీదైన హార్లే డేవిడ్సన్ బైక్‌లపై భారత ప్రభుత్వం అత్యధిక దిగుమతి సుంకం వసూలు చేస్తోందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తామూ భారత్ నుంచి అమెరికాకు దిగుమతి చేసుకునే మోటారుసైకిళ్లపై సుంకాన్ని వేలకు వేలు వసూలు చేస్తామని హెచ్చరించారు. బుధవారం ఉక్కు పరిశ్రమపై కాంగ్రెస్ సభ్యులతో చర్చ సందర్భంగా ట్రంప్ భారత ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. 'దిగుమతి సుంకాన్ని 75 శాతం నుంచి 50 శాతానికి తగ్గిస్తూ భారత ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. అయితే ఇది సరిపోదు. అమెరికాకు దిగుమతి చేసుకునే మోటారుసైకిళ్లపై మనం అసలు సుంకమే విధించడం లేదు. పూర్తిగా జీరో టాక్స్. దీనితో వారి సుంకానికి ఏమైనా పోలిక ఉందా?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ తనతో జరిపిన సంభాషణను ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. 'ఆ గ్రేట్ జెంటిల్‌మేన్ భారత్ నుంచి నాకు ఫోన్ చేశారు. మోటారుసైకిళ్లపై సుంకాన్ని 75 శాతం నుంచి 50 శాతానికి తగ్గించామని చెప్పారు. నీవు హార్లే డేవిడ్సన్ అయితే నీ ఉత్పత్తి వారి దేశంలోకి చేరడానికి 50 నుంచి 75 శాతం వరకు సుంకం చెల్లించాలి. అదే వాళ్లు మాత్రం భారత్ నుంచి అమెరికాలోకి వేలకొలదీ మోటారుసైకిళ్లను దింపుతున్నారు. ఈ విషయం చాలామందికి తెలియదు. వాటిపై మనం విధించే పన్ను ఎంతో తెలుసా? అసలు పన్నే లేదు' అని చట్టసభ సభ్యులు, తన కేబినెట్‌లోని సహచరులతో ట్రంప్ వ్యాఖ్యానించారు. దేశాల మధ్య పన్నుల విధానం పరస్పర సానుకూలంగా ఉండాలని ట్రంప్ అన్నారు. 'అమెరికాతో వారి వాణిజ్య సంబంధాలు ఆక్షేపణీయంగా ఉన్నాయి' అని ఆరోపించారు.

జిఎంఆర్ నష్టం రూ.566 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మౌలిక రంగ సంస్థ జిఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భారీ నష్టాలను ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన మూడు నెలల(క్యూ3)కు సంస్థ నష్టం రూ.565.94 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదేకాలానికి కంపెనీ రూ.643.44 కోట్ల లాభాన్ని ఆర్జించగలిగింది. వార్షిక ప్రాతిపదికన ఆదాయం రూ.2,587.26 కోట్ల నుంచి రూ.2,295.83 కోట్లకు తగ్గింది. ఖర్చులు కూడా రూ.2,623.74 కోట్ల నుంచి రూ.2,487.90 కోట్లకు తగ్గాయి.

జిఎంఆర్ గ్రూపు.. విమానాశ్రయాలు, విద్యుత్, రవాణా, పట్టణ మౌలిక వసతుల విభాగాల్లో వ్యాపారాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్, ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయాలను ఈ గ్రూప్ నిర్వహిస్తోంది. గోవాలోని మోపాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అభివృద్ధి కాంట్రాక్టును కూడా చేజిక్కించుకుంది. అంతేకాదు, మెగావైడ్ సంస్థ భాగస్వామ్యంలో ఫిలిప్పీన్స్‌లోని మాక్టాన్ సెబూ అంతర్జాతీయ విమానాశ్రయం, జిఇకే టెర్నా భాగస్వామ్యంలో గ్రీస్‌లోని హెరాక్లియాన్ ఎయిర్‌పోర్టు కాంట్రాక్టులను సైతం దక్కించుకుంది. హైదరాబాద్, ఢిల్లీ ఎయిర్‌పోర్టుల పక్కన స్మార్ట్ సిటీలను సైతం అభివృద్ధి చేస్తోంది.

ఎన్‌సిసి లాభంలో 72 శాతం వృద్ధి

హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ రంగ సంస్థ ఎన్‌సిసి లిమిటెడ్ మూడో త్రైమాసిక(క్యూ3) లాభం 72 శాతం వృద్ధి చెంది రూ.100.36 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి సంస్థ లాభం రూ.58.72 కోట్లుగా నమోదైంది. మార్జిన్‌లు పుంజుకోవడం లాభాలు పెరుగుదలకు దోహదపడింది. క్యూ3లో కంపెనీ ఆదాయం రూ.1,879 కోట్లకు చేరుకుంది. ఏడాది క్రితం ఇదేకాలానికి నమోదైన రూ.1,943 కోట్లతో పోలిస్తే మాత్రం 3.5 శాతం తగ్గింది. వార్షిక ప్రాతిపదికన సంస్థ ఇపిఎస్ (షేర్ ఒక్కింటికి ఆర్జన) రూ.1.05 నుంచి రూ.1.81కు పెరిగింది.

నిర్మాణ రంగ వ్యాపారాన్ని మరింత విస్తరించాలని అనుకుంటున్నట్లు ఎన్‌సిసి మేనేజింగ్ డైరెక్టర్ ఎ రంగరాజు తెలిపారు. ఇందుకోసం సంస్థ క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపి) ద్వారా గత నెలలో రూ.550 కోట్లు సేకరించింది.

ఈ ఆర్థిక సంవత్సరంలో గడిచిన మూడు త్రైమాసికాలకు (ఏప్రిల్-డిసెంబరు) గాను కంపెనీ రూ.5,256 కోట్ల టర్నోవర్‌పై రూ.184.09 లాభం ఆర్జించింది. ఆ తొమ్మిది నెలల్లో రూ.21,614 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కించుకోగలిగింది. దాంతో ఆర్డర్ బుక్ రూ.31,627 కోట్లకు చేరుకుంది.

జివికె పవర్ లాభం రూ.10 కోట్లు

మౌలిక రంగ సంస్థ జివికె పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ లాభాల్లోకి మళ్లింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికాని (క్యూ3)కి కంపెనీ లాభం రూ.10.94 కోట్ల లాభం ప్రకటించింది. రెండో త్రైమాసికం (క్యూ2)లో రూ.76.94 కోట్ల నష్టాన్ని చవిచూసింది. గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలోనూ రూ.71 లక్షల నష్టాన్ని నమోదు చేసుకుంది. క్యూ3లో కంపెనీ మొత్తం ఆదాయం వార్షిక ప్రాతిపదికన రూ.18.42 కోట్ల నుంచి రూ.21..34 కోట్లకు పెరిగింది. క్యూ2 రెవెన్యూ రూ.20.16 కోట్లుగా ఉంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో గడిచిన మూడు త్రైమాసికాలకు (ఏప్రిల్-డిసెంబరు 2017)గాను జివికె పవర్ రూ.59.22 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి రూ.65.16 కోట్లు నష్టపోయింది.

అపోలో హాస్పిటల్స్ లాభం రూ.67 కోట్లు

అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఆర్థిక ఫలితాలు నిరాశాజనకంగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికాని(క్యూ3)కి కంపెనీ లాభం 7.4 శాతం తగ్గి రూ.67.44 కోట్లకు పరిమితమైంది. ఖర్చులు పెరగడం ఇందుకు కారణమైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి సంస్థ లాభం రూ.72.83 కోట్లుగా ఉంది. క్యూ3 ఆదాయం ఏడాది ప్రాతిపదికన రూ.1,680.61 కోట్ల నుంచి రూ.1,896.14 కోట్లకు పెరిగింది. ఖర్చులు రూ.1,599.62 కోట్ల నుంచి రూ.1,806.16 కోట్లకు ఎగబాకడంతో లాభం తగ్గుముఖం పట్టింది. వైద్య సేవల ద్వారా ఆదాయం రూ.891.89 కోట్ల నుంచి రూ.1,008.21 కోట్లకు.. ఫార్మసీ వ్యాపార రాబడి రూ.788.84 కోట్ల నుంచి రూ.888.09 కోట్లకు చేరుకుంది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
34155.95	10500.90	30360	38185	64.09	62.52
↓ 144.52	↓ 38.85	↑ 135	↑ 260		

మేలిమి - 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

క్రిప్టోలపై త్వరలో ఐసిఎఐ పత్రం

న్యూఢిల్లీ: బిట్‌కాయిన్ వంటి క్రిప్టో కరెన్సీలపై త్వరలోనే కన్సల్ట్ పేపర్‌ను విడుదల చేయనున్నట్టు ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) తెలిపింది. క్రిప్టో ఆస్తుల క్రయ, విక్రయాలకు సంబంధించి పలు అంశాలను పరిశీలిస్తున్నట్టు, త్వరలోనే పత్రం విడుదల చేస్తామని ఐసిఎఐ ప్రెసిడెంట్ ఎన్‌డి గుప్తా తెలిపారు. బిట్‌కాయిన్‌లో పెట్టుబడులపై ఈమధ్య కాలంలో ఆందోళనలు పెరిగాయి. గత ఏడాది వందల రెట్లు పెరిగిన బిట్‌కాయిన్ విలువ.. ఈ సంవత్సరంలో భారీగా పతనమైంది. ఫైనా ట్రేడింగ్ విలువ తీవ్ర ఊగిసలాటలకు లోనవుతోంది. క్రిప్టో కరెన్సీల నియంత్రణకు ఇప్పటివరకు భారత్‌లో అధికారిక వ్యవస్థ అంటూ ఏమీ లేదు. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ ఒకటి వీటిపై అధ్యయనం జరుపుతోంది. అలాగే, ఐసిఎఐ కూడా వీటిని విశ్లేషిస్తోంది. అంతేకాదు, బిట్‌కాయిన్, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ఆధారిత లావాదేవీల కోసం అకౌంటింగ్, ఆడిటింగ్ ప్రమాణాలను అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తోంది.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	---	31,200	31,230	30,900	30,330
క్రితం ముగింపు	31,200	---	31,180	30,050	30,360
22 క్యారెట్లు	---	29,000	28,730	28,610	28,890
క్రితం ముగింపు	28,890	---	28,680	28,800	28,910
వెండి (కిలో)	---	39,500	39,300	39,700	41,300
క్రితం ముగింపు	39,500	---	39,200	39,500	41,500

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెంకాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	70.00	విజయవాడ	75.00
కరీంనగర్	71.00	గుంటూరు	75.00
వరంగల్	72.00	ఒంగోలు	77.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	58.00
కర్నూలు	70.00	నెల్లూరు	65.00
విశాఖపట్నం	71.00	అనంతపురం	68.00
గోదావరి	74.00		



రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.45		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	386.00	చిత్తూరు	393.00
వరంగల్	388.00	చెన్నై	400.00
విజయవాడ	392.00	నమక్కల్	380.00
గోదావరి	392.00	బెంగళూరు	395.00
విశాఖపట్నం	400.00	ముంబై	430.00



ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.34	67.65
పౌండ్	81.17	94.15
యూరో	72.26	83.80
ఆస్ట్రేలియా డాలర్	46.01	54.07
బహ్రెయిన్ దినార్	157.99	181.06
కువైట్ దినార్	176.65	219.91
ఒమని రియాల్	154.72	177.01
సౌదీ రియాల్	15.51	18.39
సింగపూర్ డాలర్	44.23	52.40
యుఎఇ దిరమ్	15.88	18.56

షామీ 'స్మార్ట్ టీవీ' వచ్చేసింది..

న్యూఢిల్లీ : చైనాకు చెందిన టెక్నాలజీ దిగ్గజం షామీ.. భారత మార్కెట్లోకి ఎంఐ ఎల్ఇడి టీవీ 4 పేరుతో స్మార్ట్ టీవీని విడుదల చేసింది. దీని ధర 39,999 రూపాయలు. 55 అంగుళాల స్ర్కీన్ కలిగిన ఈ టీవీ 4.9 ఎంఎం మందంతో ఉంది. హంగామా, వూట్, ఆల్ట్ బాలాజీ, జీ5, సోనీ లివ్ వంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు కంపెనీ పేర్కొంది. ఫిబ్రవరి 22 నుంచి ఫ్లిప్‌కార్ట్, ఎంఐ హోమ్స్ (ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్స్), ఎంఐ.కామ్ ద్వారా ఈ టీవీలను విక్రయించనున్నట్టు కంపెనీ తెలిపింది. చైనా తర్వాత భారత్‌లోనే ఈ టీవీలను విడుదల చేసినట్టు కంపెనీ పేర్కొంది. ప్రస్తుతం ఈ కంపెనీ మన దేశంలో స్మార్ట్‌ఫోన్లతోపాటు ఎయిర్ ప్యూరిఫయర్లు, మొబైల్ యాక్సెసరీలైన పవర్ బ్యాంక్స్‌ను విక్రయిస్తోంది. "భారత మాకు ఎంతో కీలకమైన మార్కెట్. చాలా కొద్దికాలంలోనే స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో చెప్పుకోదగిన స్థాయి వాటాను సొంతం చేసుకోలిగాం. షామీకి స్మార్ట్‌ఫోన్ల తర్వాత టీవీ చాలా పెద్ద కేటగిరీ. చైనాలో చాలా వేగవంతంగా వృద్ధి చెందుతున్న టీవీ బ్రాండ్‌గా షామీ నిలిచింది" అని షామీ ఇండియా ఎండీ మనూ జైన్ తెలిపారు. భారత కస్టమర్ల అభిరుచులకు తగిన విధంగా టీవీల్లో మార్పులు చేసినట్టు ఆయన చెప్పారు. ప్రస్తుతం టీవీలను దిగుమతి చేసుకుంటున్నామని, అమ్మకాలు పెరిగితే దేశీయంగానే తయారీ చేపడతామని ఆయన చెప్పారు. దేశీయంగా పది శాతం టీవీలు ఆన్‌లైన్ ద్వారా అమ్ముడవుతున్నాయని, ఈ మార్కెట్లో స్మార్ట్ ఫోన్ల మాదిరిగా వృద్ధి నెలకొంటుందని ఆయన తెలిపారు.



ధర రూ.39,999



స్మార్ట్‌ఫోన్లను విడుదల చేస్తున్న మను జైన్ (ఎడమ నుంచి మూడో వ్యక్తి)

రెండు కొత్త ఫోన్లు

రెడ్‌మీ నోట్ 5, నోట్ 5 ప్రో స్మార్ట్‌ఫోన్లను కూడా షామీ మార్కెట్లోకి తెచ్చింది. వీటి ప్రారంభ ధర 9,999 రూపాయలు. స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్ కలిగిన ఈ ఫోన్లలో అద్భుతమైన ఫీచర్లు, కెమెరాలు ఉన్నట్టు కంపెనీ తెలిపింది.



మార్చి 2019నాటికి రుణాలకు రాం..రాం!

» రూ.5,513 కోట్లకు తగ్గిన డిఎల్ఎఫ్ అప్పులు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద రియల్టీ సంస్థ డిఎల్ఎఫ్.. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి (మార్చి 2019)నాటికి అప్పుల ఊబిలోనుంచి పూర్తిగా బయటపడాలనుకుంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక (అక్టోబరు-డిసెంబరు 2017) డిఎల్ఎఫ్‌లోకి ప్రమోటర్లు భారీగా నిధులు చొప్పించారు. వాటితో సంస్థ రూ.7,100 కోట్ల బకాయిలను చెల్లించింది. దాంతో సంస్థ రుణభారం గతేడాది చివరినాటికి రూ.5,513 కోట్లకు తగ్గింది. ఇది గృహ ప్రాజెక్టులకు సంబంధించిన రుణం. సింగపూర్ ప్రభుత్వ వెల్త్ ఫండ్ జిఐసితో కలిసి ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ డిఎల్ఎఫ్ సైబర్ సిటీ డెవలపర్స్ లిమిటెడ్ (డిసిసిడిఎల్) ద్వారా సంస్థ వాణిజ్య సముదాయాల నిర్మాణ వ్యాపారం నిర్వహిస్తోంది. డిసెంబరు 2017 ముగిసేనాటికి ఈ విభాగ రూ.16,074 కోట్ల అప్పుల భారం ఉంది.

గత జూన్ నాటికి డిఎల్ఎఫ్ చెల్లించాల్సిన రుణ బకాయిల మొత్తం రూ.26,800 కోట్లుగా నమోదైంది. ఆగస్టు 2017లో ప్రమోటర్లు డిసిసిడిఎల్‌లో 40 శాతం వాటాను రూ.11,900 కోట్లకు విక్రయించారు. అందులోంచి రూ.9000 కోట్లను డిఎల్ఎఫ్‌కిచ్చారు. వచ్చే 18 నెలల్లో మరో రూ.2,250 కోట్ల నిధులు అందించనున్నారు.

డిఎల్ఎఫ్ క్యూ3 విక్రయాల్లో 78 శాతం వృద్ధి

డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో డిఎల్ఎఫ్ గృహ విక్రయాల విలువ 78 శాతం వృద్ధి చెంది రూ.480 కోట్లకు పెరిగింది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సిద్ధంగా ఉన్న ఫ్లాట్లకు డిమాండ్ పెరగడం ఇందుకు దోహదపడిందని సంస్థ తెలిపింది. డిసెంబరు 2016తో ముగిసిన త్రైమాసికంలో సంస్థ సేల్స్ రూ.270 కోట్లుగా నమోదయ్యాయి.

జెవికి రూ.9,300 కోట్ల ఆస్తుల విక్రయం

సింగపూర్ సంస్థ జిఐసితో ఏర్పరుచుకున్న జాయింట్ వెంచర్ (జెవి)కు డిఎల్ఎఫ్.. రూ.9,900 కోట్ల విలువైన అద్దె ఆస్తులతోపాటు వాణిజ్య అవసరాలకు పనికొచ్చే భూములను విక్రయించనుంది. జెవి సంస్థ డిసిసిడిఎల్‌లో డిఎల్ఎఫ్‌కు 66.66 శాతం, జిఐసికి 33.34 శాతం వాటా ఉంది. గత ఏడాది డిసెంబర్‌లో జిఐసి.. డిసిసిడిఎల్‌లోని ఈ వాటాను రూ.9 వేల కోట్లకు కొనుగోలు చేసింది.

బ్యాంకింగ్ షేర్లలో భారీ అమ్మకాలు

144 పాయింట్లు కుంగిన సెన్సెక్స్

ముంబై : చివరి సెషన్‌లో సాగిన అమ్మకాల జోరు సెన్సెక్స్‌ను బుధవారం నష్టాల బాట పట్టించింది. దేశంలో రెండో పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు పిఎన్‌బిలో 11 వేల కోట్ల రూపాయల విలువ గల కుంభకోణం బయటపడడంతో బ్యాంకింగ్ షేర్లలో సాగిన భారీ అమ్మకాలతో పాటు లాభాల స్వీకారం లక్ష్యంగా సాగిన అమ్మకాలు కూడా సెన్సెక్స్‌ను చివరిలో నష్టాల్లోకి నెట్టాయి. బ్యాంకుల్లో మొండి బకాయిలను అదుపు చేయడానికి ఆర్‌బిఐ కొత్త నిబంధనలు ప్రకటించడం కూడా ఆ రంగానికి చెందిన కౌంటర్లలో భారీ అమ్మకాలకు కారణం అయింది. వాస్తవానికి డిసెంబరు నెలలో పారిశ్రామికోత్పత్తి పుంజుకుని జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గినట్టు సోమవారం మార్కెట్ వేళల అనంతరం వెలువడిన గణాంకాలు వెల్లడించడంతో ఉదయం ఇండెక్స్‌లు లాభాల్లోనే ప్రారంభమై రెండో సెషన్ వరకు పాజిటివ్‌గానే ఉన్నాయి. అయితే మొండి బకాయిల విషయంలో ఆర్‌బిఐ తాజా నిబంధనల నేపథ్యంలో ఉదయం నుంచి కొంత అప్రమత్తత కనిపించింది. ఉదయం సెన్సెక్స్ 34436.98 పాయింట్ల వద్ద పాజిటివ్‌గానే ప్రారంభమై 34473.43 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. కాని తదుపరి సాగిన అమ్మకాలతో 144.52 పాయింట్ల నష్టంతో 34155.95 పాయింట్ల వద్ద క్లోజయింది. నిఫ్టీ ఇంట్రాడేలో 150 పాయింట్ల మేరకు ఆటుపోట్లు సాధించి చివరికి 38.85 పాయింట్ల నష్టంతో 10500.90 వద్ద ముగిసింది. ఆర్‌బిఐ కొత్త నిబంధనలు పిఎస్‌బిల లాభదాయకతను దెబ్బ తీస్తాయన్న భయాలు బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలను వెల్లువెత్తించాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగం హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

బ్యాంకింగ్ షేర్లు ఢమాల్

ఆర్‌బిఐ కొత్త నిబంధనలపై ఇన్వెస్టర్లలో నెలకొన్న భయాలతో యస్ బ్యాంక్ 4.40 శాతం, ఎస్‌బిఐ 4.06 శాతం, యాక్సిస్ బ్యాంక్ 3.35 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్ 2.29 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా 2.75 శాతం మేరకు నష్టపోయాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్ కూడా నష్టాల్లోనే ముగిసింది.

» నష్టపోయిన ఇతర షేర్లలో ఒఎన్‌జిసి, సన్ ఫార్మా, టిసిఎస్, పవర్‌గ్రిడ్, ఎన్‌టిపిసి, ఐటిసి, బజాజ్ ఆటో, మారుతి సుజుకీ, డాక్టర్ రెడ్డీస్, టాటా స్టీల్, హీరోమోటోకార్ప్, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్ ఉన్నాయి. ఆటో విడిభాగాల తయారీలోని మిండా కార్పొరేషన్ క్యూ3కి ప్రోత్సాహకమైన ఫలితాలు ప్రకటించినా నాలుగు శాతం పైగా నష్టపోయింది.

» ఇంత అమ్మకాల జోరును కూడా తట్టుకుని లాభాల్లో ముగిసిన షేర్లలో కోల్ ఇండియా, ఆర్‌ఐఎల్, విప్రో, భారతి ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, ఎల్ అండ్ టి, హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌యుఎల్, ఇండస్ ఇండ్ బ్యాంక్ ఉన్నాయి.

» ఎక్స్ఛేంజీల వద్ద ఉన్న గణాంకాల ప్రకారం సోమవారం ఎఫ్‌పిఐలు 814.11 కోట్ల రూపాయల విలువ గల షేర్లను విక్రయించగా దేశీయ సంస్థలు 1342.72 కోట్ల రూపాయల విలువ గల షేర్లను కొనుగోలు చేశాయి.

ఆస్టర్ ఐపిఒకు 45 శాతం సబ్‌స్క్రిప్షన్

ఆరోగ్య సంరక్షణ రంగంలోని ఆస్టర్ హెల్త్‌కేర్ పబ్లిక్ ఇష్యూ రెండో రోజున 45 శాతం సబ్‌స్క్రిప్షన్ సాధించింది. 980 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంగా మార్కెట్‌లోకి వచ్చిన ఈ ఇష్యూ గురువారం నాడు ముగుస్తుంది. షేరు ధర 180-190 రూపాయలు.

ముగింపు బలహీనం

టెక్ వ్యూ

నిఫ్టీ పాజిటివ్‌గానే ప్రారంభమైనా ప్రధాన నిరోధం 10600 వద్ద కరెక్షన్‌లో పడి చివరికి మానసిక మద్దతు స్థాయి 10500 సమీపంలో అనిశ్చిత ధోరణిలో ముగిసింది. గత కొద్ది రోజులుగా ఈ స్థాయిలోనే అటూఇటూగా కదలాడుతూ సైడ్‌వేస్ ధోరణి ప్రదర్శిస్తోంది. ఇది స్వల్పకాలిక కన్సాలిడేషన్ సంకేతం. 50 రోజుల డిఎంఎ కన్నా స్వల్పంగా దిగువకు చేరడం కూడా స్వల్పకాలిక బలహీనతను సూచిస్తోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఈ సూచి కన్నా పైకి బౌన్స్ కావడం తప్పనిసరి.

గురువారం స్థాయిలివే...

నిరోధం : 10600 **మద్దతు :** 10450

- ప్రధాన నిరోధం 10600. కొద్ది రోజులుగా ఇక్కడే విఫలమవుతోంది. అంతకన్నా పైన బలంగా క్లోజయినప్పుడే సానుకూల సంకేతం వెలువడుతుంది.
- మైనర్ మద్దతు స్థాయి 10450కన్నా దిగజారితే మరింత బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10300.
- బ్యాంక్ నిఫ్టీ బలహీనంగా ముగిసింది. ప్రధాన మద్దతు సాయి 25200కి చేరువవుతోంది.

■ వి.సుందర్ రాజా

ముగింపు సెషన్ మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ బహుళ అమావాస్య **నక్షత్రం :** ధనిష్ట

పుష్యమి, అనూరాధ, ఉత్తరాభాద్ర నక్షత్ర జాతకులు, కుంభ, మీన, రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10500.90 (+38.85)

ట్రెండ్ మార్పు వేళలు : మధ్యాహ్నం 2.04 గంటలు

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై ఉదయం 10.25 నుంచి మధ్యాహ్నం 2.10 గంటల వరకు నిస్తేజంగా ఉండి తదుపరి ముగింపు వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 2 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10540, 10575

మద్దతు స్థాయిలు : 10450, 10415

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

ACI INFOCOM 5(5.26)50000
ADITYA SPIN. 8.4(8.4)800
AGRO TECH FO 652.5(669.55)2404
AISHWARYA TE 7.49(7.15)10090
ALPHAGEO (I) 841.75(843.3)1533
ALU FLUORIDE 117.35(116.95)7806
AMAR RAJA BA 839.35(844.95)24858
ANDHRA BANK 46.9(48.75)312128
ANDHRA CEMEN 11.76(11.88)30238
ANDHRA PETRO 60.85(62.45)270210
ANJANI PORTL 204.1(216.55)4414
ASTRA MICRO 107.4(107.3)97366
AUROB.PHARMA 601.85(607.85)148514
AVANTEL LTD 595.85(607.9)6226
AVANTI FEEDS 2411.6(2506.25)14178
B.N.RATHI SE 43.25(44.25)7342
BALAJI AMINE 672.2(673)12061
BAMBINO AGRO 275.35(268.8)6892
BARTRONICSIN 13.81(13.77)9677
BHAGIRA.CHEM 317.2(316.2)4218
BHAGYA INL 50.55(48)124296
BHARATFIN 1021.15(1014.8)25967
BNR UDYOG 33.85(32.55)1478
CAMBRIDGE 81.55(83.2)3500
CCHHL 15.4(15.75)36914
CCL PRODUCTS 291.7(293.3)3531
CELESTIAL 17.7(17.8)12015
CIL SECURITS 33(32.4)1336
COROM INTER 533.25(530.35)5706
CUBEX TUBING 23.7(24.3)2916
CYBERMATE 3.53(3.84)118323
CYIENT 623.7(626.15)3416
DANLAW TECH. 77.2(76.95)6934
DECAN CEMENT 587.2(580.95)446
DHAN ROTO SP 42(40)3261
DIAMONPOWER 16.6(16.75)59203
DIVI'S LAB. 1050.3(1035.5)34236
DIVYA.GRANIT 107.5(108)202
DQ ENT 16.3(16.2)1610
DR.REDDY'S 2183.1(2200.05)27777
EMPEE SUGARS 4.83(4.67)12742
EVEREST ORG. 145.65(147.9)1573
FACOR ALLOYS 3.65(3.84)327833
FIRSTOBJ 16.65(16.75)4470
GATI LTD. 115.45(118.65)180149
GAYATRI BIO 10.39(9.63)1711
GAYATRI PROJ 223.85(210.25)148518
GENNEX LAB 4.9(5.06)226590
GMR INFRASTR 19.7(20.05)3138438
GODAVARI DRU 35.6(36.8)5320
GOLDST INFRA 213.8(214.65)61322
GOLDSTONE EN 16(16)10672
GRANULES (I) 122.25(122.3)177734
GVK POWERINF 19.6(20.6)3294429
HBL P SYS 61.25(60.05)117513
HERITGFOOD 702.05(713.65)611
HIND.FLUROCA 15(14.5)3270
I.C.S.A. IND 4(3.99)7000
IKF TECHNO .87(.91)132931
INCAP LTD. 98(102.5)1271
IPAPPM 345.25(353.3)10174
IVRCL LTD 4.98(4.95)143975
KAKATIYA CEM 306.9(311.6)9709
KALLAM SPG. 28.75(24.65)328295
KAVERI SEED 473.6(479.55)28072
KCP LTD 139.75(138.6)53395
KERNEX MICRO 45.85(43.7)5739
KNR CONST 321.25(326.85)98774
KREBS BIOCHM 154(146.7)2378
LANCO INFRA 1.36(1.3)2080229
LOKESH MACH 70.45(71.85)18413
LOTUS CHOC 50.5(50.05)2335
MADHUCON PRJ 29.3(31.1)69605
MOLD-TEK TEC 63.05(63.75)2650
MOSCHIP SEMI 36(36.05)64791
MSR INDIA 46.65(42.05)26423
N C L IND. 243.9(244.3)7089
NACLIND 48.2(48.15)38528
NATCO PHARM 782.75(818.3)84102
NCC 126.5(118.5)2227662
NEHA INTER. 8.04(8.15)10556
NETTLINX LTD 87.65(85.4)8271
NEULAND LAB. 708.3(700.5)1850
NILE LTD. 899.3(889.55)3305
NTL 4.14(4.31)8300
OIL COUNTRY 44.3(45.1)12988
PADMALAYA TE 5.05(4.99)7366
PALRED 93.55(95.45)3122
PANYAM CEMEN 51.35(54.65)95403
PENNAR STEEL 66.1(64.55)124323
PFL INFOTECH 10.15(10.05)2727
PHYTOCHEM I. 66.2(70)13426
PITTI LAMIN. 98.2(91.9)72949
POKARNA LTD 216.5(214.95)2735
PRAJAY ENGS. 14.85(14.95)14132
PREMIER EXPL 405.55(409.8)1839
PRISM CEMENT 137.95(136.3)459476
RAIN 383.55(392.5)453269
RAJ PACKAGIN 38(38.75)1672
REG.CERAMIC 5.71(5.53)1851
RESTILE CER. 8.42(7.9)5115
SAGAR CEM. 1012.1(988.75)3170
SAMKRG PIST. 318.45(318.15)3205
SAMPRE NUTRI 60.55(58.2)5396
SANGHI IND. 120.5(122.1)21987
SATVAH.ISPAT 24(24.75)10050
SAVEN TECHNO 21.8(20.75)2280
SMPL 1.45(1.43)30014
SMS PHARMACE 95.3(95.5)4733
SREE RAYALA 202.3(194.65)5217
STEEL EXCH 33.65(34.75)52213
SUJANA INDUS 1(.96)163439
SURANATP 5.45(5.41)34170
SURYACHAKRA 1.39(1.41)27591
SURYAMBA SP 73.5(75.6)60
SURYAVA SPIN 7.41(7.73)2751
SURYLAK.COTT 84.45(87.8)4505
SUVEN LIFE S 199.9(199.95)115639
TAJ GVK HOTL 178.2(176.7)39392
TANLA 32.95(33.2)39335
TCI INDUS. 891(906)6
TRANSCORP IN 37.95(38.85)5385
TRANSGENE BI 2.13(2.2)13719
TRANSPORT CO 293.35(293.7)10615
USHER AGRO 7.36(7.53)10558
VICEROY HOTE 17.05(17.1)41924
VIJAY TEXTIL 55.05(55.45)12398
VIMTA LABS 212.55(207.55)19412
VIRAT CRANE 48.3(46)6965
VIRINCHI 131.25(134.95)97887
VISAKA IND. 717.05(727.05)13127
VISTA PHARMA 44.2(46.1)102419
VIVIMED LABS 87.05(87.25)660966
VST INDUS. 3289.85(3250)1194
WATERBASE 321.95(332.2)386818
XLENERGY 3.07(3)8211
YBRANTDIGI 5.83(6.02)1326398
ZEN TECH 123.1(120.9)45183
ZENOTECH 44.4(44.55)26982

ఎన్ఎస్ఇ-500 NSE

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 656.35(624.75)37291
AARTIIND 1183.1(1132.65)70502
ABAN 180.95(190.15)1431901
ABB 1572.1(1610.65)43054
ABFRL 157.45(162.65)187289
ABGSHIP 11.1(11.65)32436
ACC 1629.7(1651.55)206639
ADANIENT 219.45(217.25)6915464
ADANIPORTS 413(403.35)3001847
ADANIPOWER 33.35(34)9307687
ADANITRANS 212(210.5)883313
AEGISCHEM 270.8(274.65)139597
AHLUCONT 345.4(340.05)6086
AIAENG 1468.2(1451.45)47441
AJANTPHARM 1421.25(1425.6)134703
AKZOINDIA 1803.1(1791.35)2937
ALBK 56.2(60.85)7338154
ALLCARGO 187(196.2)577209
ALOKTEXT 3.5(3.55)3403858
AMARAJABAT 839.1(848.55)638759
AMBUJACEM 254.15(256.9)1060437
AMTEKAUTO 24(24.55)503221
ANANTRAJ 61.8(62.65)1263816
ANDHRABANK 46.9(48.75)3471159
APARINDS 800.35(791.35)46122
APLLTD 561.3(558.6)18592
APOLLOHOSP 1191.8(1151.55)287229
APOLLOTYRE 274(274.9)3007377
ARVIND 396.3(406.85)1851895
ASHIANA 175.5(177.2)172006
ASHOKA 238.1(246.8)82275
ASHOKLEY 137.4(133.3)27373293
ASIANPAINT 1139.15(1144.4)691596
ASTRAL 782(784.7)37758
ASTRAZEN 1056.1(1048.9)5023
ATUL 2720.6(2760.45)6362
AUROPHARMA 602.1(607.3)1795631
AVANTIFEED 2413.1(2506.75)86343
AXISBANK 543.9(564.2)6478108
BAJAJ-AUTO 3109.75(3154.1)286070
BAJAJCORP 491.3(493.25)19027
BAJAJELEC 513.2(514)475744
BAJAJFINSV 5189(5235.45)154547
BAJAJHIND 13.65(14)2219229
BAJAJHLDNG 2743.4(2689.9)33172
BALKRISIND 1181.8(1146.35)567580
BALLARPUR 14.25(14.55)1307991
BALMLAWRIE 237.05(245.4)104916
BALRAMCHIN 121.25(121.85)1310345
BANKBARODA 165.8(168.65)28561359
BANKINDIA 133.55(144.85)15650006
BASF 2177.3(2226.05)7689
BATAINDIA 717.95(714.5)623843
BBTC 1430.95(1407.5)225479
BEML 1321(1347.85)665858
BERGEPAINT 247.6(249.45)709625
BFUTILITIE 489.45(495.2)724263
BGRENERGY 125.65(125.3)65298
BHARATFIN 1020.75(1015.05)312624
BHARATFORG 763.8(776.35)900835
BHARTIARTL 434.8(424.4)9434541
BHEL 97.85(97.5)7781773
BHUSANSTL 49.4(50.9)5082570
BIOCON 606.85(612.05)935952
BIRLACORPN 995.65(1002.75)20761
BLISSGVS 204.7(207.8)320848
BLUEDART 4541.55(4495.8)20004
BLUESTARCO 731.1(742.95)22988
BOMDYEING 261.25(251.3)13231036
BOSCHLTD 19515.1(19545.85)6351
BPCL 460.1(467.55)4451284
BRFL 73.75(70.25)31057
BRIGADE 296.75(295.9)18483
BRITANNIA 4764.15(4772.5)349962
CADILAHC 419.6(423.65)897280
CANBK 308.8(327.8)4816239
CAPF 700.7(698.05)735788
CARERATING 1400.65(1375)63300
CASTEXTECH 5.15(5.3)631340
CASTROLIND 197.8(198.2)1232984
CCL 290.9(293.6)34301
CEATLTD 1621.4(1612.3)677576
CENTRALBK 68.8(69.85)260871
CENTURYPLY 328.95(328.25)243885
CENTURYTEX 1275.2(1280.55)559095
CERA 3362.55(3403.35)12377
CESC 1026.15(1035.75)230362
CHAMBLFERT 157.05(155.2)314556
CHENNPETRO 381(378.85)442604
CHOLAFIN 1389.95(1365.05)686713
CIPLA 616.15(621.65)1306512
CLNINDIA 612.25(635.15)86780
COALINDIA 306.95(300.65)5725179
COLPAL 1096.35(1093.9)70696
CONCOR 1325.1(1325.3)532033
COROMANDEL 534.3(526.55)105858
CORPBANK 34.5(35.8)571286
COX&KINGS 252.05(257.4)79959
CRISIL 2004.95(1970.55)48530
CUB 165.2(166.8)635673
CUMMINSIND 840.45(845)135968
CYIENT 624(625.65)67448
DABUR 340.75(344.75)825559
DALMIABHA 2868.05(2884.75)159878
DBCORP 327.4(326.55)21840
DBREALTY 57.25(58.8)2232214
DCBBANK 172.75(172.8)1927008
DCMSHRIRAM 550.25(551.05)112977
DEEPAKFERT 362.5(367.15)78149
DELTACORP 364.45(363.9)1924138
DEN 111.95(111.25)533107
DENABANK 22.4(22.8)4808476
DHANUKA 675.25(696.2)34499
DHFL 552(525.75)11634668
DISHTV 73.45(74.65)6084619
DIVISLAB 1050.7(1036.5)365498
DLF 230.95(233.75)8092805
DREDGECORP 729.3(712.85)635817
DRREDDY 2183.3(2204.25)309833
DYNAMATECH 1771.35(1775.35)3656
ECLERX 1360.6(1324.5)28650
EDELWEISS 272.75(258.1)3516143
EICHERMOT 28027.6(27901.4)37999
EIDPARRY 323.35(324.8)44850
EIHOTEL 182.9(179.95)67415
ELECTCAST 33.4(33.4)240148
ELGIEQUIP 334.25(334.4)14521
EMAMILTD 1079.85(1080.85)116717
ENGINERSIN 175.45(173)1794673
EROSMEDIA 208.4(203.4)1208517
ESCORTS 887.7(901.5)1003321
ESSDEE 70.25(72.2)12454
ESSELPACK 273.45(274.95)596075
EVEREADY 387.85(377.1)143193
EXIDEIND 212.5(213.05)998340
FCONSUMER 63.05(63.8)3072812
FDC 287.75(293.6)178187
FEDERALBNK 95.15(95.1)6255001
FINCABLES 704.25(699.25)108709
FINPIPE 653.25(692.75)88927
FLFL 374.35(378.7)20990
FORTIS 142.45(139)15177477
FSL 48.35(47.55)16985964
GAIL 466.9(465)4658095
GATI 115.5(118.4)849800
GDL 211.85(214.85)311098
GEPIL 884.85(873)29298
GESHIP 398.15(389.1)375932
GET&D 412.3(406.15)32676
GILLETTE 6707.3(6536.2)2877
GLAXO 2459.05(2449.05)10056
GLENMARK 530.45(535.35)1116088
GLOBOFFS 35.6(35.95)14988
GMDCLTD 148.8(145.7)271423
GMRINFRA 19.75(20.05)34448807
GODFRYPHLP 905.05(895.1)239800
GODREJCP 1027.5(1029.5)1580718
GODREJIND 547.6(550.7)842660
GODREJPROP 827.85(828.55)49655
GPPL 151.6(145.75)700687
GRANULES 122.05(122.45)1710457
GREAVESCOT 125.9(131.85)1189832
GREENPLY 370.75(365.85)107045
GRINDWELL 515.2(504.85)10208
GRUH 519.85(532.55)269054
GSFC 136.35(137.85)2802346
GSKCONS 6432.1(5971.1)36746
GSPL 203.05(199.6)1106148
GUJFLUORO 817.4(787.55)59389
GUJGASLTD 858.2(850.65)23770
GULFOILLUB 1052.5(1039.65)37127
GVKPIL 19.55(20.55)12998054
HATHWAY 39.8(39.6)1776555
HAVELLS 514.4(516.05)715021
HCC 35.15(35.95)11968848
HCL-INSYS 67.8(60.65)22307073
HCLTECH 937.8(939.15)1444766
HDFC 1814(1805.45)3923887
HDFCBANK 1883.15(1876.65)894297
HDIL 54.5(54.8)11639088
HEIDELBERG 161.8(161.6)193822
HEROMOTOCO 3596.05(3611.9)315246
HEXAWARE 330.2(329.55)1135496
HFCL 29.95(30.65)5067615
HIMATSEIDE 364.9(364.85)99522
HINDALCO 243.25(243.25)7121280
HINDCOPPER 79.35(79.8)1649523
HINDPETRO 382.65(391.45)4005344
HINDUNILVR 1349.4(1344.45)857401
HINDZINC 309.1(307.65)2014996
HMT 36.25(36)1731
HMVL 243.75(244.6)7776
HONAUT 16959.55(17822.4)3506
HOTELEELA 22.7(23.4)1224141
HSIL 437.35(423.2)62951
HTMEDIA 97.6(95.8)432514
IBREALEST 236.05(234.65)13637559
IBULHSGFIN 1348.2(1314.85)2308630
ICICIBANK 318.95(326.25)15189066
ICRA 3974.25(3935.55)929
IDBI 65.45(67.55)12885847
IDEA 84.8(84.5)13383664
IDFC 53.3(53.75)2503642
IFBIND 1320.9(1382.3)8591
IFCI 23.6(24.15)7635209
IGARASHI 833.45(820.5)35384
IIFL 770.6(761.5)167165
IL&FSTRANS 75.8(77.25)230416
INDHOTEL 135.6(138.05)1471105
INDIACEM 159.2(162.05)2726421
INDIANB 349.35(357.35)1575348
INDOCO 263.2(275.15)156039
INDUSINDBK 1694.45(1687.8)884974
INEOSSTYRO 987.9(950.6)4499
INFRATEL 327.4(338.25)7362307
INFY 1097.75(1102.8)4172856
INGERRAND 760.7(758.8)14769
INOXLEISUR 308(302.3)211201
INOXWIND 133.3(126.55)771036
INTELLECT 201.65(201.15)778506
IOB 21.5(21.8)1588669
IOC 377.35(379.05)3806473
IPAPPM 345.15(353.45)50872
IPCALAB 639.55(639.55)1010480
IRB 228.85(227.5)1526945
ITC 266.5(269.85)11303222
J&KBANK 70.15(70.5)266817
JAGRAN 169.35(170.2)47739
JAICORPLTD 171.35(168.5)2567211
JBCHEPHARM 318.75(318.3)81313
JBFIND 178.85(179.5)45523
JCHAC 2332.55(2320.55)5985
JETAIRWAYS 803.25(823.4)3481334
JINDALPOLY 370.85(355)449128
JINDALSTEL 270.05(274.1)6400186
JISLJALEQS 125.15(123.15)16913652
JKCEMENT 1030.1(1027.4)32475
JKIL 351(362.65)366679
JKLAKSHMI 425.55(423.8)67938
JKTYRE 175.75(190.3)3678905
JMFINANCIL 157.35(154.25)1077512
JPASSOCIAT 17.4(17.85)33597417
JPINFRATEC 14.55(15.1)2332678
JPPOWER 6.45(6.5)1653399
JSWENERGY 82.05(82.55)1887203
JSWHL 1759.9(1740.9)3386
JUBILANT 957.6(936.5)630221
JUBLFOOD 2042.5(2026.65)492952
JUSTDIAL 464.9(474.1)3157741
JYOTHYLAB 359.45(353.4)90986
KALPATPOWR 477.2(475)68869
KANSAINER 510.1(504.75)125714
KEC 389.4(363)1682753
KESORAMIND 136.5(138.55)415756
KIRLOSENG 386.35(379.05)9828
KITEX 246.8(249.65)293166
KOLTEPATIL 367.35(345.6)669058
KOTAKBANK 1042.45(1042.95)1187333
KPIT 218(215.45)2105867
KRBL 638.45(600.2)485284
KSCL 472.95(479.3)427261
KSK 14.5(14.95)649016
KTKBANK 136.75(139.4)1806132
KWALITY 90.15(91.4)891003
L&TFH 169.8(166.45)4457219
LAKSHVILAS 124.65(125.6)369960
LAOPALA 635.55(618.35)36638
LAXMIMACH 5902.5(5862.65)2137
LICHSGFIN 525.05(521.5)1692968
LITL 1.4(1.35)3085653
LT 1361.2(1350.5)2310144
LUPIN 827.6(840.45)1135323
M&M 746.95(746)1207191
M&MFIN 456.2(444.45)2307211
MAGMA 167.45(167.15)146769
MAHINDCIE 218.9(215.35)372737
MAHLIFE 471.55(469.05)23434
MANAPPURAM 107.85(105.9)4528713
MANPASAND 415.3(420.5)87819
MARICO 315.6(310.05)2266519
MARKSANS 40.9(41.35)2373906
MARUTI 9001.6(9117.85)357737
MAYURUNIQ 501.8(511.2)10506
MCDOWELL-N 3214.7(3268.2)437249
MCLEODRUSS 171.05(173.15)244743
MERCK 1493.45(1550.9)20888
MHRIL 313.95(319.25)152934
MINDACORP 203.35(212.3)367322
MINDTREE 723.6(722.4)1028773
MMTC 57.05(58.6)1463711
MOIL 230.5(230.5)391275
MONSANTO 2508.75(2497.4)14505
MOTHERSUMI 357.25(364.45)4850146
MOTILALOFS 1154.35(1156.1)185313
MPHASIS 890.8(857.7)415416
MRF 72329.2(71640.9)10260
MRPL 120(118.75)1314655
MTNL 23.15(23.35)1280607
MUTHOOTFIN 420.45(417.55)596542
NATCOPHARM 783.85(819.65)713301
NATIONALUM 74.45(75.25)6330849
NAUKRI 1251.25(1245.6)162975
NAVKARCORP 176.85(174.75)140410
NCC 126.15(118.55)28655556
NETWORK18 51.7(52.1)799678
NHPC 28.65(29.5)7370928
NIITTECH 830.45(829.05)1047388
NITINFIRE 6.3(6.6)760657
NLCINDIA 103.3(101.8)816789
NMDC 133.65(137.4)4105258
NTPC 162.95(164.9)4101637
OBEROIRLTY 471.85(463.25)154300
OFSS 4014.35(4052.7)31833
OIL 359.25(360.75)650316
OMAXE 230.5(229.55)294267
ONGC 185.75(191)4960527
ORIENTBANK 103.85(112.55)6502789
ORIENTCEM 149.4(150.9)33445
ORISSAMINE 1793.45(1798)1236
PAGEIND 22846.8(22069.3)56193
PARSVNATH 23.5(22.6)409700
PCJEWELLER 376.1(385.25)8301309
PEL 2733.3(2687.3)95811
PERSISTENT 793.75(783.3)67204
PETRONET 252.05(248.7)3777313
PFC 111.25(111.25)4691167
PFIZER 2328.7(2321.4)14564
PFS 33.4(34.25)1270986
PGHH 9296.15(9344.1)2491
PHOENIXLTD 604.85(599.9)62714
PIDILITIND 894.85(894.5)652522
PIIND 839.55(840.45)98360
PNB 145.85(161.65)68396778
POLARIS 469.1(468.85)591148
POWERGRID 195.45(198.5)7792834
PRAJIND 96.8(97.75)1636773
PRESTIGE 312.3(309.65)228692
PRISMCEM 138.3(136.3)3530326
PTC 102.3(102.55)1720636
PUNJLLOYD 21.8(22.1)1794252
PURVA 149(153.15)352449
PVR 1405.5(1412.75)93201
RADICO 360.65(353.55)2687794
RAIN 383.6(392.5)2576375
RAJESHEXPO 819.2(815.1)515171
RALLIS 232.55(232.1)213726
RAMCOCEM 736.85(739.9)102966
RAMCOSYS 454(452.8)46129
RATNAMANI 956.2(962.1)8075
RAYMOND 974.35(979.1)423674
RCF 86.7(86.75)2278528
RCOM 29.6(27.1)175737302
RECLTD 154.75(154.05)4934123
REDINGTON 152.7(152.2)398762
RELAXO 598.95(601.35)33849
RELCAPITAL 509.95(507.4)6482978
RELIANCE 933.65(915.5)10170959
RELINFRA 457.25(461.15)2675349
RENUKA 15.7(16.25)3015796
REPCOHOME 600(592.2)801069
RIIL 505.7(495.25)713748
RKFORGE 813.95(800.6)31368
RNAVAL 41.7(41.7)5459433
ROLTA 76.25(77.65)4522394
RPOWER 45.95(47.35)14816000
RTNPOWER 6.4(6.65)5692202
RUCHISOYA 17.75(17.1)1958084
SADBHAV 394.95(400.65)121644
SADBHIN 139.4(137.25)76908
SAIL 93.55(95.35)17516122
SANOFI 4866.7(4818.05)9437
SBIN 276.2(288.75)45641149
SCHAEFFLER 5391.8(5383)1206
SCHNEIDER 110.4(113.55)152852
SCI 82.35(85.45)2020879
SHARDACROP 393.4(394.15)9037
SHILPAMED 480.95(508.75)222193
SHK 290.3(284.35)125888
SHOPERSTOP 537.3(532.25)33898
SHREECEM 16813.15(16953.35)6148
SHRIRAMCIT 2005.7(2021.35)2944
SIEMENS 1275.5(1255.5)190815
SIMPLEXINF 597.65(572.4)42102
SINTEX 22.55(22.6)1787051
SITINET 19.9(19.7)186571
SJVN 36.8(36.8)1577512
SKFINDIA 1826.7(1834.65)4015
SMLISUZU 817.6(817.9)13537
SNOWMAN 55.15(53.75)1021305
SOBHA 561.75(562.2)222648
SOMANYCERA 693.7(699.7)8901
SONATSOFTW 340.8(294.6)2826228
SOUTHBANK 27.75(28.2)4600227
SPARC 450.5(446.85)343791
SREINFRA 83.2(83.5)1473701
SRF 1908.1(1893.45)164882
SRTRANSFIN 1348.25(1325.9)535338
STAR 723.4(738.9)541514
STCINDIA 166.85(159.25)69917
SUNDARMFIN 1666.25(1658.25)25626
SUNDRMFAST 532(535.2)119466
SUNPHARMA 574.8(589.15)6630066
SUNTV 998.4(985.1)1579126
SUPREMEIND 1190.35(1197.05)47250
SUVEN 200.15(200.1)323531
SUZLON 13.35(13.5)21000357
SWANENERGY 199.85(199.25)107208
SYMPHONY 1754.9(1719.8)11579
SYNDIBANK 63(65.75)6462340
SYNGENE 610.9(604.05)46879
TAKE 169.3(170.6)195711
TATACHEM 714.5(715.5)777282
TATACHEM 733(632.6)1074500
TATACOFFEE 141.2(142.5)374572
TATACOMM 656.6(650)587030
TATAELXSI 1021.65(1007.65)476881
TATAGLOBAL 281.95(285.1)2455660
TATAMOTORS 376.85(371.8)9623436
TATAMTRDVR 212.35(208.2)5022512
TATAPOWER 87.1(86.75)8735379
TATASPONGE 1070.15(1054.05)138092
TATASTEEL 708(713.1)4885951
TBZ 115.35(119.45)345093
TCS 2911.8(2967.3)1423766
TECHM 611.5(590.35)5004415
TECHNO 366.5(365.15)60145
TEXRAIL 96.85(95.65)440372
THERMAX 1197.8(1181.05)22953
THOMASCOOK 242.35(243.5)204196
TIDEWATER 6812.65(6825.45)1212
TIMKEN 817.4(820.45)17359
TITAN 813.7(809.05)2154852
TNPL 397(419)165785
TORNTPHARM 1429.25(1430.8)128238
TORNTPOWER 271.8(270.1)1070510
TREEHOUSE 13.35(13.45)33402
TRIDENT 77.05(75.9)607201
TRITURBINE 121.7(123.75)147515
TTKPRESTIG 7004.95(7019.4)4028
TTML 6.8(6.65)1203487
TV18BRDCST 57.5(56.45)6723425
TVSMOTOR 654(661.25)272224
TVSSRICHAK 3644.9(3642.4)4562
TVTODAY 485.55(475.95)107183
UBL 1056.1(1077.45)225913
UCOBANK 29.05(29.55)578024
UFLEX 379.9(384.1)196025
ULTRACEMCO 4175.5(4200.3)152754
UNICHEMLAB 378.95(377.45)3001516
UNIONBANK 121.2(127.4)4875048
UNITECH 8.05(7.6)49518872
UPL 721.9(726.5)1446323
VAIBHAVGBL 686.55(700.15)8768
VAKRANGEE 222.3(211.75)638773
VEDL 315.75(315.55)7154264
VIDEOIND 18(18.9)2883803
VIJAYABANK 58.95(61.2)1241205
VINATIORGA 858.8(868.45)55900
VIPIND 351.95(354.2)376324
VOLTAS 601.75(592.5)807610
VRLLOG 431.15(427.95)36973
VSTIND 3268.85(3249.55)1409
VTL 1314.4(1316.9)32975
WABAG 568.45(558.45)231086
WABCOINDIA 7334.8(7258.45)7210
WELCORP 172.65(164.6)1304619
WELSPUNIND 68(71.85)2267389
WHIRLPOOL 1474.85(1510.5)57410
WIPRO 293.45(288.95)3023672
WOCKPHARMA 824.85(814.7)1707372
WONDERLA 377.75(386.4)50608
ZEEL 576.6(584.5)672167
ZEELEARN 44.5(44.3)441046
ZENSARTECH 920.9(931.65)15709
ZYDUSWELL 1179.45(1133.95)82633



అక్కడ మరకకు ఉన్న విలువ అమ్మాయి మాటకు లేదు. విచిత్రం.. రక్తపు మరక కనిపించకపోతే అమ్మాయి క్యారెక్టర్‌కు మరక అంటిస్తారు. దిగజారి నిందలు వేస్తారు. శీలానికి శాంపిల్ టెస్ట్‌లు చేసే అమానుష ఆచారాలు ఇంకా మన సమాజంలో కొనసాగుతున్నాయి. పెళ్లైన తొలిరాత్రి కన్యత్వ పరీక్షలు చేసే నీచ బుద్ధిని కడిగేసే ఉద్యమం మహారాష్ట్రలో మొదలైంది.

మరక చెడ్డది!

నవ వధువులకు తొలి రాత్రి కన్యత్వ పరీక్ష

మహారాష్ట్రలోని కొన్ని తెగల్లో కొనసాగుతున్న దుర్మార్గం..

దానికి వ్యతిరేకంగా మొదలైన పోరాటం

అనితకు పెళ్లై రెండేళ్లైంది. తన ఫస్ట్‌నైట్‌ని తలుచుకుంటే ఇప్పటికీ ఆమె కళ్లలో నీటి సుడులు తిరుగుతాయి. తమ కులాచారం ప్రకారం.. మొదటిరాత్రి కన్యత్వ పరీక్ష చేస్తారు! కొత్త జంటకు ఓ వైట్ షీట్ ఇచ్చి.. ఓ హోటల్ రూమ్‌లోకి పంపి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు బయట ఎదురుచూస్తారు. సంభోగంలో అమ్మాయికి బ్లీడింగ్ అయితే ఆమె కన్య! లేకపోతే కాదు! మర్నాడు ఉదయం పెళ్లికొడుకును రక్తపు మరక గురించి అడుగుతారు. అతను ఉందని చెబితే ఆ అమ్మాయి పవిత్రురాలు! లేదని చెబితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి! పంచాయితీలో పెళ్లికూతురును చెప్పులతో కొడతారు. ఆ సమయంలో కన్నవారు కూడా ఆమెనే నిందిస్తారు. అనిత మాత్రమే కాదు.. మహారాష్ట్రలోని కంజర్‌భట్ తెగలో పెళ్లైన ప్రతి అమ్మాయీ.. మొదటి రాత్రి తన కన్యత్వాన్ని నిరూపించుకోవాలి. రెండు లక్షల జనాభా ఉన్న ఈ కులంలో ఎన్నో ఏళ్లుగా ఈ నీచ సంప్రదాయం కొనసాగుతోంది.



ఇది దుర్మార్గమైన ఆచారం. మొదటిసారి సెక్స్ చేసినప్పుడు అమ్మాయికి బ్లీడింగ్ కాకపోవడానికి చాలా కారణాలు ఉంటాయి. స్కూళ్లకు, కాలేజ్‌లకు వెళ్లే క్రమంలో సైకిల్ ఎక్కువగా తొక్కడం, చిన్నతనం నుంచి బాగా ఆటలు ఆడటం వల్ల బ్లీడింగ్ కాకపోవచ్చు. అంతమాత్రాన ఆమె క్యారెక్టర్‌ను అనుమానించడం, అవమానించడం అమానుషం! నిజమైన భర్త ఆ సమయంలో ఆమెకు అండగా ఉండాలి.

– డాక్టర్ సోనియా నాయక్, గైనకాలజిస్ట్

మీరెవరు?

అయితే అమ్మాయి శీలానికి కాండక్ట్ సర్టిఫికెట్ ఇవ్వడానికి కుల పెద్దలు ఎవరు? అంటూ ఇటీవల పోరాటం మొదలైంది. కంజర్‌భట్ కులంలోని యువతులు కన్యత్వ పరీక్షలను తిరస్కరించాలని వివేక్ తమైచెకర్ అనే 25 ఏళ్ల యువకుడు ప్రచారం చేస్తున్నాడు. 'ఇది దారుణం. దంపతుల వ్యక్తిగత జీవితానికి భంగం. బలవంత పరీక్షలతో పెళ్లికూతురును మానసికంగా హింసిస్తున్నారు. రూమ్ బయట గ్రామపెద్దలంతా కూర్చొంటే గదిలోని జంటకు ప్రశాంతత ఏముంటుంది? పెళ్లికొడుకుకి ఆల్కాహాల్ ఇచ్చి లేదా పోర్న్ వీడియోలు చూపించి గదిలోకి పంపుతారు. మర్నాడు పంచాయితీ పెట్టి..నీ భార్య పవిత్రు



రాలా? కాదా? అని ప్రశ్నిస్తారు' అని వివేక్ వివరిస్తున్నాడు. ఆరు నెలల క్రితం వివేక్‌కి పుణెలో పెళ్లైంది. ఎప్పటిలాగే కుల పెద్దలు వచ్చి హంగామా చేశారు. వధువుకు కన్యత్వ పరీక్ష జరగాల్సిందే అన్నారు. కానీ వివేక్ వారిని అడ్డుకున్నాడు. దీంతో వాళ్లు రెచ్చిపోయారు. కులం నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. అయినా వివేక్ వెనక్కి తగ్గలేదు. మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోమన్నాడు. ఇటీవల కంజర్‌భట్ యువతీ యువకులతో ఓ వాట్సాప్ గ్రూప్ కూడా క్రియేట్ చేసి.. ఈ అమానవీయ ఆచారంపై వారికి అవగాహన కల్గిస్తున్నాడు. మహారాష్ట్రలోని కొన్ని కులాల్లో ఇంకా కొనసాగుతున్న కన్యత్వ పరీక్షల అంశం అతడి వల్లే మీడియాలో ఫోకస్ అయింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు కూడా జరుగుతున్నాయి. అమ్మాయిల పవిత్రతను డిసైడ్ చేయడానికి సిద్ధమవుతున్న కుల పంచాయితీలు.. మగాడి క్యారెక్టర్‌ను ఎందుకు ప్రశ్నించవు? అని నిలదీస్తున్నారు.

-సెంట్రల్ డెస్క్




పశువులకూ ప్రెగ్నెన్సీ కిట్

మనది వ్యవసాయ ఆధారిత దేశం. దీనిలో పశువులు ఒక ప్రధాన పాత్ర పోషిస్తాయి. పశువులను తమ సొంత బిడ్డల్లా చూసుకొనే రైతులు ఎందరో! పశువుల గర్భధారణ జరిగిందా? లేదా అనే విషయం కనుగొనడం రైతులకు పెద్ద సమస్య. సాధారణంగా పాలు ఇచ్చే పశువులకు (ఆవులు, గేదెలు) గర్భధారణ జరిగిందా? లేదా? అనే విషయం మూడు నుంచి నాలుగు నెలల తర్వాతే తెలుస్తుంది. చాలా సందర్భాల్లో దీనిని పశువైద్యులే నిర్ధారించగలుగుతారు. శాస్త్రవేత్తల కృషితో రైతులకు ఈ కష్టాలు తీరనున్నాయి. పశువుల్లో గర్భధారణ జరిగిందా? లేదా? అనే విషయాన్ని రైతులే స్వయంగా తెలుసుకోగలిగేలా హైదరాబాద్ లాకోన్స్ (లేబొరేటరీ ఫర్ ద కన్జర్వేషన్ ఆఫ్ ఎన్‌డేంజెర్డ్ స్పీసెస్) శాస్త్రవేత్తలు ఒక కిట్‌ను రూపొందించారు. మన దేశంలో ఈ తరహా కిట్‌ను రూపొందించటం ఇదే తొలిసారి. దీని వల్ల రైతులకు ప్రతి ఏడాది కొన్ని వందల కోట్ల రూపాయలు పరోక్ష లాభం చేకూరుతుందని భావిస్తున్నారు. "నేను ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చాను. చిన్నప్పుడు మా ఆవులను పశు వైద్యుడి దగ్గరకు మైళ్లకు మైళ్లు నడిచి నేనే తీసుకువెళ్లేవాడిని. అది ఎంత కష్టమో నాకు తెలుసు. అందుకే ఈ సమస్య పరిష్కారానికి ఒక కిట్ కనుగొన్నాం. నేను, డాక్టర్ అమిత్ సర్నానా కలిపి రూపొందించిన కిట్ చాలా చవక కూడా.." అని డాక్టర్ ఉమాపతి తెలిపారు. ఈ శాస్త్రవేత్తలు తమ పరిశోధనల కోసం దేశంలోని వివిధ ప్రాంతాల్లోని మూడు వేల పశువుల నుంచి నమూనాలను సేకరించి వాటిలో ఒక మాలిక్యూల్‌ను గుర్తించారు. దీని ద్వారా పశువుకు గర్భధారణ జరిగిందా లేదా అనే విషయం మూడు వారాల్లో తెలిసిపోతుంది. "మహిళల గర్భధారణను కొన్ని హార్మోన్స్ ద్వారా తెలుసుకోవచ్చు. కానీ పశువుల్లో అది సాధ్యం కాదు. అందువల్ల మేము పశువుల పేడలో ఉండే ఒక మాలిక్యూల్‌ను కనుగొన్నాం. ఇది గర్భం ధరించిన పశువులన్నింటిలోనూ ఉంటుంది. పేడను తీసుకొని దానిని మా కిట్‌పై ఉన్న తెల్లటి రంధ్రాలపై రాస్తే రంగు మారుతుంది. రంగు మారితే గర్భం ధరించినట్లే" అని ఉమాపతి వెల్లడించారు. ఇలాంటి కిట్ మన దేశంలో ఇప్పటి దాకా అందుబాటులో లేదు. "ఇది పశువుల పెంపకంలో ఒక నూతన విప్లవం తీసుకొస్తుంది. ఉదాహరణకు ఇప్పటి దాకా ఒక పశువు గర్భం ధరించిందా? లేదా అనే విషయం తెలుసుకోవాలంటే ఒక రైతు- కొంత సొమ్ము ఖర్చుపెట్టాలి. తన విలువైన సమయాన్ని వెచ్చించాలి. చాలా గ్రామాల్లో పశువైద్యులు ఉండరు కాబట్టి.. పశువులను దూరప్రాంతాలకు తీసుకువెళ్లాలి. ఒక వేళ గర్భధారణ జరగకపోతే శ్రమంతా వృథా అవుతుంది. మా కిట్‌తో ఇలాంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. రైతులు స్వయంగా పరీక్షించవచ్చు. అంతే కాకుండా దీని ఖరీదు చాలా తక్కువ. ప్రస్తుతం మా పరిశోధనాశాలలో ఒక కిట్‌ను తయారుచేయటానికి మూడు రూపాయలైంది. ఈ కిట్‌లపై ఇప్పటికే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది" అని ఉమాపతి వివరించారు. వివిధ వాతావరణ పరిస్థితుల్లో ఈ కిట్ ఎలా పనిచేస్తోందనే విషయాన్ని తెలుసుకోవటానికి తుది ప్రయోగాలు జరుపుతున్నామని చెప్పారు. "మన దేశంలో రకరకాల శీతోష్ణస్థితులు ఉంటాయి. ఉదాహరణకు రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో వేసవిలో ఉష్ణోగ్రత 50 డిగ్రీలు దాటుతుంది. అలాంటి పరిస్థితుల్లో కూడా ఈ కిట్ ఎలా పనిచేస్తుందనే విషయంపై పరిశోధనలు చేస్తున్నాం. ఇవి కూడా పూర్తయితే మార్కెట్‌లోకి విడుదల చేస్తాం" అని ఉమాపతి వెల్లడించారు. ఈ కిట్‌లో ఉపయోగించిన టెక్నాలజీపై తమకు పేటెంట్ లభించిందని, దీనిని భవిష్యత్తులో అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశపెట్టే ఆలోచన ఉందని ఆయన వివరించారు.

– స్పెషల్ డెస్క్



పశువుల కోసం రూపొందించిన ప్రెగ్నెన్సీ కిట్



లాకోన్స్ శాస్త్రవేత్త డాక్టర్ ఉమాపతి

సంపన్నులకు బెయిలు..

లేనివారికి జైలా?

కేసులన్నింటినీ ఒకే గాటన కట్టి బెయిల్ తిరస్కరించడం వ్యక్తుల జీవించే హక్కును హరించటమేనని, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో కోర్టులు తాత్కాలిక బెయిలు మంజూరు చేసి మానవ హక్కులను కాపు గాయాలని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో సూచించింది.



క్రిమినల్ నేరాల్లో నిందితుడు బెయిల్ పొందటం ఒక నిరంతర సమస్య. బెయిల్ ఇవ్వదగిన, ఇవ్వదగని నేరాలను క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ వర్గీకరించింది. తీవ్రమైన నేరాల్లో 'ముందస్తు' బెయిల్ పొందే అవకాశాన్ని చట్టం కల్పించింది. షెడ్యూలు కులాలు, తెగలపై అణచివేత నిరోధక చట్టంలో ముందస్తు బెయిల్‌కు అవకాశం ఇవ్వకపోవటం రాజ్యాంగ విరుద్ధమని ఇటీవలి సుప్రీంకోర్టు కేసు విచారణలో అమికస్ క్యూరీ వాదించారు. ఆర్థిక నేరాల్లో, నిందితుడు పలాయనం చిత్తగించడని విశ్వసించే కేసుల్లో కోర్టులు ఉదారంగా బెయిల్ మంజూరు చేయాలని సుప్రీం కోర్టు ఈ ఫిబ్రవరి 6న దాతారామ్ సింగ్ కేసులో సూచించడం విశేషం. కేసులన్నింటినీ ఒకే గాటన కట్టి బెయిలు తిరస్కరించడం, ఎడాపెడా అరెస్టు పర్వాలతో జైళ్లను నింపి ప్రభుత్వ నిధులను వృథా చేయడం వ్యక్తుల జీవించే హక్కును హరించటమేనని, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో కోర్టులు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసి మానవ హక్కులను కాపు కాయాలని సుప్రీంకోర్టు సుఖవంత్‌సింగ్ కేసు (2009)లో వ్యాఖ్యానించింది. నాన్ బెయిలబుల్ కేసుల్లో జామీను ఇవ్వడమా లేక తిరస్కరించడమా అనేది కోర్టు విచక్షణాధికారం. ఆ విచక్షణ దుర్వినియోగం కారాదు. అలాగే పోలీసు అధికారే బెయిల్ మంజూరు చేయదగిన నేరాల అంశంలో కూడా నిందితులు వేధింపుల పాలవుతున్నారనే విమర్శలున్నాయి. నేరారోపణలోని తీవ్రత ఆధారంగానో, సంతృప్తికరమైన జామీను సమర్పించుకోలేని కారణంగానో పేద నిందితులు కటకటాల్లో నెలల తరబడి మగ్గిపోవడం విచారకరం. పలుకుబడి, అర్థబలం ఉన్న నిందితులు సులువుగా విడుదలవడం బెయిల్ ప్రక్రియలోని లోపాలకు నిదర్శనం. నిందితుడిని బెయిల్‌పై విడిచిపెట్టడంలో ఉద్దేశం దర్యాప్తులో అతడు హాజరుకు హామీ పొందడమేననీ, ఈ విషయంలో నిందితుల సామాజిక, ఆర్థిక స్థాయిలు ఎలాంటి ప్రభావం చూపలేవని, దర్యాప్తు కాలంలో అరెస్టులు 'శిక్ష' కాదని, ఈ సాకుతో వ్యక్తి స్వేచ్ఛను హరించడం నిషిద్ధమని సంజయచంద్ర కేసు (2011)లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జామీను షరతుల విధింపులో కోర్టు వాస్తవిక దృక్పథంతో వ్యవహరించాలని, ఆర్థిక కారణాలతో సరైన జామీను ఇచ్చుకోలేని పరిస్థితి కల్పించి నిందితుల బెయిల్ హక్కును కోర్టులు కాలరాయరాదని సుప్రీంకోర్టు 'దాతారామ్' కేసులో హితవు చెప్పడం, కింది స్థాయి కోర్టులు, పోలీసు వర్గాలకూ మార్గదర్శకం. పేద నిందితులను 'బెయిల్ బాధితులు'గా మిగిల్చే అరాచక పర్వాలకు ఇటీవలి క్రిమినల్ ప్రొసీజరు కోడ్ సవరణలు కొంతమేర 'చెక్' పెట్టగలిగినా, పూర్తి ఫలితాలు రావటం లేదు. సెక్షన్ 41 నోటీసు జారీ నెపంతో ప్రక్రియ వక్రమార్గం పడుతోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ విమర్శల నేపథ్యంలో లా కమిషన్ 2017లో వెలువరించిన 268వ నివేదికలో చేసిన నిర్మాణాత్మక సూచనలు ప్రస్తావించాలి. 'పెద్దల'కు చిటికెలో దొరికే బెయిల్ సామాన్యులకు అందని ద్రాక్ష కావటాన్ని దుయ్యబట్టిన లా కమిషన్ విచారణకు ముందే, విధించదగిన శిక్షలో సగం కాలం పైగా బెయిలు దక్కని జైలు జీవితం గడిపేసిన నిందితులకు సొంత పూచీకత్తుపై జామీను ఇచ్చే దిశలో 'శాసన చికిత్స' జరగాలని సూచన చేయడం విశేషం. ఈ దిశలో చట్ట సవరణ జరిగేదెన్నడు?



లా-లోచనం
Law lochanam

– వేదాంతం సీతారామావధాని, భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్, సెల్ : 70421 40099

గళమెత్తిన ఐఐటీయన్




» **అగ్రశ్రేణి టెక్ సంస్థల్లోనూ ఇక విద్యార్థి సంఘాలు ?**

» **ఎన్నికలు జరిపేట్లు సంస్కరణలు తేవాలి : స్టూడెంట్స్ డిమాండ్**

ఇన్నాళ్లూ విద్యార్థి సంఘాల ఏర్పాటు, వాటికి ఏటేటా ఎన్నికలు కేవలం కాలేజీలు, విశ్వవిద్యాలయాలకే పరిమితమయ్యేవి. దేశంలో అగ్రశ్రేణి టెక్నాలజీ సంస్థలైన- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీలకూ) ఇపుడా సెగ తగిలింది. క్యాంపస్ సమస్యలు, విద్యార్థిలోక ఇబ్బందుల పరిష్కారానికి ఒక వేదిక ఉండాలని, ఎన్నికలు జరిపి తమ ప్రతినిధులను ఎన్నుకొనే రీతిలో సంస్కరణలు తేవాలని ఐఐటీ విద్యార్థులు గళమెత్తుతున్నారు. దేశంలో 23 ఐఐటీలున్నాయి. వీటిలో పాత ఐఐటీలు ఏడింటిలోనూ ఈ డిమాండ్లు మొదలయ్యాయి. సోషల్ మీడియాలో ఇప్పటికే వివిధ పేర్లతో గ్రూపులుగా ఏర్పాటైన విద్యార్థులు.. సెనెట్లలోనూ, కరిక్యులమ్, మెస్ కమిటీల్లోనూ, ఇతర కీలక విధాన నిర్ణాయక వేదికల్లోనూ తమ భాగస్వామ్యం ఉండాలంటున్నారు. అంతేకాదు, అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులకు అవకాశం కల్పించాలని, ఇందుకు బయటి జోక్యం లేని ఎన్నికలు జరపడమే మార్గాంతరమని వాదిస్తున్నారు.

మెస్‌లో భోజనం నాణ్యత బాగోలేదంటూ ఈ మధ్య ఐఐటీ ఇండోర్‌లో ఓ విద్యార్థి గ్రూపు ఆందోళన చేపట్టింది. ఇది ఆగకపోవడంతో ఆ విద్యార్థి గ్రూపును రద్దుచేస్తున్నట్లు అధికారులు ప్రకటించగా మరింత నిరసన పెల్లుబికింది. అలాగే ఐఐటీ బాంబేలో విద్యార్థులు తక్షణం ఎన్నికలు జరిపి అన్ని విభాగాల్లో తమకు ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జనవరి 11న 'స్వర' పేరుతో ఓ బహిరంగ లేఖను యాజమాన్యానికి రాశారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో కేవలం అత్యున్నత విద్యా నిర్ణాయక వ్యవస్థ సెనెట్‌లో మాత్రమే విద్యార్థి ప్రాతినిధ్యం ఉంది. అది కూడా ఒకే ఒక్క రిసెర్చ్ స్కాలర్‌ను తీసుకుంటారు.. నామ్‌కే వాస్తేగా! ఇపుడు అన్ని విభాగాల్లో ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 12 నుంచి ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. ఐఐటీ బనారస్ హిందూ వర్సిటీలో "స్టూడెంట్స్ ఫర్ ఛేంజ్" అనే గ్రూపు ఏర్పాటై ఎన్నికల నిర్వహణకు గళమెత్తుతోంది. అది కూడా అన్ని గ్రూపుల సమ్మిళితమైన వ్యవస్థగా రూపొందాలని కోరుతోంది. అంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మహిళా వర్గాల నుంచి కూడా దామాషా ప్రాతినిధ్యం ఉండాలని పరోక్షంగా కోరుతోంది. ఇలాంటి సంఘాలు ఉంటేనే యాజమాన్యాలు తీసుకొనే అప్రియమైన ఏకపక్ష నిర్ణయాలను ప్రశ్నించే అవకాశం ఉంటుందని విద్యార్థులు భావిస్తున్నారు. వివిధ క్యాంపస్‌ల్లో సాగుతున్న ఆందోళనలన్నీ ఒకతాటిపైకి తెచ్చి ఓ ఉమ్మడి నిర్ణయాన్ని ఐఐటీలు తీసుకొనేట్లుగా ఒత్తిడి తేవడానికి ఓ సమన్వయ కమిటీ 2016 డిసెంబరులోనే ఏర్పాటయ్యింది. దీని పేరు "కోఆర్డినేషన్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్స్ (కోస్టిసా). దీనికి ప్రతీ క్యాంపస్‌లో ఒక్కో కో ఆర్డినేటర్ ఉంటారు. సమాచారాన్ని పరస్పరం చేరవేసుకోవడం, సంఘీభావ ప్రదర్శనలు, సమావేశాల నిర్వహణ... మొదలైనవి వీరు చేపడతారు.అయితే ఈ గళమెత్తుతున్న వారంతా పీజీ విద్యార్థులు, రిసెర్చ్ స్కాలర్లు, పీహెచ్‌డీ పూర్తి చేసి బయట ఉన్నవారే! వీరు ఇంతకుమునుపు జేఎన్‌యూ, హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ మొదలైన చోట్ల ఈ ఎన్నికల వ్యవహారాల్లో తలదూర్చినవారు. అండర్ గ్రాడ్యుయేట్స్ కోర్సుల్లో ఉన్నవారు, ఇంజనీరింగ్ విభాగాల్లో ఉన్నవారు దీనికి దూరంగా ఉన్నారు.

ఐఐటీ ప్రొఫెసర్లు, సెనెట్లు మాత్రం విద్యార్థి సంఘాల ఏర్పాటును సమ్మతించడం లేదు. వీటి వల్ల ఐఐటీల స్థాయి మరింత దిగజారుతుందని, ఆఖరికి కరిక్యులమ్ మీద కూడా ఇంతకాలం తమకు ఉన్న అటానమీ పోతుందని, విద్యార్థుల దయాదాక్షిణ్యాల మీద పరీక్షలు, సెమిస్టర్లు జరపాల్సి ఉంటుందన్నది వారి వాదన.



'ఐక్యతా విగ్రహం' ఆవిష్కరణ అక్టోబర్ 31న

వడోదరా, ఫిబ్రవరి 14: అత్యంత ఎత్తయిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని అక్టోబర్ 31న ఆవిష్కరించనున్నట్లు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది. పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపింది. గుజరాత్‌లోని నర్మదా నది మధ్యలో సర్దార్ సరోవర్ డ్యాంకు మూడు కిలోమీటర్ల దూరంలో 182 మీటర్ల ఎత్తులో దీన్ని నిర్మిస్తున్నారు. పటేల్ 138వ జయంతి సందర్భంగా 2013 అక్టోబర్ 31న ప్రధాని మోదీ.. ఈ విగ్రహ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ విగ్రహాన్ని 'ఐక్యతా విగ్రహం (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ)'గా పిలుస్తారు. దేశానికి తొలి హోంమంత్రిగా పనిచేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని కొనసాగించేందుకు గుజరాత్ ప్రభుత్వం విగ్రహ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. పనులను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జేఎన్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు.

ముఖ్య సూచనలు

- పరీక్షలో విద్యార్థులు చేతిరాత మీద తగినంత శ్రద్ధ చూపాలి. వీలైనంతవరకు కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.
- ప్రశ్నలకు సమాధానాలు వ్యక్తీకరించడంలో తగినంత స్పష్టత ఉండాలి.
- సమాధానాలకు సంబంధించిన ఫార్ములాలు ఉంటే వాటిని కూడా తప్పకుండా రాయాలి.
- ముందుగా తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- ప్రిపరేషన్ సమయంలో మొదట దీర్ఘ సమాధాన ప్రశ్నలు, తరవాత స్వల్ప సమాధాన ప్రశ్నలు, చివరగా అతి స్వల్ప సమాధాన ప్రశ్నల క్రమాన్ని అనుసరించాలి.
- మొత్తం ప్రశ్న పత్రం అంతటికీ జవాబులు రాసిన తరవాత ఛాయిస్ ప్రశ్నలను ప్రయత్నించాలి. చివర్లో ఛాయిస్ అని హెడ్డింగ్ పెట్టి ఆ ప్రశ్నలకు సమాధానాలు రాస్తే ముందు రాసిన సమాధానాలకు ఎక్కడైనా మార్కులు తగ్గినా ఛాయిస్‌లో ఆ మార్కులు పొందొచ్చు.
- సమాధానాలను మరీ పెద్దవిగా లేదా మరీ చిన్నవిగా రాయకూడదు.
- ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో విద్యార్థులు కొత్త అంశాల జోలికి వెళ్లకుండా.. ఇప్పటికే తాము చదివిన అంశాల రివిజన్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి.
- గత ప్రశ్నపత్రాల ఆధారంగా వెయిటేజీ ఎక్కువ ఉన్న అంశాలపై మరింత పట్టు సాధించేందుకు కృషి చేయాలి.

జాబ్ కార్నర్

భెల్‌లో ఇంజనీర్ ట్రైనీలు

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్ఇఎల్) ఇంజనీర్ ట్రైనీల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **50**
- విభాగాలవారీ ఖాళీలు: మెకానికల్ 30, ఎలక్ట్రికల్ 20
- అర్హత: సంబంధిత విభాగంలో బిఇ/ బిటెక్ / అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ/ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్స్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: సెప్టెంబరు 1 నాటికి 27 ఏళ్లు, పీజీ (ఇంజనీరింగ్/ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/ మేనేజ్‌మెంట్) అభ్యర్థులకు 29 ఏళ్లు మించరాదు
- ఎంపిక: గేట్ 2018 స్కోరు ఆధారంగా 1:10 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకి షార్ట్‌లిస్ట్ చేస్తారు. గేట్ స్కోరుకు 75 శాతం, ఇంటర్వ్యూకి 25 శాతం వెయిటేజీ ఇస్తారు.
- ట్రైనింగ్ వ్యవధి : ఏడాది
- వేతనం: నెలకు రూ.20,600
- దరఖాస్తు ఫీజు: రూ.300
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 12
- వెబ్‌సైట్: www.careers.bhel.in

రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్

వైజాగ్ స్టీల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్) - మేనేజ్‌మెంట్ ట్రైనీల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాలు: హెచ్ఆర్, మార్కెటింగ్
- ఎంపిక: యుజిసి - నెట్ 2018 స్కోరు ద్వారా
- యుజిసి నెట్ 2018 జరిగే తేదీ: జూలై 8
- యుజిసి నెట్ 2018 దరఖాస్తు ప్రారంభం: మార్చి 6 నుంచి
- నెట్ ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 5
- యుజిసి నెట్ వెబ్‌సైట్: https://cbsenet.nic.in
- ఆర్ఐఎన్ఎల్ వెబ్‌సైట్: www.vizagsteel.com

రైట్స్‌లో ఇంజనీర్లు

రైట్స్ లిమిటెడ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **30**
- విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రికల్ 22, మెకానికల్ 8
- వయసు: ఫిబ్రవరి 1 నాటికి 32 ఏళ్లు మించరాదు
- అర్హత: ఫస్టు క్లాసు మార్కులతో సంబంధిత విభాగంలో బిఇ / బిటెక్ / ఎఎంఐఇ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రొడక్షన్ / క్యుఎ / మెయింటెనెన్స్ / సర్వీస్ విభాగాల్లో రెండేళ్ల అనుభవం ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హత, అనుభవం, ఇంటర్వ్యూల్లో ఒక్కోదానికి 20 శాతం, రాత పరీక్షకు 40 శాతం వెయిటేజీ ఇస్తారు.
- రాత పరీక్ష: ఫిబ్రవరి 24న
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 22
- వెబ్‌సైట్: www.rites.com

మణిపాల్ యూనివర్సిటీ

జైపూర్‌లోని మణిపాల్ యూనివర్సిటీ బోధనా సిబ్బంది నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్
- విభాగాలు: ఇంజనీరింగ్ / లా / ఆర్కిటెక్చర్ / డిజైన్ / మేనేజ్‌మెంట్ / కామర్స్ / జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్ / బేసిక్ సైన్సెస్ / హ్యూమానిటీస్ & సోషల్ సైన్సెస్
- అర్హత: సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో డిగ్రీ & పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. పిహెచ్‌డి అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. పోస్టుకు నిర్దేశించిన విధంగా అనుభవం ఉండాలి.
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 16
- వెబ్‌సైట్: www.jaipur.manipal.edu




బోర్డర్ పోలీస్ ఫోర్స్

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటిబిపిఎఫ్) తాత్కాలిక ప్రాతిపదికన కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **134**
- వయసు: 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. లైట్ / మీడియం / హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. డ్రైవింగ్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలి.
- ఎంపిక: రాతపరీక్ష, ప్రాక్టికల్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ టెస్ట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా.
- రాత పరీక్ష వివరాలు: పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 100. జనరల్ నాలెడ్జ్, మేథమెటిక్స్, హిందీ, ఇంగ్లీష్ విభాగాల్లో ఒక్కోదాని నుంచి 10 ప్రశ్నలు, ట్రేడ్ రిలేటెడ్ థియరీ నుంచి 60 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలో ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 15
- వెబ్‌సైట్: recruitment.itbpolice.nic.in

ఇంటర్‌లో...
మార్కుల పంట



ఎగ్జామ్ గైడ్

తెలుగు రాష్ట్రాల్లో మరో రెండు వారాల్లో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. భావి భవిష్యత్‌కు ఈ దశలో సాధించిన మార్కులే పునాదిగా నిలుస్తాయి. మరో వైపు ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్లు కూడా ఈ సమయంలో వెలువడుతుంటాయి. ఈ తరుణంలో విద్యార్థులు ఒత్తిడికి లోనవడం సహజమే. అయితే ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తేనే ఒత్తిడిని అధిగమించి మంచి మార్కులు సాధించవచ్చు. ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ప్రిపరేషన్ వివిధ ప్రవేశ పరీక్షలకు కూడా ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియెట్‌లో మంచి మార్కులు సాధించాలంటే ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో తెలుసుకుందాం.....

మ్యాథమెటిక్స్

ఎంపీసీ విద్యార్థులు అత్యధిక మార్కుల సాధనలో మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌ది కీలకపాత్ర. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో స్వల్ప సమాధానాల ప్రశ్నలపై పట్టు సాధించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జేఈఈ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించిన వెయిటేజీ ఇలా ఉంటుంది..

మ్యాథమెటిక్స్ 1 - ఎ

	అంశం	మార్కుల వెయిటేజీ
బీజగణితం	ప్రమేయాలు	11 (7+ 2 + 2)
	గణితానుగమనం	7 (7)
	మాత్రికలు	22 (7+7+4+2+2)
సదిశ బీజగణితం	సదిశల సంకలనం	8 (4 + 2 + 2)
	సదిశల గణనం	13 (7+ 4+2)
త్రికోణమితి	త్రికోణమితీయ నిష్పత్తుల నుంచి త్రికోణమితీయ పరివర్తనాల వరకు	15 (7+ 4 + 2 + 2)
	త్రికోణమితీయ సమీకరణాలు	4 (4)
	విలోమ త్రికోణమితీయ ప్రమేయాలు	4 (4)
	అతి పరావలయ ప్రమేయాలు	2 (2)
	త్రిభుజ ధర్మాలు	11 (7+4)

మ్యాథమెటిక్స్ 1 - బి

	అంశం	మార్కుల వెయిటేజీ
నిరూపక రేఖా గణితం	బిందుపథం	4 (4)
	అక్ష పరివర్తనం	4 (4)
	సరళ రేఖలు	15 (7+4+2+2)
	సరళరేఖా యుగ్మాలు	14 (7 + 7)
త్రిపరిమాణ రేఖా గణితం	త్రి పరిమాణ నిరూపకాలు	2 (2)
	దిక్కొసైన్‌లు, దిక్ సంఖ్యలు	7 (7)
	సమతలం	2 (2)
కలన గణితం	అవధులు, అవిచ్ఛిన్నత	8 (4 + 2 + 2)
	అవకలనం	15 (7+ 4+ 2+2)
	ఉజ్జాయింపులు, దోషాలు	2 (2)
	మార్పు రేటు	4 (4)
	స్పర్శ రేఖలు, అభిలంబ రేఖలు	11 (7 + 4)
	గరిష్ఠ, కనిష్ఠ విలువలు	7 (7)
	మధ్యమ మూల్య సిద్ధాంతాలు	2 (2)

మ్యాథమెటిక్స్ 2 - ఎ

	అంశం	మార్కుల వెయిటేజీ
బీజగణితం	సంకీర్ణ సంఖ్యలు	8 (4 + 2 + 2)
	డిమోయర్ సిద్ధాంతం	9 (7+2)
	వర్గ సమాసాలు	6 (4+ 2)
	సమీకరణవాదం	9 (7+2)
	ప్రస్తారాలు - సంయోగాలు	12 (4+4+2+ 2)
	ద్విపద సిద్ధాంతం	16 (7+7+2)
	పాక్షిక భిన్నాలు	4 (4)
సంభావ్యత	విస్తరణ కొలతలు	9 (7+2)
	సంభావ్యత	15 (7+4+4)
	సంభావ్యత ద్విపద విభాజనం	9 (7+2)

మ్యాథమెటిక్స్ 2 - బి

	అంశం	మార్కుల వెయిటేజీ
నిరూపక రేఖా గణితం	వృత్తం	22 (7+7+4+2+2)
	వృత్త సరణులు	6 (4+2)
	పరావలయం	9 (7+2)
	దీర్ఘవృత్తం	8 (4+4)
	అతి పరావలయం	6 (4+2)
కలన గణితం	అనిశ్చిత సమాకలనం	16 (7+7+2)
	నిశ్చిత సమాకలనం	15 (7+4+2+2)
	అవకలన సమీకరణాలు	13 (7+4+2)

ఫిజిక్స్

భౌతిక శాస్త్రంలో 60కి 60 మార్కులు సాధించాలంటే విద్యార్థులు ముఖ్యంగా చాప్టర్లన్నింటిలోని అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు చదవాలి. తెలుగు అకాడమీ పుస్తకాల్లో ప్రతి అధ్యాయంలో వివరణాత్మకంగా ఇచ్చిన సమస్యలను, అధ్యాయం చివర్లో ఇచ్చిన వాటిని తప్పనిసరిగా నేర్చుకోవాలి. ప్రతి అధ్యాయానికి సంబంధించిన సమ్మరీ, ముఖ్య విషయాలు, నిర్వచనాలను క్షుణ్నంగా చదవాలి. అతి స్వల్ప సమాధాన ప్రశ్నల కోసం తెలుగు అకాడమీ పుస్తకాల్లోని అధ్యాయాలను వాటిలోని ప్రతి పేరాగ్రాఫ్‌ని వివరణాత్మకంగా చదువుకోవాలి. ఏటా 2 లేదా 3 అతి స్వల్ప సమాధాన ప్రశ్నలను వైవిధ్యంగా ఇస్తున్నారు. కాబట్టి ప్రతి అంశాన్ని గుర్తుపెట్టుకొనే ప్రయత్నం చేస్తుంటే భౌతిక శాస్త్రంలో 60కి 60 మార్కులు సాధించడానికి వీలుంటుంది. ఫిజిక్స్ అంటే భయపడే విద్యార్థులు ముందుగా గత మూడు నాలుగేళ్ల ప్రశ్నపత్రాలను చదివితే ప్రయోజనకరంగా ఉంటుంది. గత వార్షిక ప్రశ్నపత్రాల్లోని దీర్ఘ సమాధాన ప్రశ్నలు, స్వల్ప సమాధాన ప్రశ్నలు, అతి స్వల్ప సమాధాన ప్రశ్నలను పరిశీలిస్తే మార్కుల వెయిటేజీ అర్థమవుతుంది. విద్యార్థులు భౌతిక శాస్త్రం పేపరుకు సమాధానాలు రాసేటపుడు కింది విషయాలు గుర్తుపెట్టుకుంటే మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది.

- అతి స్వల్ప సమాధాన ప్రశ్నలకు 2 లేదా 3 పంక్తుల్లో సమాధానం రాయాలి. ఈ ప్రశ్నలన్నింటికీ ఒకే చోట సమాధానాలు రాయడం మంచిది.
- స్వల్ప సమాధాన ప్రశ్నలకు 16 లేదా 20 పంక్తుల్లో మాత్రమే సమాధానం రాయాలి. ముందుగా ప్రాబ్లమ్ బేస్డ్, తరవాత డెరివేషన్ బేస్డ్, చివరలో థియరీ బేస్డ్ ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- దీర్ఘ సమాధాన ప్రశ్నలకు 20 లేదా 35 పంక్తుల్లో సమాధానం రాయాలి
- సమాధానానికి సంబంధించిన గ్రాఫ్‌లు, బొమ్మలను చక్కగా గీయాలి
- గ్రాఫ్‌లు, బొమ్మలు గీసేటపుడు వాటికి సంబంధించిన భాగాలను, సంకేతాలను స్పష్టంగా చూపిస్తూ విశదపరచాలి.
- ప్రాబ్లమ్ బేస్డ్ ప్రశ్నలకు సమాధానాలు రాసేటపుడు మొదట సమస్యలో ఇచ్చిన విషయాన్ని, దానికి సంబంధించిన ఫార్ములాను రాసి తరవాత ఇచ్చిన విలువలను ఫార్ములాలో ప్రతిక్షేపించి సమస్యను సాధించాలి. సాధన చివరలో యూనిట్స్‌ను రాయాలి.
- దస్తూరి బాగాలేని వారు సమాధానాలు రాసేటపుడు పదానికి పదానికి మధ్య గ్యాప్ ఇవ్వాలి.
- సమాధానాన్ని దశలవారీగా క్రమ పద్ధతిలో రాయాలి.

మొదటి సంవత్సరం

అంశం	అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు	స్వల్ప సమాధాన ప్రశ్నలు	దీర్ఘ సమాధాన ప్రశ్నలు
భౌతిక ప్రపంచం	1	-	-
ప్రమాణాలు, కొలతలు	1	-	-
సరళరేఖాత్మక గమనం	1	1	-
సమతలంలో చలనం	1	1	-
గమన నియమాలు	1	1	-
పని, శక్తి, సామర్థ్యం	-	-	1
కణాల వ్యవస్థలు భ్రమణ గమనం	1	1	-
డోలనాలు	-	-	1
గురుత్వాకర్షణ	-	1	-
ఘన పదార్థాల యాంత్రిక ధర్మాలు	-	1	-
ప్రవాహిలో యాంత్రిక ధర్మాలు	1	-	-
పదార్థ ఉష్ణ ధర్మాలు	1	1	1
ఉష్ణ గతిక శాస్త్రం	1	1	1
అనుచలన సిద్ధాంతం	1	-	-

రెండో సంవత్సరం

అంశం	అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు	స్వల్ప సమాధాన ప్రశ్నలు	దీర్ఘ సమాధాన ప్రశ్నలు
తరంగాలు	-	-	1
కిరణ దృశ్యాశాస్త్రం దృక్‌సాధనాలు	1	1	-
తరంగ దృశ్య శాస్త్రం	-	1	-
విద్యుత్ ఆవేశాలు, క్షేత్రాలు	-	1	-
స్థిర విద్యుత్ పొటెన్షియల్ కెపాసిటెన్స్	-	1	-
ప్రవాహ విద్యుత్	1	-	1
చలించే ఆవేశాలు అయస్కాంతత్వం	1	1	-
అయస్కాంతత్వం ద్రవ్యం	2	-	-
విద్యుదయస్కాంత ప్రేరణ	-	1	-
ఏకాంతర విద్యుత్ ప్రవాహం	1	-	-
విద్యుదయస్కాంత తరంగాలు	1	-	-
ఏకాంతర విద్యుత్ ప్రవాహం	1	-	-
విద్యుదయస్కాంత తరంగాలు	1	-	-
వికిరణం ద్రవ్యాల ద్వంద్వ స్వభావం	1	-	-
పరమాణువులు	1	1	-
కేంద్రకాలు	-	-	1
అర్థవాహక ఎలక్ట్రానిక్స్, పదార్థాలు, పరికరాలు సరళవలయాలు	1	1	-
సంసర్గ వ్యవస్థలు	1	-	-

- రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం, వెలాసిటి విద్యాసంస్థలు

విశ్లేషణాత్మకంగా బయాలజీ...

- బైపీసీ విద్యార్థులు బోటనీ, జువాలజీ సబ్జెక్టులను అనలిటికల్ అప్రోచ్‌తో చదవాలి. దాంతోపాటు అప్లికేషన్ ఓరియెంటేషన్ అలవరచుకోవాలి.

బోటనీ

- ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.. మొక్కల శరీర ధర్మశాస్త్రం; బయోటెక్నాలజీ; మైక్రోబ్స్, అణుజీవశాస్త్రం యూనిట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. బోటనీ విషయంలో ఫ్లో చార్ట్‌లు, డయాగ్రమ్స్ వేయడం ప్రాక్టీస్ చేయాలి. ఫిజియాలజీ చాప్టర్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించాలి.
- మొదటి సంవత్సరం విద్యార్థులు.. మొక్కల నిర్మాణాత్మక సంవిధానం - స్వరూప శాస్త్రం; జీవ ప్రపంచంలో వైవిధ్యం; కణనిర్మాణం, విధులు; మొక్కల అంతర్నిర్మాణ సంవిధానం, మొక్కల్లో ప్రత్యుత్పత్తి యూనిట్లపై ఎక్కువగా దృష్టిపెట్టాలి. దీనికి సంబంధించి డయాగ్రమ్స్ ప్రాక్టీస్ చేయాలి.

జువాలజీ

- జువాలజీ విషయంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.. మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, ప్రత్యుత్పత్తి సంబంధిత ఆరోగ్యం; అంతఃస్రావక వ్యవస్థ, నాడీ నియంత్రణ - సమన్వయం; శరీర ద్రవాలు, ప్రసరణ, విసర్జక పదార్థాలు; జన్యుశాస్త్రాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.
- ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. జంతుదేహ నిర్మాణం; గమనం, ప్రత్యుత్పత్తి; జీవావరణం; పర్యావరణం; బొద్దింక జీవ వ్యవస్థ తదితర అంశాలను క్షుణ్నంగా చదవాలి. జువాలజీలో కూడా గ్రాఫికల్ ప్రజంటేషన్ మార్కుల సాధనలో కీలకం. కాబట్టి డయాగ్రమ్స్ ప్రాక్టీస్ చేయాలి.

కెమిస్ట్రీ సబ్జెక్ట్ రేపటి దిక్సూచిలో..

ధనాధన్..

టైమ్ మారలేదు!

- పాత సమయాల్లోనే ఐపీఎల్
- తొలి పోరులో ముంబైతో చెన్నై ఢీ
- పదకొండో సీజన్ షెడ్యూల్ విడుదల
- ఆరంభం, ముగింపు వాంఖడేలో



న్యూఢిల్లీ: దశాబ్ద కాలంగా అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ధనాధన్ క్రికెట్ సంగ్రామం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పదకొండో సీజన్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. టోర్నీలో అత్యంత విజయవంతమైన జట్ల మధ్య పోరుతో కొత్త సీజన్ ఆరంభం కానుంది. రెండేళ్ల విరామం తర్వాత బరిలోకి దిగుతున్న చెన్నై సూపర్ కింగ్స్... డిఫెండింగ్ చాంపియన్, అత్యధికంగా మూడుసార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్‌తో తొలిపోరులో పోటీ పడనుంది. ముంబై వాంఖడే స్టేడియంలో ఏప్రిల్ 7న చెన్నై-ముంబై పోరుతో లీగ్ మొదలవనుంది. ఒక రోజు ముందు (ఏప్రిల్ 6) ముంబైలోనే ఆరంభ వేడుక జరగనుంది. అయితే, సర్వత్రా ఆసక్తి రేపిన మ్యాచ్ సమయాల్లో మార్పులు జరగలేదు. గత సీజన్ మాదిరిగానే తొలి మ్యాచ్ 4 గంటలకు, రెండో మ్యాచ్ రాత్రి 8 గంటలకు మొదలవనుంది. మ్యాచ్ వేళలు మార్చాలని ప్రసారదారు విజ్ఞప్తి చేసినా.. మెజారిటీ ఫ్రాంచైజీలు, యాభై శాతం వాటాదారుల నుంచి వ్యతిరేకత రావడం తో పాత టైమింగ్స్‌నే కొనసాగిస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు 11వ సీజన్ షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేసింది. ఐపీఎల్ అధికారిక వెబ్‌సైట్‌లో షెడ్యూల్‌ను ఉంచింది. ఆరంభ మ్యాచ్‌తో పాటు మే 22న క్వాలిఫయర్-1, 27న ఫైనల్‌కు వాంఖడే స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2 మ్యాచ్‌ల వేదికలు ఇంకా ప్రకటించలేదు.

మ్యాచ్ వేళలపై మల్లగుల్లాలు..

ఈ సీజన్‌లో 8 గంటలకు 48 మ్యాచ్‌లు, 4 గంటలకు 12 మ్యాచ్‌లను షెడ్యూల్ చేశారు. ఒకే రోజు రెండేసి జరిగే మ్యాచ్‌ల టైమింగ్స్‌లో మార్పులు లేకపోవడం అందరినీ ఆశ్చర్యం కలిగించింది. తొలుత మ్యాచ్ వేళలు మార్చాలని టోర్నీ ప్రసారదారు స్టార్ స్పోర్ట్స్ గత నెలలో ఐపీఎల్ పాలక మండలికి విజ్ఞప్తి చేసింది. రెండో మ్యాచ్‌ను గంట ముందుగా ఏడు గంటలకు మొదలు పెట్టాలని, వేసవి వేడి దృష్ట్యా తొలి మ్యాచ్‌ను గంటన్నర ఆలస్యంగా సాయంత్రం 5.30 ప్రారంభించాలని స్టార్ స్పోర్ట్స్ ప్రతిపాదించింది. దీనికి పాలక మండలి అంగీకరించింది. కానీ, తమను సంప్రదించకుండానే ఈ నిర్ణయం తీసుకోవడంతో కొన్ని ఫ్రాంచైజీలతో పాటు ఐపీఎల్ రెవెన్యూ మోడల్‌లో వాటాదారులుగా ఉన్న సగం మంది వ్యతిరేకత వ్యక్తం చేశారు. రాత్రి మ్యాచ్‌లు త్వరగా ఆరంభమై.. త్వరగా ముగిస్తే ప్రైమ్‌టైమ్ కవరేజ్ కూడా వస్తుందని స్టార్‌స్పోర్ట్స్ భావించింది. అలాగే, మ్యాచ్ ముగిశాక ప్రేక్షకులు ఇళ్లకు, ఆటగాళ్లు హోటళ్లకు రాత్రి పూట ఆలస్యంగా చేరుకునే సమస్య తీరుతుందని ఆశించింది. ఒకరకంగా దీనికి ప్రజల నుంచి సానుకూల స్పందనే వచ్చింది. మ్యాచ్ కోసం అర్ధ రాత్రి వరకూ మెలకువగా ఉండడం, స్టేడియాలకు వెళ్లిన వారు తిరిగి తమ గమ్యస్థానాలకు చేరుకొనేందుకు పడే ఇబ్బందులు తొలగుతాయని కోరుకున్నారు. కానీ, ఫ్రాంచైజీల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో బీసీసీఐ పాత వేళలకే మొగ్గు చూపినట్టు సమాచారం. అయినా కొన్ని ఫ్రాంచైజీలతో పాటు ప్రసారదారు తొలి మ్యాచ్‌ను 3.30, రెండో మ్యాచ్ 7 గంటలకు మొదలుపెట్టాలని ఇప్పటికీ ప్రయత్నిస్తున్నాయి. కాగా, చెన్నైతోపాటు రెండేళ్ల నిషేధం ఎదుర్కొన్న రాజస్థాన్ రాయల్స్ కూడా ఈ సీజన్‌లో పునరాగమనం చేయనుంది. ఏప్రిల్ 9న హైదరాబాద్‌లో జరిగే మ్యాచ్‌లో ఆ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఎదుర్కోనుంది. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఇండోర్, జైపూర్, కోల్‌కతా, మొహాలీ 11వ సీజన్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయి.



తెలంగాణ బాలికల విజయానందం

చాంపియన్ తెలంగాణ

ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–17 హ్యాండ్‌బాల్

మహబూబ్‌నగర్ క్రీడలు: భారత పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్-17 జాతీయ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ విద్యార్థులు సత్తా చాటారు. బాలుర, బాలికల విభాగాల్లో తెలంగాణ జట్లు చాంపియన్లుగా నిలిచాయి. రెండు విభాగాల్లోనూ ఢిల్లీ రెండో స్థానం దక్కించుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ మైదానంలో బుధవారం జరిగిన బాలుర తుదిపోరులో తెలంగాణ జట్టు 17-13తో ఢిల్లీపై గెలిచి టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. బాలికల ఫైనల్లో తెలంగాణ 10-4తో ఢిల్లీని ఓడించి విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో ఆంధ్రప్రదేశ్, బాలికల్లో హరియాణా మూడో స్థానం దక్కించుకున్నాయి. విజేతలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, డీఈఓ సోమిరెడ్డి, డీవైఎస్ఓ సత్యవాణి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హన్మంతుగౌడ్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ టి.సురేష్‌కుమార్‌లు, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రాజేశ్వర్‌గౌడ్‌లు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.



తెలంగాణ బాలుర జట్టు ఆనందహేల

కర్ణాటక ఎన్నికల రాయబారిగా

రాహుల్ ద్రావిడ్!



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): భారత మాజీ క్రికెటర్ రాహుల్ ద్రావిడ్ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల రాయబారిగా వ్యవహరించే అవకాశం కనిపిస్తోంది. ఓటు హక్కు వినియోగంతో పాటు ఉత్తములను ఎన్నుకునే విధానంపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఈసీ ప్రముఖులను రాయబారిగా నియమించుకోవడం ఆనవాయితీ. అందుకోసం స్టార్ క్రికెటర్లనుగానీ, సినిమా హీరోలని గానీ రాయబారిగా నియమించాలని చూస్తున్న ఈసీ.. ద్రావిడ్ పేరుని పరిశీలిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ విషయంపై ఈసీ ఇంకా ద్రావిడ్‌ను సంప్రదించలేదు. ద్రావిడ్‌నే కాకుండా కర్ణాటకకు చెందిన ఇతర ప్రముఖ క్రికెటర్ల పేర్లను కూడా పరిశీస్తున్నట్టు తెలిసింది.

‘ఆసియా’ ఫైనల్లో శ్యామ్



జకార్తా: ఆసియా క్రీడల టెస్ట్ ఈవెంట్‌లో తెలుగు బాక్సర్ కాకర శ్యామ్‌కుమార్ స్వర్ణ పతకం సాధించే దిశగా దూసుకెళుతున్నాడు. ఈ వైజాగ్ కుర్రాడు 49 కిలోల విభాగం బౌట్‌లో ఫైనల్ చేరాడు. సెమీఫైనల్ ప్రత్యర్థి, మలేసియా బాక్సర్ మహమ్మద్ ఫవాద్ రెజ్దాన్ నుంచి శ్యామ్‌కు వాకోవర్ లభించింది. దీంతో అతను బౌట్‌లో తలపడకుండానే నేరుగా ఫైనల్ చేరాడు. ఇక శ్యామ్‌తో కలిపి మొత్తం ఆరుగురు భారత బాక్సర్లు ఈ టోర్నీలో ఫైనల్లో ప్రవేశించారు. ఇటీవల ఇండియా ఓపెన్‌లో స్వర్ణం గెలిచిన మనీశ్ కౌశిక్ (60 కి) 5-0తో చైనీస్ తైపీ బాక్సర్ లాయ్ చు యెన్‌పై, షేక్ సల్మాన్ అన్వర్ (52 కి) 3-2తో బాబా రుసె (జపాన్)పై, ఆశిష్ (64 కి) 3-2తో లిబర్టస్ గా (ఇండోనేసియా)పై గెలిచి ఫైనల్ చేరారు. భారత మహిళల్లో శశి చోప్రా (57 కి)4-1తో రిజా పసూట్ (ఫిలిప్పీన్స్)పై, పవిత్ర (60 కి) 5-0తో వాంగ్ యెజుంగ్ (ద.కొరియా)పై గెలిచి టైటిల్‌ఫైట్‌లో నిలిచారు. మిగతా భారత బాక్సర్లలో ఎతాష్ ఖాన్ (56 కి), గ్రేవాల్ (51 కి), పవన్ (69 కి), ఆశిష్ (75 కి) కాంస్య పతకాలతో సంతృప్తిపడ్డారు.



అంతర్జాతీయ కరాటే కల్లూర్ విద్యార్థులకు పతకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): ముంబైలో ముగిసిన ఆసియా కరాటే చాంపియన్‌షిప్‌లో ఖమ్మం జిల్లా కల్లూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ టోర్నీలో మూడు స్వర్ణాలు, ఓ రజతం, ఓ కాంస్యం సాధించారు. బాలికల అండర్-16 కేటగిరిలో మనీషా (45కిలోలు), అండర్-14లో దివ్య (45 కి), శిరీష (40 కి)లు తలా ఓ స్వర్ణం, కృష్ణవేణి రజతం నెగ్గారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల శాఖ కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పతక విజేతలను అభినందించారు.



మా లక్ష్యం 5-1

చివరి వన్డేకు జట్టులో మార్పులు.. భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ

పోర్ట్‌ఎలిజబెత్: సౌతాఫ్రికా గడ్డపై తొలిసారి సిరీస్ దక్కించుకుని చరిత్ర సృష్టించిన టీమిండియా చివరి మ్యాచ్‌లో రిజర్వ్ బెంచ్ బలాన్ని పరీక్షించుకోనుంది. శుక్రవారం జరిగే ఆరో వన్డేలో జట్టులో కొన్ని మార్పులు చేస్తామని కెప్టెన్ విరాట్ కోహ్లీ తెలిపాడు. ఈ సిరీస్‌లో 17 మంది సభ్యులున్నా.. భారత్ ఇప్పటికి 12 మంది ప్లేయర్ల సేవల్నే ఉపయోగించుకుంది. తొలి ఐదు వన్డేల్లో మనీష్ పాండే, దినేశ్ కార్తీక్, మహ్మద్ షమి, శార్దూల్ ఠాకూర్, అక్షర్ పటేల్ బెంచ్‌కే పరిమితం అయ్యారు. అయితే, సిరీస్ ఫలితం ఇప్పటికే తేలినా తమ పంథా మారబోదని స్పష్టం చేశాడు. ‘ఈ సిరీస్ పూర్తయ్యాక మేం ఏయే అంశాల్లో మెరుగవ్వాలో కూర్చొని చర్చిస్తాం. ఇప్పుడైతే 4-1తో ఉండడం గొప్పగా అనిపిస్తోంది. కానీ, మేం సిరీస్‌ను 5-1తో ముగించాలని కోరుకుంటున్నాం. చివరి మ్యాచ్‌లో మరికొందరు ఆటగాళ్లకు ఆడే అవకాశం ఇస్తాం. జట్టులో మార్పులు చేసినా మా లక్ష్యం విజయమే. గెలుపు కోసం ఏం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామ’ని కోహ్లీ చెప్పుకొచ్చాడు. జట్టు సభ్యుల సమష్టి కృషి వల్లే చారిత్రక సిరీస్ విజయం సాధ్యమైందని విరాట్ అభిప్రాయపడ్డాడు.

వరల్డ్‌కప్‌పై కోహ్లీ గురి

సఫారీ గడ్డపై తొలిసారి సిరీస్ గెలుచుకోవడంతో 2019 వరల్డ్‌కప్ నెగ్గేందుకు గట్టి పునాది పడిందని కెప్టెన్ కోహ్లీ అభిప్రాయపడ్డాడు. ‘ఇక్కడ చరిత్ర సృష్టించడం గొప్పగా అనిపిస్తోంది. మా ఆటగాళ్లు బ్యాటు, బంతితో పాటు ఫీల్డింగ్‌లోనూ రాణించారు. ఎల్లప్పుడు మెరుగుదల కోరుకునే జట్టు మాది. ఈ పర్యటన తర్వాత 2019 వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకొని మేం మరింత పటిష్ఠంగా తయారవడంపై దృష్టి పెడతామ’ని కోహ్లీ చెప్పుకొచ్చాడు. 2019 వరల్డ్‌కప్‌నకు ఇంగ్లండ్ ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్ 1983లో తన తొలి వరల్డ్‌కప్‌ను ఇంగ్లిష్ గడ్డపైనే అందుకోవడం విశేషం.

అగ్రస్థానానికి భారత్

సౌతాఫ్రికాతో సిరీస్ గెలుచుకున్న టీమిండియా వన్డేల్లో మళ్లీ అగ్రస్థానానికి చేరుకుంది. ఆరు నెలల కాలంలో భారత్ అగ్రపీఠం అధిరోహించడం ఇది మూడో సారి. ఐదో వన్డేలో విజయంతో కోహ్లీసేన సఫారీ జట్టును వెనక్కునెట్టి నెంబర్ వన్ ర్యాంక్ అందుకుంది. వాస్తవానికి తొలి రెండు వన్డేలు గెలిచినప్పుడే భారత్ ‘టాప్’నకు చేరింది. కానీ, దాన్ని పదిలం చేసుకోవాలంటే ఈ ఆరు వన్డేల సిరీస్‌లో కచ్చితంగా నాలుగు మ్యాచ్‌లు నెగ్గాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే నాలుగు వన్డేలు నెగ్గిన కోహ్లీసేన ప్రస్తుతం 122 పాయింట్లతో నెంబర్ వన్ ర్యాంక్‌కు చేరుకుంది. సౌతాఫ్రికా 118 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చివరి వన్డేలోనూ నెగ్గితే భారత్ 123 పాయింట్లకు చేరుతుంది. సఫారీలు ఒక పాయింట్ కోల్పోతారు. ఇక 116 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్న ఇంగ్లండ్ త్వరలో న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌ను 5-0తో నెగ్గితే సౌతాఫ్రికాను దాటి టాప్-2కు చేరుకునే అవకాశం ఉంది.

‘కుల్ చా’తో సిరీస్ విజయం



కుల్‌దీప్, చాహల్

‘కుల్ చా’.. మైదా పిండితో తయారు చేసే ఈ రొట్టెను వివిధ రకాల కూరలతో కలిపి తినడం నార్త్ ఇండియన్స్‌కు ఎంతో ఇష్టం. ఇకపోతే..దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌ను 4-1తో చేజిక్కించుకొని కోహ్లీ సేన చరిత్ర సృష్టించడానికి ఈ ‘కుల్‌చా’నే కారణమా! మణికట్టు స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ వాలెంటైన్స్ డే సందర్భంగా చేసిన ఓ ట్వీట్‌తో భారత్ విజయానికి ‘కుల్ చా’నే కారణమంటున్నారు నెటిజన్లు. దానినే కుల్ అంటే కుల్దీప్‌ను చా అంటే చాహల్‌ను సూచిస్తూ యజ్వేంద్ర హాస్యంగా ట్వీట్ చేశాడు.



దూకుడు తగ్గించుకో

కోహ్లీకి కలిస్ సూచన

దూకుడుకు మారు పేరు భారత్ సారథి విరాట్ కోహ్లీ. మైదానం లోపలా, బయటా అతను దూకుడుగా కనిపిస్తాడు. బ్యాటింగ్‌లో ప్రత్యర్థి బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా దాడి చేసే కోహ్లీ.. తనను కవ్విస్తే మాటలతోనూ అవతలి జట్టు ఆటగాళ్లపై ఎదురుదాడికి దిగడంలో ఏ మాత్రం సందేహించడు. అయితే, సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ జాక్వస్ కలిస్ మాత్రం భారత క్రికెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లాలంటే కోహ్లీని దూకుడు తగ్గించుకోవాలని చెబుతున్నాడు. ‘ఆటగాడిగా ఉన్నట్టు నాయకుడిగా ప్రతీసారి దూకుడుగా ఉండకూడదు. ఈ విషయం కోహ్లీ తెలుసుకోవాలి. సారథిగా అతనింకా కొత్తే. అనుభవం గడించే కొద్దీ విరాట్ ప్రశాంతంగా ఉండడం అలవరుచుకుంటాడని భావిస్తున్నా. అయితే, ఆటపై అతని అంకితభావం చూస్తే ముచ్చటేస్తుంద’ని చెప్పుకొచ్చాడు. ఇక, భవిష్యత్‌లో భారత జట్టు మరింత మెరుగ్గా తయారవుతుందని కలిస్ అన్నాడు. భారత్ విదేశాల్లో తమ రికార్డును మెరుగుపరుచుకునే ప్రయత్నం చేస్తోందని, ముఖ్యంగా తమకు అలవాటు లేని బౌన్సీ వికెట్లపై రాణించడంపై దృష్టి పెట్టిందని అన్నాడు.

భార్యకు ప్రేమతో..

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ తన భార్య రితికకు ప్రేమికుల దినోత్సవం నాడు అరుదైన బహుమతిని ఇచ్చాడు. దక్షిణాఫ్రికాతో మంగళవారం జరిగిన ఐదో వన్డేలో రోహిత్ సెంచరీ కొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని గెలుచుకున్నాడుగా! ఆ ట్రోఫీని వాలంటైన్స్ డే కానుక గా భార్య రితికకు అందజేశాడు. ఈ విషయాన్ని రోహిత్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపాడు. ‘హ్యాపీ వాలంటైన్స్ డే’ రిట్స్ అని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీతో ఉన్న తన ఫొటోను రోహిత్ పోస్ట్ చేశాడు.





దేశవాళీ క్రికెట్ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్, ఆంధ్ర జట్లు నాకౌట్‌కు దూసుకుపోయాయి. గ్రూప్-డిలో హైదరాబాద్ గ్రూప్-సిలో ఆంధ్ర అగ్రస్థానాల్లో నిలిచి క్వార్టర్‌ఫైనల్‌కు చేరాయి.



నాకౌట్‌కు హైదరాబాద్

చివరి లీగ్‌లో చత్తీస్‌గఢ్‌పై విజయం • విజయ్ హజారే ట్రోఫీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): హైదరాబాద్ జట్టు విజయ్ హజారే ట్రోఫీ టోర్నీలో నాకౌట్‌కు చేరుకుంది. బుధవారం జింఖానా గ్రౌండ్స్‌లో జరిగిన గ్రూప్-డి ఆఖరి లీగ్ మ్యాచ్‌లో రాయుడు సేన 84 పరుగుల తేడాతో చత్తీస్‌గఢ్‌పై గెలుపొందింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్... సందీప్ (95 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 79) హాఫ్ సెంచరీకి కెప్టెన్ రాయుడు (65 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 46), రవితేజ (35 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 45) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌లు తోడవడంతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 280 పరుగులు చేసింది. అనంతరం 281 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన చత్తీస్‌గఢ్‌ను పేసర్ మహ్మద్ సిరాజ్ (5/37) దెబ్బతీయడంతో 44.3 ఓవర్లలో 199 పరుగులకే ఆలౌటైంది. దాంతో, ఆరు మ్యాచ్‌ల్లో ఐదో విజయంతో హైదరాబాద్ 20 పాయింట్లతో గ్రూప్-డిలో టాప్ ప్లేస్ దక్కించుకుంది. మరో మ్యాచ్‌లో రంజీ చాంపియన్స్ విదర్భను 8 వికెట్లతో కంగుతినిపించిన సౌరాష్ట్ర (16 పాయింట్లు) మెరుగైన రన్‌రేట్‌తో రెండోస్థానంతో నాకౌట్‌లో అడుగుపెట్టింది. ఇంకో మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్‌ను జార్ఖండ్ 97 పరుగులతో చిత్తుగా ఓడించింది. కాగా, క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లు ఈనెల 21 నుంచి ఢిల్లీలో జరగనున్నాయి.

తడబడి నిలబడి..

మొదట బ్యాటింగ్ ప్రారంభించిన హైదరాబాద్..ఓపెనర్లు రోహిత్ రాయుడు (13), అక్షత్ రెడ్డి (11)లతోపాటు వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ సుమంత్ (21) కూడా విఫలమవడంతో 60 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సందీప్, రాయుడు ఇన్నింగ్స్ చక్కదిద్దే బాధ్యతను భుజాలపై వేసుకున్నారు. ఈ జంట నాలుగో వికెట్‌కు 92 పరుగులు జోడించి జట్టును ముందుకు తీసుకువెళుతున్న తరుణంలో రాయుడు అవుటయ్యాడు. అనంతరం రవితేజతో కలిసి సందీప్ ఐదో వికెట్‌కు 64 పరుగులు జత చేశాడు. ఆఖర్లో భండారీ (13 బంతుల్లో మూడు ఫోర్లు, సిక్సర్‌తో 25), మెహ్దీ హసన్ (17 నాటౌట్) మెరుపులు మెరిపించారు. లక్ష్య ఛేదనలో సిరాజ్, హసన్ (2/28) ధాటికి చత్తీస్‌గఢ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో ఏమాత్రం తేరుకోలేకపోయింది. కెప్టెన్ ఖరె (71), దేశాయ్ (47) మాత్రమే రాణించారు.

ఆంధ్ర అజేయంగా..

గ్రూప్-సిలో వరుసగా ఆరో మ్యాచ్‌లోనూ నెగ్గి అగ్రస్థానంలో నిలిచిన ఆంధ్ర కూడా నాకౌట్‌కు చేరింది. చెన్నైలో బుధవారం జరిగిన గ్రూప్ ఆఖరి లీగ్‌లో ఆంధ్ర 29 పరుగులతో ముంబైని ఓడించింది.





బిహార్‌లోని భోజ్‌పూర్ జిల్లాలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ముజాహిద్ అంత్యక్రియలకు హాజరైన జనం

చనిపోయిన ఏడుగురు జవాన్లలో ఐదుగురు ముస్లింలే

▸▸ అయినా మమ్మల్ని అనుమానిస్తున్నారు: ఒవైసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: జమ్ములోని సుంజువాన్ సైనిక శిబిరంపై ఇటీవల ఉగ్రవాదులు జరిపిన దాడిలో ప్రాణత్యాగం చేసిన ఏడుగురు జవాన్లలో ఐదుగురు ముస్లింలేనని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. అయినా భారతీయ ముస్లింల దేశభక్తిని శంకిస్తున్నారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. 'మమ్మల్ని పాకిస్థానీలనేవారు.. మేం (భారతీయ ముస్లింలు) దేశం కోసం ప్రాణత్యాగం చేస్తున్నామని సుంజువాన్ దాడి ద్వారా తెలుసుకోవాలి' అని సూచించారు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దేశ రక్షణకు ప్రాణాలొడ్డుతున్న సైనికులకు మతం ఆపాదించవద్దని భారత సైన్యం హితవు పలికింది. సైన్యం ఎప్పుడూ అలాంటి అంతరాలు పాటించదని నార్తర్న్ కమాండ్ కమాండింగ్-ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ దేవరాజ్ అన్బు స్పష్టం చేశారు. కాగా.. సుంజువాన్‌లో ప్రాణత్యాగం చేసిన నలుగురు జవాన్లతోపాటు.. మరొకరి అంత్యక్రియలు వారి స్వగ్రామాల్లో నిర్వహించారు. శ్రీనగర్ సీఆర్‌పీఎఫ్ శిబిరంపై తీవ్రవాదుల దాడిలో చనిపోయిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ముజాహిద్‌ఖాన్ భౌతిక కాయానికి బిహార్‌లో బుధవారం అంత్యక్రియలు జరిగాయి.

పాక్ వద్ద సరికొత్త అణ్వాయుధాలు : అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: పాకిస్థాన్ వ్యవహారశైలిని అమెరికా మరోసారి బహిరంగంగా తప్పుబట్టింది. పాక్ సరికొత్త అణ్వాయుధాలను తయారీ చేసే పనిలో ఉందని, వాటితో మొత్తం ఆసియా భద్రతకే ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. స్వల్ప దూరంలోని లక్ష్యాలను ఛేదించే వ్యూహాత్మక ఆయుధాలు, క్రూయిజ్ క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే బాలిస్టిక్ క్షిపణులు ఇందులో ఉన్నట్లు అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ డాన్ కోట్స్ తెలిపారు. పారిస్‌లో ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ సమావేశం జరగనున్న నేపథ్యంలో అమెరికా చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

పాక్‌లో హాఫీజ్ సయీద్ ఆస్తుల స్వాధీనం

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 14: ముంబయి ఉగ్రదాడి సూత్రధారి హాఫీజ్ సయీద్ ఆస్తులను పాకిస్థాన్ ప్రభుత్వం స్తంభింప జేసింది. హాఫీజ్ సయీద్ నేతృత్వంలో స్వచ్ఛంద సంస్థలుగా నడుస్తున్న జమాత్-ఉద్-దావా, ఫలాయీ ఇన్‌సానియత్ ఫౌండేషన్ కార్యకలాపాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వాటి ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియ ప్రారంభించింది.

అమెరికా జాతీయ భద్రత సంస్థపై దాడి

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: అమెరికా రాజధాని వాషింగ్టన్ శివారులోని జాతీయ భద్రత సంస్థ(ఎన్ఎస్ఏ) కార్యాలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తి కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ముగ్గురు గాయపడ్డారు. కాల్పులు జరిపిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాల ద్వారా నిఘా వేసే విభాగం ఎన్ఎస్ఏ కేంద్ర కార్యాలయం నుంచి పని చేస్తుంది. నల్లటి ఎస్‌యూవీలో వచ్చిన వ్యక్తి కాల్పులు జరిపినట్లు భావిస్తున్నారు. మరోపక్క లూసియానాలోని న్యూ ఓర్లియన్స్‌లో ఓ ఇంట్లో పార్టీ సందర్భంగా మంగళవారం రాత్రి కాల్పులు చోటు చేసుకోగా, ఇద్దరు వ్యక్తులు మరణించారు.

ఆకాశంలోనే ఊడిన ఇంజన్ కవర్!



373 మంది ప్రయాణికులు, 10 మంది సిబ్బందితో శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి హొనలూలూ వెళుతున్న యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 777 విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. విమానం పసిఫిక్ మహాసముద్రంపై ప్రయాణిస్తోంది.. గంటలోపే హొనలూలూలో దిగాల్సి ఉంది.. సరిగ్గా అదే సమయంలో విమానం కుడివైపు ఇంజన్‌పైన ఉండే కవర్ ఊడిపోయింది. ఒక్కసారిగా ప్రయాణికులు, సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. అయితే హొనలూలూలో విమానం సురక్షితంగా కిందకు దిగడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



ఈ చిట్టితల్లి కోసం వందలమంది క్యూ!

మొరాదాబాద్, ఫిబ్రవరి 14: ఈ పాప పేరు ప్యారీ! వయసు ఆరునెలలు! బోసినవ్వులు చిందించాల్సిన చిట్టితల్లి.. గుక్కపట్టి ఏడుస్తోంది. చుట్టూ ఎందరున్నా.. దిక్కులు చూస్తోంది. ప్యారీ కోసం ఇప్పుడు వందలమంది క్యూ కట్టారు! మాకంటే మాకు దత్తత ఇవ్వండంటూ తోచిన మార్గంలో ప్రయత్నిస్తున్నారు. ఏవరా పాప.. ఏమిటా కథ?! వారం క్రితం ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్-ఆగ్రా జాతీయరహదారిపై ప్రయాణిస్తున్న వారికి చిన్నారి ఏడ్పులు వినిపించాయి. వెంటనే వారు పరిశీలించగా.. చెత్తకుప్పలో ఆరునెలల పాప కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు.. చిన్నారిని రాంపూర్‌లోని సంరక్షణ కేంద్రానికి తరలించారు. అక్కడి సిబ్బంది 'ప్యారీ' అని నామకరణం చేశారు. పాప ఉదంతం ఇటు మీడియాలో.. అటు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో మానవతామూర్తులు చలించిపోయారు. ప్యారీని దత్తత తీసుకునేందుకు 200 మందికిపైగా సంరక్షణ కేంద్రంలో, పోలీసుస్టేషన్లలో దరఖాస్తు పెట్టుకున్నారు. కొందరైతే ఏకంగా తమ పలుకుబడి ఉపయోగించి రాజకీయ నాయకుల ద్వారా పైరవీలు మొదలుపెట్టారు. తాము మాత్రం ప్యారీ తల్లిదండ్రులను గుర్తించే పనిలో ఉన్నామని, పలువురు తామే తల్లిదండ్రులమంటూ ముందుకు వస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి పాప తల్లిదండ్రులను గుర్తిస్తామని పేర్కొంటున్నారు.

ట్రంప్‌తో బిల్ గేట్స్ ఢీ

అమెరికా ఫస్ట్ భావనే తప్పు

▸▸ మన వారి కోసం ఎంత మంచి నిర్ణయాలు తీసుకున్నామనేదే ముఖ్యం

▸▸ ప్రపంచదేశాలకు సాయం అందించడమూ మనవారికి ఉద్యోగాలివ్వడమేనని వ్యాఖ్య

▸▸ మహిళలను కించపరిచే వ్యాఖ్యలు, ట్వీట్లు చేయడం మానుకోండి : మెలిండా



న్యూయార్క్, ఫిబ్రవరి 14: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న 'అమెరికా ఫస్ట్' విధానాన్ని మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ గట్టిగా తప్పుపట్టారు. ఉద్యోగాల్లో ఎక్కువగా అమెరికన్లకు అవకాశాలు కల్పించి విదేశీయుల సంఖ్యను తగ్గించే ఉద్దేశంతో తీసుకున్న ఈ విధానాన్ని ఆయన వ్యతిరేకించారు. అసలీ భావనే తప్పు అని అంటూ- 'అమెరికన్ల క్షేమం, వారి అవసరాల గురించి ఆలోచించకూడదనేది నా అభిప్రాయం కాదు.. కానీ వారి అభ్యున్నతికి మనం ఎంత మంచి నిర్ణయాలు తీసుకుంటున్నామనేతి ముఖ్యం. అమెరికా ఫస్ట్ ఈ దిశగా రూపొందించినదా? ఈ భావనే నన్ను ఆందోళనకు గురిచేస్తోంది' అని ఆయన అన్నారు. 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్' తరపున ఏటేటా వెలువరించే లేఖలో ఆయన తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించారు. భార్య మెలిండాతో కలిసి ఆయన పదోసారి ఈ లేఖను విడుదల చేశారు. 'ప్రపంచదేశాలతో కలిసి మెలిసి సాగడం వల్ల అమెరికా సహా అందరికీ లాభం.. వైదొలిగితే ప్రయోజనం శూన్యం..ఈ విషయం ఎన్నోసార్లు నిరూపితమైంది. అమెరికా పౌరులకు ఎంత సాయం జరిగిందన్నది మనం లెక్కతీస్తే- బయటిదేశాలతో కలిసి పయనించడం తెలివైన పెట్టుబడే అని తేలుతుంది' అని గేట్స్ అభిప్రాయపడ్డారు.

ట్రంప్ అనుసరిస్తున్న-'ప్రపంచదేశాలకు ముఖ్యంగా వర్ధమాన దేశాలకు సాయంలో కోత'- విధానాన్ని కూడా బిల్ గేట్స్ తీవ్రంగా నిరసించారు. 'ఈ విధానం వల్ల మా ఫౌండేషన్- అనేక రంగాల్లో- చాలా సమస్యలు ఎదుర్కొంది..ఎదుర్కొంటూనే ఉంది. వ్యాధులు, పేదరిక నిర్మూలనలో అమెరికా ప్రపంచానికే అగ్రగామి. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలను మనం కాపాడగలిగాం. ఇది కూడా ఉపాధి కల్పనే. మన పౌరులను ఎక్కువగా ఈ పనిలో పెట్టడం ఉద్యోగాలిచ్చినట్లే. అంతేకాదు. అనారోగ్యం, పేదరిక నిర్మూలన వల్ల పేద దేశాల ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా సుభిక్షంగా ఉండడమే కాదు, అమెరికా కూడా భద్రంగా ఉంటుంది. ఎక్కువ మంది ప్రజలు ఆకలితో, వ్యాధులతో అలమటించడం వల్ల ప్రపంచం కూడా సురక్షితంగా ఉండలేదు. మేం చాలాసార్లు ట్రంప్‌ను కలిశాం. గతంలో ప్రభుత్వాధినేతలను, చట్టసభల ప్రతినిధులను కలిసినట్లే ఆయననూ కలిశాం. మా అభిప్రాయాలు చెప్పాం. గతంలో ప్రభుత్వాల కంటే మేం ఈ ప్రభుత్వంతో కాస్త ఎక్కువగానే విభేదిస్తున్నాం. విదేశాల్లో మన సాయాన్ని తగ్గిస్తే అక్కడి ప్రజలు చనిపోతారు.. అపుడు అమెరికా పరిస్థితి దారుణంగా ఉంటుంది" అని బిల్ గేట్స్ వివరించారు. మహిళలను కించపరిచే వ్యాఖ్యలు, ట్వీట్లు చేయ డం మానుకోండని బిల్ గేట్స్ భార్య మెలిండా- ట్రంప్‌కు హితవు పలికారు. 'అమెరికా విలువలను ప్రపంచం ముందు సమున్నతంగా ఆవిష్కరించేట్లు మీరుండాలి తప్ప వాటిని దెబ్బతీసేట్లు కాదు' అని ఆ లేఖలో మెలిండా పేర్కొన్నారు. "ప్రజలందరినీ- ముఖ్యంగా మహిళలని సమానంగా, గౌరవంగా చూడండి. అమెరికా ఓ ఆదర్శవంతమైన దేశంగా నిలబెట్టండి. సమానత్వం అనేది ముఖ్యమైన జాతీయ సూత్రం. ఇది మీకు తెలుసు' అని మెలిండా- ట్రంప్ పేరెత్తకుండా వ్యాఖ్యానించారు.

ఇక సినిమాలు చేయను: కమల్



చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విశ్వనటుడు కమల్‌హాసన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో రాజకీయాల్లోకి వస్తున్న ఆయన సినిమాలకు గుడ్‌బై చెప్పేయాలని నిర్ణయించుకున్నారు. "నేను నటుడిగా మరణించాలనుకోవడం లేదు. ప్రజాసేవకుడిగానే మరణిస్తా" అని కమల్‌హాసన్ ప్రకటించారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న 'విశ్వరూపం-2', 'ఇండియన్-2' సినిమాలే ఆఖరు అని అమెరికాలోని ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పార్టీ ఆవిర్భావానికి ముందు కమల్ చేసిన ఈ సంచలన ప్రకటన ఆయన అభిమానులను దిగ్భ్రాంతికి గురిచేసింది. అవినీతిరహిత రాజకీయాలే లక్ష్యంగా ప్రజాజీవితంలో అడుగుపెట్టిన కమల్‌హాసన్ తన లక్ష్యం నెరవేరాలంటే రెండు పడవల మీద ప్రయాణం సాగించడం కుదరదని భావిస్తున్నారు. కాగా, ఈ నెల 21న రామనాథపురం జిల్లా రామేశ్వరంలో పార్టీని ప్రారంభించి, అదే రోజు మదురైలో మహానాడు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయన అనుచరులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.



శ్రద్ధాంజలి

మీ ధృఢసంకల్పం, కార్యదక్షత మాకు ఆదర్శనీయం

మీ ఆలోచనా దృక్పథం మాకు స్ఫూర్తిదాయకం

మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని

భగవంతుని ప్రార్థిస్తూ...

డా॥ బోళ్ళ బుల్లి రామయ్య గారు

మాజీ కేంద్ర వాణిజ్యశాఖా మంత్రివర్యులు,

చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్

వెంకటరాయపురం, తణుకు- 534 215

పశ్చిమగోదావరి జిల్లా, (ఆం.ప్ర.)

09.07.1926 - 14.02.2018

కుటుంబ సభ్యులు

యాజమాన్యము మరియు సిబ్బంది

ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్

తణుకు • తాడువాయి • భీమడోలు • కొవ్వూరు • సగ్గొండ • గుంటూరు

ది ఆంధ్రా పెట్రోకెమికల్స్ లిమిటెడ్ విశాఖపట్నం	జోసిల్ లిమిటెడ్ డోకిపర్రు	శ్రీ అక్కమాంబ టెక్స్‌టైల్స్ లిమిటెడ్ వెంకటరాయపురం
శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ లిమిటెడ్ వెంకటరాయపురం	ది ఆంధ్రా ఫారం కెమికల్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కొవ్వూరు	జయలక్ష్మి ఫెర్టిలైజర్స్ వెంకటరాయపురం

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: **K. Srinivas**, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .**Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.